సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 132

శుక్రవారం 2-8-2024



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'



SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మెడిసిన్ వదిలేసి మెడల్ కోసం...

సిఫ్త్ కౌర్ సమ్రా

మెడికల్ కాలేజీ నుంచి ప్యారిస్ ఒలింపిక్స్ వరకు

ఒలింపిక్స్‌కు సంబంధించి 'పతకాల వేట' మాట ఎలా ఉన్నా... స్ఫూర్తిదాయక కథలు ఎన్నో ఉన్నాయి. ఆ కథల్లో ఒకటి... సిఫ్త్ కౌర్ సమ్రా ప్రయాణం. డాక్టర్ కాబోయి యాక్టర్ కాలేదు కౌర్.

షూటర్ అయింది. ఆసియా క్రీడల్లో బంగారు పతకంతో మెరిసి దేశం దృష్టిని ఆకర్షించింది.

'టైమ్ మేనేజ్‌మెంట్'పై గట్టి పట్టు ఉన్న కౌర్ ఒలింపిక్స్ వరకూ వచ్చింది...



పంజాబ్‌లోని వ్యవసాయ కుటుంబంలో పుట్టిన సిఫ్త్ కౌర్ సమ్రాకు చిన్నప్పటి నుంచి చదువు అంటే ఎంత ఇష్టమో, ఆటలూ అంతే ఇష్టం. తొమ్మిది సంవత్సరాల వయసులో కౌర్‌కు కరణ్ అనే కజిన్ షూటింగ్‌లో ఓనమాలు నేర్పించాడు. గురి చూసి కొట్టే నైపుణ్యం అప్పటి నుంచే అబ్బింది. ఎంబీబీయస్ చేయాలన్న ఆమె లక్ష్యం కూడా గురి తప్పలేదు. ఫరీద్‌కోట్‌లోని జీజీఎస్ మెడికల్ కాలేజీలో చేరింది. చదువు సంగతి ఎలా ఉన్నా... షూటింగ్ గేమ్స్ ఎక్కడ జరిగినా తంచనుగా ఫాలో అయ్యేది. భోపాల్‌లో జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో కాంస్య పతకం గెలుచుకోవడం తో 'మెడికలా? మెడలా?' అనే సందిగ్ధంలోకి వచ్చింది కౌర్. 'మెడల్' అనేది 'షూటింగ్'కు ప్రతీక.

చివరికి ఆమె మెడల్ వైపే మొగ్గింది. 'కాలేజీలో 80 శాతం అటెండెన్స్' నియమం వల్ల ప్రాక్టీస్ చేయడానికి, పోటీల్లో పాల్గొనడానికి ఇబ్బందిగా ఉండేది. తాను పూర్తిగా షూటింగ్ వైపు రావాలనుకోవడానికి ఇదొక కారణం. అందరూ కౌర్‌ను 'కాబోయే డాక్టరమ్మ' అని పిలుచుకుంటున్న రోజుల్లో...'చదువు మానేసి పూర్తి సమయం షూటింగ్‌కే కేటాయించాలి అనుకుంటున్నాను' అని తల్లిదండ్రులకు చెప్పినప్పుడు వారు షాక్ అవ్వకుండా 'అలాగే అమ్మా! నీ ఇష్టం' అని చెప్పారు. అలా చెప్పడానికి ఎంతో గుండె ధైర్యం కావాలి. కూతురుపై అంతకుమించిన నమ్మకం కావాలి. ఆ నమ్మకం వారికి ఉంది. ఆ నమ్మకం పునాదిపై షూటింగ్‌లో తన కెరీర్‌ను నిర్మించుకుంది కౌర్.

2023 ఆసియా క్రీడల్లో 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్‌లో వరల్డ్ రికార్డ్ స్కోర్‌తో బంగారు పతకాన్ని గెలుచుకున్న సిఫ్త్ కౌర్ సమ్రా పేరు మారుమోగిపోయింది.

50 మీ. ఎయిర్ రైఫిల్ 3 పొజిషన్స్‌లో పర్‌ఫెక్ట్ స్కోర్ కోసం టైమ్ మేనేజ్‌మెంట్ అనేది చాలా ముఖ్యమైనది. టైమ్ మేనేజ్‌మెంట్‌పై కౌర్‌కు మంచి అవగాహన ఉంది. ఆ అవగాహనే ఆమె విజయ కారణాలలో ఒకటి. ఒత్తిడికి గురవుతున్నప్పుడు దాని నుంచి ఎలా బయటపడాలి...అనే టెక్నిక్ కూడా కౌర్‌కు బాగా తెలుసు. తన గురించి 'యాక్సిడెంటల్ షూటర్' అని చెప్పుకుంటుంది కౌర్. అయితే ఆమె విజయాలు యాక్సిడెంటల్‌గా రాలేదు. చెమట చిందించి సాధించిన విజయాలు అవి.

'మీ సక్సెస్ మంత్ర ఏమిటి.' అని అడిగితే...'మ్యాచ్‌లు అనేవి ప్రాక్టిస్ సెషన్‌లకు రీ నేమ్‌డ్ వెర్షన్‌లు మాత్రమే...అని ఒకసారి కోచ్ నాతో చెప్పారు. ఇక అప్పటి నుంచి ఆ మంత్రాన్ని అనుసరిస్తూ ఒత్తిడికి దూరంగా ఉండే ప్రయత్నం చేస్తున్నాను' అంటుంది సిఫ్త్ కౌర్ సమ్రా.

ఫ్యాషన్

మై వార్డ్‌రోబ్

మీరూ మీ వార్డ్రోబ్ లేదా మీ అమ్మాయి వార్డ్రోబ్ గురించి, డ్రెస్సింగ్ విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలను ఫొటోలతో సహా 'సాక్షి' పాఠకులతో పంచుకోవచ్చు. బాగున్న వాటిని మై వార్డ్రోబ్ శీర్షికన ప్రచురిస్తాం. మా చిరునామా: మై వార్డ్‌రోబ్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ -34. sakshifamily3@gmail.com



టీనేజర్‌కు బెస్ట్ 5

'అమ్మా!, ఈ డ్రెస్ సరిగా లేదు, ఈ డిజైన్ ఓల్డ్.. అందరిలోనూ డల్‌గా కనిపిస్తాను, అందుకే నేను ఫంక్షన్‌కు రాను' అనే మాటలు టీనేజ్ అమ్మాయిలు ఉన్న ఇంట్లో తరచూ వినిపిస్తుంటాయి. ఎంపిక చేసిన డ్రెస్ సరిగా లేదనో, మ్యాచింగ్ కుదరలేదనో ... చెప్పే మాటలు అమ్మలకు పెద్ద సవాల్‌గా ఉంటాయి. "మరో అకేషన్‌కి బెస్ట్ ది సెలక్ట్ చేద్దాం. ఇప్పటికి ఇలా రెడీ అయి పో" అని కూతుళ్లకు సర్దిచెబుతూ ఉంటారు అమ్మలు. 'ఇలాంటి ఇబ్బందికర సందర్భాలు ఎదురవకుండా సందర్భానికి తగినట్టు రెడీ అవడానికి మా అమ్మాయి విషయంలో సింపుల్‌గా అనిపించే కొన్ని టెక్నిక్స్ ఫాలో అవుతుంటాను' అని చెబుతున్నారు సంయుక్తా మరపడగ. హైదరాబాద్‌లో ఫ్యాషన్ డిజైనర్‌గానూ రాణిస్తున్న సంయుక్త చెబుతున్న విశేషాలు.

'సాధారణంగా అమ్మాయిల డ్రెస్సింగ్ కోసం తరచూ షాపింగ్ చేస్తుంటాం. బాగున్నవీ, బాగోలేనివీ వార్డ్రోబ్‌లో చాలా డ్రెస్సులు వచ్చి చేరుతుంటాయి. ప్రతీసారీ కొత్తగా అనిపించేలా డ్రెస్సింగ్ ఉండేలా చూసుకోవడం కూడా ఇబ్బందిగా అనిపిస్తుంటుంది. ప్రతీ ఈవెంట్‌కి సందర్భానికి తగినట్టు డ్రెస్సింగ్ అవడం తప్పనిసరి కాబట్టి ఈ జాగ్రత్తలు తీసుకుంటాను.

బెస్ట్ ఆఫ్ 5

క్యాజువల్‌గా బయటకు, రోజూ కాలేజీకి, పండగలు, గెట్ టు గెదర్స్, పెళ్ళిళ్లు.. ఇలా సందర్భాలను బట్టి మన డ్రెస్సింగ్ ఎలా ఉంటుందో చూసుకోవాలి. వాటిలో బెస్ట్ 5 అనేవి ఎంపిక చేసుకోవాలి.

1. సాధారణంగా బయటకు వెళ్లినప్పుడు ఫంకీ స్టైల్ ఉంటే బాగుంటుంది. అందుకు మోడర్న్ వేర్‌ని ఎంపిక చేసుకోవచ్చు. వీటిలోనే స్ట్రీట్ స్టైల్ మిక్స్ అండ్ మ్యాచ్ డ్రెసింగ్ అయితే బాగుంటుంది.
2. పండగలకు, ఎంగేజ్‌మెంట్స్‌కి సంప్రదాయ లుక్‌లో కనిపించాలి. ఇందుకు ఫ్యాన్సీ టచ్ ను మిక్సప్ చేయచ్చు. ఇండోవెస్టర్న్ డ్రెస్సింగ్ కూడా ఈ సందర్భాలలో బాగుంటుంది.
3. కాలేజీలో ప్రత్యేకమైన ఈవెంట్స్ ఉన్నా ఫంకీ లుక్‌తో ఉండే ప్లెయిన్ ఫ్యాబ్రిక్స్ బాగుంటాయి. వీటిలోనే ముదురు, లేత రంగుల కాంబినేషన్స్ ఎంపిక చేసుకోవచ్చు. వీటిలో డార్క్ కలర్ టాప్స్, లైట్ షేడ్స్ స్కర్ట్స్‌ని వార్డ్రోబ్‌లోకి చేర్చుకోవచ్చు. పూర్తి వెస్టర్న్ స్టైల్స్ కూడా కాలేజీ ఈవెంట్స్‌కు బాగుంటాయి.
4. వివాహ వేడుకలకు బెనారస్, పైథానీ, ఇకత్, పట్టుతో తయారైన ఏ ఫ్యాబ్రిక్‌తో అయినా లెహంగా, శారీ, చుడీదార్ డిజైన్స్.. ఎంపిక చేసుకోవచ్చు. వీటిలోనూ జాకెట్స్, టాప్స్.. వెస్టర్న్ స్టైల్‌లో డిజైన్ చేయించుకోవచ్చు.
5. ఒక్కో ఈవెంట్‌కు ఒక్కో స్టైల్‌లో కనిపించేలా కనీసం 5 నుంచి 6 డ్రెస్‌లు సిద్ధంగా ఉంటే వాటినే మిక్స్ అండ్ మ్యాచ్ కూడా చేసుకోవచ్చు. లెహంగా ప్లెయిన్ ఉంటే డార్క్ బ్లౌజ్ క్రాప్ టాప్స్, వెస్టర్న్ టాప్స్‌తో మిక్సప్ చేయచ్చు.

మా అమ్మాయి వార్డ్రోబ్‌లో ఇలా సందర్భానికి తగినట్టు డ్రెస్సులు ఉండేలా చూసుకోవడం వల్ల ఎంత పెద్ద అకేషన్ వచ్చినా పెద్దగా ఇబ్బందిగా అనిపించదు. దీనివల్ల టైమ్ ఆదా అవుతుంది. అనవసర షాపింగ్‌కూడా తగ్గుతుంది.''

– నిర్మలారెడ్డి

ఆభరణాల ఎంపిక

కాలేజీ ఈవెంట్స్‌కి పెద్ద పెద్ద ఇయర్ రింగ్స్ బాగుంటాయి. ముదురు రంగు డ్రెస్సుల మీదకు ముత్యాలు లేదా పెండెంట్ ఉండే సన్నని చెయిన్ ధరిస్తే చాలు. ఫ్యాన్సీ డ్రెస్సింగ్ అయితే ఇయర్ రింగ్స్‌తో మేనేజ్ చేయచ్చు. పూర్తి సంప్రదాయ లుక్ అయితే సందర్భాన్ని బట్టి టెంపుల్ జ్యువెలరీని ఎంపిక చేసుకుంటే చాలు.

– సంయుక్త మరపడగ



మెనూ కొద్దిగా మారుద్దాం!

వంటిల్లు

బ్రేక్‌ఫాస్ట్ కోసం ఇడ్లీ చేస్తే... 'అమ్మో! డెడ్లీ' అంటారు పిల్లలు. కూరగాయలతో కూరలు వండితే... 'అన్నీ పిచ్చి కూరలే' అంటారు. అందుకే... జస్ట్ ఫర్ చేంజ్. కూరగాయలతో బ్రేక్‌ఫాస్ట్... ఇడ్లీతో ఈవెనింగ్ స్నాక్ చేద్దాం. హ్యాపీగా తినకపోతే అడగండి.

వీట్ వెజిటబుల్ దోసె



కావలసినవి: గోధుమపిండి – ఒకటిన్నర కప్పులు; ఉప్పు – పావు టీ స్పూన్; నీరు – పావు కప్పు; టొమాటో ముక్కలు – పావు కప్పు; ఉల్లిపాయ ముక్కలు – పావు కప్పు; క్యారట్ తురుము – పావు కప్పు; పచ్చిమిర్చి ముక్కలు – అర టీ స్పూన్; కొత్తిమీర తరుగు– 2 టేబుల్ స్పూన్‌లు; నూనె – 6 టీ స్పూన్‌లు. **తయారీ:** ● ఒక పాత్రలో గోధుమపిండి, ఉప్పు, నీరు పోసి ఉండలు లేకుండా కలపాలి. ఇందులో నూనె మినహా మిగిలిన పదార్థాలన్నింటినీ వేసి కలపాలి. ● ఇప్పుడు పెనం వేడి చేసి దోసెలు పోసుకోవడమే. ఈ దోసెలు ఊతప్పంలా మందంగా ఉండాలి. మీడియం మంట మీద కాలనిస్తే కూరగాయ ముక్కలు చక్కగా మగ్గుతాయి. ఒకవైపు దోరగా కాలిన తర్వాత తిరగేసి రెండో వైపు కాల్చి తీస్తే హోల్ వీట్ వెజిటబుల్ దోసె రెడీ.

చిల్లీ ఇడ్లీ



కావలసినవి: ఇడ్లీ ముక్కలు – 2 కప్పులు; రెడ్ చిల్లీ సాస్ – 2 టీ స్పూన్‌లు; తరిగిన అల్లం – 2 టీ స్పూన్‌లు; తరిగిన వెల్లుల్లి– 2 టీ స్పూన్‌లు; తరిగిన పచ్చి మిర్చి – 2 టీ స్పూన్‌లు; ఉల్లిపాయ ముక్కలు – అర కప్పు; క్యాప్సికమ్ ముక్కలు – అర కప్పు; టొమాటో కెచప్ – 2 టేబుల్ స్పూన్‌లు; చక్కెర– అర టీ స్పూన్; వినెగర్– టీ స్పూన్; సోయాసాస్ – టీ స్పూన్; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నూనె – 3 టేబుల్ స్పూన్‌లు. **తయారీ:** ● పెనంలో రెండు టేబుల్ స్పూన్‌ల నూనె వేడి చేసి ఇడ్లీ ముక్కలు వేసి అంచులు రంగు మారే వరకు వేయించి పక్కన పెట్టాలి ● ఇప్పుడు అదే పెనంలో మిగిలిన నూనె వేడి చేసి అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి, ఉల్లిపాయ, క్యాప్సికమ్ ముక్కలు, వేసి వేయించాలి. ఇప్పుడు టొమాటో కెచప్, చక్కెర, వినెగర్, సోయాసాస్, రెడ్ చిల్లీ సాస్, ఉప్పు వేసి ఒక నిమిషం పాటు బాగా కలుపుతూ వేయించాలి. ఉల్లిపాయ, క్యాప్సికమ్ బాగా మగ్గిన తర్వాత ముందుగా వేయించి పెట్టుకున్న ఇడ్లీ ముక్కలు వేసి కలిపితే చిల్లీ ఇడ్లీ రెడీ. దీనిని వేడిగా సర్వ్ చేయాలి.

సినిమా

ఆ పెయిన్ నాకు తెలుసు

– అల్లు శిరీష్



"ఒకేసారి రెండు మూడు సినిమాలు చేయడాన్ని ఇష్టపడను. ఒక సినిమా తర్వాత మరో సినిమా చేయడానికి ఆసక్తి చూపిస్తుంటాను. అందుకే నా సినిమాలు కాస్త ఆలస్యంగా థియేటర్స్‌లోకి వస్తున్నాయి. కొంత బ్యాడ్ ప్లానింగ్ కూడా కారణం అనిపిస్తోంది. సాధారణంగా చిన్న, పెద్ద... ఏ సినిమా అయినా సరే అనుకున్న సమయానికి దాదాపు పూర్తి కావడం లేదు. ఎంతో కొంత ఆలస్యం అవుతున్నాయి" అని అల్లు శిరీష్ అన్నారు. అల్లు శిరీష్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బడ్డీ'. కేఈ జ్ఞానవేల్ రాజా, అధనా జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో అల్లు శిరీష్ చెప్పిన సంగతులు.

● 'బడ్డీ' కథను దర్శకుడు శామ్ చెప్పినప్పుడు టెడ్డీ బేర్ పాయింట్‌తో ఆల్రెడీ తమిళంలో 'టెడ్డీ', ఇంగ్లిష్‌లో మరో మూవీ ఉందని చెప్పాను. 'బడ్డీ' కథ విన్నాక ఓటీటీలో 'టెడ్డీ' చూడండి... కచ్చితంగా 'బడ్డీ' కొత్తగా అనిపిస్తుందని శామ్ అన్నారు. దీంతో 'బడ్డీ' కథ విన్నాను. టెడ్డీ బేర్‌లోకి ప్రాణం రావడం అనే పాయింట్ తప్ప మిగతా అంతా కొత్తగా అనిపించింది. హీరో, విలన్‌కు మధ్య ఉండే ఘర్షణ, హీరో క్యారెక్టరైజేషన్, లవ్ స్టోరీ... అంతా కొత్తగా డిజైన్ చేసినట్లనిపించింది. అందుకే 'బడ్డీ' ఒప్పుకున్నాను. ● 'బడ్డీ' పోస్టర్ బయటకు రాగానే ఇది తమిళ మూవీ 'టెడ్డీ'కి రీమేక్ కదా అనే కామెంట్స్ వినిపించాయి. 'కాదు... మేం కష్టపడి స్ట్రయిట్‌గా చేసిన తెలుగు సినిమా' అని చెప్పడమే మాకు సవాల్‌గా అనిపిస్తోంది. మేం ఎంత చెప్పినా రీమేక్ అని కామెంట్స్ చేసేవారు చేస్తూనే ఉన్నారు. అలాంటి వారిని మార్చలేం. ● 'బడ్డీ'ని గతేడాది డిసెంబరులోనే రిలీజ్ చేయాలనుకున్నాం. కానీ టెడ్డీ బేర్ ఎమోషన్స్, లుక్స్‌తో పాటు సినిమాలో మూడువేలకు పైగా గ్రాఫిక్స్ షాట్స్ ఉన్నాయి. వీటిని కరెక్ట్‌గా చేయించాలంటే చేసే ఆర్టిస్టులకు సమయం ఇవ్వాలి. అందుకే రిలీజ్ ఆలస్యమైంది. ● కథగా చెప్పాలంటే 'బడ్డీ' లవ్‌స్టోరీ. హీరో పైలట్. హీరోయిన్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్. హీరోయిన్‌కు హీరో తెలుసు. కానీ హీరోకు హీరోయిన్ తెలియదు. ఫైనల్‌గా వీరి లవ్‌స్టోరీ ఏమైంది? మధ్యలో 'బడ్డీ' క్యారెక్టర్ ఏంటి? అన్నది కథ. ● జ్ఞానవేల్ రాజాగారు సినిమాను రిచ్‌గా నిర్మించారు. నాకు ప్రొడక్షన్‌లో కాస్త అనుభవం ఉంది. కానీ నేను హీరోగా చేసే సినిమాల ప్రొడక్షన్ విషయాల్లో జోక్యం చేసుకోవాలనుకోను. ఓ ప్రముఖ నిర్మాత (అల్లు అరవింద్) తనయుడిగా, ప్రొడక్షన్ గురించి అవగాహన ఉన్న వ్యక్తిగా వేస్ట్ ప్రొడక్షన్ వల్ల కలిగే పెయిన్ నాకు తెలుసు. అందుకే వృథా ఖర్చుని ప్రోత్సహించను.

బన్నీ... హనీ... భారీ ఫైట్



● సమంత

పేరు హనీ... అంత మాత్రాన స్వీట్ గాళ్ అనుకుంటే పొరపాటే. శత్రువులను రఫ్ఫాడించేటప్పుడు గరమ్ గాళ్ అయిపోతుంది. ఈ పవర్‌ఫుల్ రోల్‌లో సమంత కనిపించనున్న సిరీస్ 'సిటాడెల్: హనీ బన్నీ. బన్నీగా వరుణ్, హనీ పాత్రలో సమంత కనిపిస్తారు. గురువారం ఈ సిరీస్ టీజర్ విడుదలైంది. ఒకవైపు వరుణ్ ధావన్... మరోవైపు సమంత.... ఇద్దరూ పోటాపోటీగా విలన్లను రఫ్ఫాడిన దృశ్యాలు ఈ టీజర్‌లో కనిపించాయి. ఈ భారీ ఫైట్‌ని సమంత అవలీలగా చేసినట్లు టీజర్ చూస్తే తెలుస్తుంది. హాలీవుడ్ టీవీ సిరీస్ 'సిటాడెల్'కి ఇండియన్ వెర్షన్ ఇది. సమంత ఓ లీడ్ రోల్‌లో 'ది ఫ్యామిలీ మేన్ 2' సిరీస్‌కి దర్శకత్వం వహించిన రాజ్ – డీకే 'సిటాడెల్'కి దర్శకులు. ఈ సిరీస్ నవంబర్ 7 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది.

మేకోవర్ సవాల్‌గా అనిపించింది

– వరుణ్ సందేశ్



"నేను ఫలానా తరహా పాత్రలే చేయాలని పరిమితులేవీ పెట్టుకోలేదు. కథ, అందులోని నా క్యారెక్టర్ నచ్చితే ఏ సినిమా అయినా చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. 'మైఖేల్' సినిమాలో విలన్‌గా చేశాను. మంచి కథ కుదిరితే వెబ్ సిరీస్‌లోనూ నటించేందుకు సిద్ధంగా ఉన్నాను" అని వరుణ్ సందేశ్ అన్నారు. వరుణ్ సందేశ్ హీరోగా ఆద్యంత్ హర్ష దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించిన చిత్రం 'విరాజి'. ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకర్ల సమావేశంలో వరుణ్ సందేశ్ పంచుకున్న విశేషాలు.

● 'విరాజి' మంచి సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ. మెంటల్ హాస్పిటల్ దగ్గర ఉన్న కొంతమంది దగ్గరకు ఆండీ (వరుణ్ సందేశ్ పాత్ర పేరు) వచ్చాక అక్కడ గందరగోళ వాతావరణం ఏర్పడుతుంది. ఎందుకు? అనేది సినిమాలో చూడాలి. ఓ సందేశం కూడా ఉంది. ఇలాంటి కథను సినిమాల పట్ల ప్యాషన్ ఉన్న మహేంద్రగారిలాంటి వారే నిర్మించగలరు. మా సినిమాను మైత్రీవారు డిస్ట్రిబ్యూట్ చేయడం సంతోషంగా ఉంది. ● 'విరాజి'లోని నా పాత్ర లుక్, మేకోవర్‌ను కొత్తగా డిజైన్ చేశారు హర్ష. రెండు డిఫరెంట్ కలర్స్‌లో హెయిర్ స్టైల్, ముక్కు పుడక, ఓ స్నేక్ టాటూ... ఇలా ఆండీ కొత్తగా కనిపిస్తాడు. ఈ మేకోవర్ నాకు కాస్త చాలెంజింగ్‌గా అనిపించింది. హెయిర్ కలరింగ్ కోసం ఏడు గంటలు, ట్యాటూస్ కోసం దాదాపు గంట పట్టేది. ప్రతి రోజూ ఒక స్నేక్ ట్యాటూ వేసుకోవాల్సి వచ్చేది. 'విరాజి' సినిమా చూసి ఎమోషనల్ అయ్యాను. మంచి సినిమా చేశామనే కాన్ఫిడెన్స్‌తో ఉన్నాం. ● నాకు 18 సంవత్సరాల వయసు ఉన్నప్పుడు 'హ్యాపీ డేస్' సినిమా చేశాను. 17 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉంటున్నాను. ఓ నటుడిగా నా ప్రయాణంలో విమర్శలు సహజమని నాకు తెలుసు. కానీ నా భార్య వితిక కాస్త ఫైర్ బ్రాండ్. అందుకే నా లుక్ గురించి వచ్చిన నెగటివ్ కామెంట్స్‌పై ఆమె అలా స్పందించారు. వితికలాంటి భార్య దొరకడం నా లక్‌గా భావిస్తున్నాను. ప్రస్తుతం 'కానిస్టేబుల్' సినిమాలో నటిస్తున్నాను. 'రాచరికం' సినిమాలో పెద్ద మీసాలతో చిత్తూరు యాస మాట్లాడే వ్యక్తిగా డిఫరెంట్ క్యారెక్టర్‌లో కనిపిస్తాను.

చాణక్య మాస్టారు



● ప్రియదర్శి

పిల్లలకు లెక్కలు చెప్పడానికి నీట్‌గా రెడీ అయి స్కూల్‌కి వెళ్లారు లెక్కల మాస్టారు చాణక్య వర్మ. ఒక విద్యార్థి హాయిగా నిద్రపోతుంటే గుర్రున చూశారు మాస్టారు. మరో ఇద్దరు బాలురు నేచురల్ కాల్ అంటూ చిటికెన వేలు చూపిస్తారు. ఇలా చదువు పట్ల నిర్లక్ష్యంగా ఉన్న ఈ విద్యార్థుల లెక్కలు ఎలా తేల్చాలా అన్నట్లు ముఖం పెడతారు మాస్టారు. చాణక్య వర్మగా ప్రియదర్శి నటించిన చిత్రం '35– చిన్న కథ కాదు'. గురువారం విడుదల చేసిన ఈ పాత్ర తాలూకు వీడియో గ్లింప్స్‌లో పైన చెప్పిన దృశ్యాలు కనిపించాయి. నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ గౌతమి, భాగ్య రాజ్ లీడ్ రోల్స్‌లో రూపొందిన చిత్రం '35–చిన్న కథ కాదు'. నంద కిశోర్ ఈమాని దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.

నిర్మాతగా దర్శకుడు ముత్యాల సుబ్బయ్య

'అరుణ కిరణం, ఎర్ర మందారం, అమ్మాయి కాపురం' తదితర చిత్రాలతో దర్శకుడిగా ప్రశంసలు అందుకుని, ఆ తర్వాత చిరంజీవితో 'హిట్లర్, అన్నయ్య', వెంకటేశ్‌తో 'పవిత్రబంధం, పెళ్ళి చేసుకుందాం', బాలకృష్ణతో 'పవిత్రప్రేమ, కృష్ణబాబు' వంటి చిత్రాలతో మరింతగా పాపులర్ అయ్యారు దర్శకుడు ముత్యాల సుబ్బయ్య.



దాదాపు యాభై చిత్రాలకు పైగా దర్శకత్వం వహించారు. 'ఆలయం' (2008) తర్వాత ఆయన దర్శకుడిగా మరో సినిమా చేయలేదు. కాగా ముత్యాల సుబ్బయ్య నిర్మాణరంగంలోకి అడుగుపెడుతున్నారు. సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిశోర్ ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై ఓ సినిమా నిర్మించనున్నారు. వి. శ్రీనివాస్ (సిప్పీ) దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో రచితా మహాలక్ష్మి, కమల్ కామరాజు ప్రధాన పాత్రధారులు. ఈ నెల 9న ఈ చిత్రం షూటింగ్‌ని ఆరంభిస్తామని ముత్యాల సుబ్బయ్య తెలిపారు. రఘుబాబు, శుభలేఖ సుధాకర్, సాహిత్య, వైష్ణవి, దేవిప్రసాద్, ఆదర్శ్ బాలకృష్ణ తదితరులు నటించనున్న ఈ చిత్రానికి కథా విస్తరణ: ముత్యాల సుబ్బయ్య, మరుధూరి రాజా, సంగీతం: కోటి, కెమెరా: ఎస్. సుధాకర్ రెడ్డి.

విజిల్స్ వేస్తూ చూడాలి

– పవన్ కుమార్



పవన్ కుమార్ కొత్తూరి స్వీయదర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. స్నేహా మాల్వియ, సాహిబా బాసిన్ హీరోయిన్లుగా నటించారు. పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ద్వారా ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ – ''ఇది స్టూడెంట్ లైఫ్ స్టోరీ. కథ ప్రకారం హీరో డీ–గ్లామరస్‌గా ఉండాలని ముందే ఫిక్స్ అయ్యా. నేను షార్ట్ ఫిల్మ్స్ చేసే సమయంలో హీరో, డైరెక్షన్... ఇలా అని క్రాఫ్ట్సును హ్యాండిల్ చేశాను. కానీ ఫీచర్ ఫిల్మ్ విషయంలో మల్టీపుల్ డిపార్ట్మెంట్స్‌ని హ్యాండిల్ చేయడం కష్టం అనిపించింది. ఇది థియేటర్స్‌లో విజిల్స్ వేస్తూ చూడాల్సిన సినిమా'' అన్నారు.

మెడికో థ్రిల్లర్‌లో...

అశ్విన్‌బాబు హీరోగా ఓ మెడికో థ్రిల్లర్ మూవీ రూపొందుతోంది. ఆగస్టు 1న అశ్విన్ బర్త్ డే సందర్భంగా ఈ చిత్రంలోని తన స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు. మామిడాల ఎం.ఆర్. కృష్ణ దర్శకత్వంలో అరుణశ్రీ ఎంటర్ టైన్మెంట్స్‌పై ప్రొడక్షన్ నంబర్ 3గా ఈ చిత్రాన్ని టి. గణపతి రెడ్డి నిర్మిస్తున్నారు. ''ఇప్పటివరకూ హైదరాబాద్, వైజాగ్, కొడైకెనాల్‌లో జరిపిన షూటింగ్‌తో 75 శాతం సినిమా పూర్తయింది. అన్ని వర్గాలవారినీ ఆకట్టుకునేలా ఈ మూవీని రూపొందిస్తున్నాం. ఈ సంవత్సరం చివరిలో సినిమాని రిలీజ్ చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. అశ్విన్‌బాబుకి జోడిగా రియా సుమన్ నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గౌర హరి, కెమెరా: ఎం. ఎస్ బాల్ రెడ్డి.



● అశ్విన్

గద్దర్ అవార్డ్స్‌కు టీఎఫ్‌సీసీ సహకారం ఉంటుంది

– ప్రతాని రామకృష్ణ గౌడ్

''ప్రభుత్వం అవార్డ్స్ ఇచ్చి కొన్నేళ్లయిన నేపథ్యంలో ఇప్పుడు చిత్ర పరిశ్రమలోని అన్ని విభాగాలకు ప్రజా గాయకుడు, నాయకుడు గద్దర్ పేరిట అవార్డు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం గొప్ప విషయం. మా తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) తరఫున ఈ అవార్డు వేడుకకు పూర్తి సహకారం ఉంటుంది'' అని టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ''గద్దర్ అవార్డ్స్ ఇవ్వాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిగారికి సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిగారికి మా ధన్యవాదాలు'' అంటూ టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్, ఉపాధ్యక్షులు జేవియర్, గురురాజ్, కార్యదర్శి సాగర్, సలహాదారు ఏయం రత్నం ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎమోషన్స్‌కు కనెక్ట్ అవుతారు

– కృష్ణవంశీ



కృష్ణవంశీ, మోక్ష హీరో హీరోయిన్లుగా చిలుకూరి ఆకాశ్ రెడ్డి దర్శకత్వంలో హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మించిన చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. నేడు ఈ సినిమా విడుదలవుతోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ ఈ మూవీని రిలీజ్ చేస్తోంది. గురువారం విలేకర్ల సమావేశంలో కృష్ణవంశీ మాట్లాడుతూ– ''నాకు సినిమాలంటే ఆసక్తి. కాలేజీలో ఓ షార్ట్‌ఫిల్మ్‌లో కూడా నటించాను. ఇంజనీరింగ్ పూర్తయ్యాక క్యాంపస్‌లో ఉద్యోగం వస్తే కొంతకాలం చేశాను. కానీ సినిమాలపై ఆసక్తితో కోవిడ్ సమయంలో వైజాగ్‌లో సత్యానంద్‌గారి దగ్గర యాక్టింగ్‌లో శిక్షణ తీసుకున్నాను. ఆ తర్వాత హైదరాబాద్‌లో ఆకాశ్‌గారు పరిచయం అయ్యారు. ఆయన 'అలనాటి రామచంద్రుడు'కి ఆడిషన్ చేసి, నన్ను తీసుకున్నారు. ఈ చిత్రంలో నేను ఇంట్రోవర్ట్‌గా ఉండే సిద్ధు పాత్ర చేశాను. ఏ మూవీలో అయినా ఎమోషన్స్ ఉంటే ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. ఈ సినిమాలో తండ్రి–కూతురు, తల్లి–కొడుకుల అనుబంధం నేపథ్యంలో మంచి ఎమోషనల్ సీన్స్ ఉన్నాయి. మా సినిమాని సపోర్ట్ చేస్తున్న 'దిల్' రాజుగారికి థ్యాంక్స్'' అన్నారు.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 132

శుక్రవారం 2-8-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



ఇక వన్డే సమరం

నేడు భారత్, శ్రీలంక జట్ల మధ్య తొలిపోరు జరగనుంది. అయితే మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉంది. ఇప్పటికే టి20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన భారత జట్టు వన్డే ఫార్మాట్‌లోనూ మరో క్లీన్‌స్వీప్ లక్ష్యంగా బరిలోకి దిగనుంది. రోహిత్, కోహ్లి రాకతో టీమిండియా మరింత పటిష్టంగా మారింది. మధ్యాహ్నం గం. 2:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

–స్పోర్ట్స్‌లో

సాక్షి బిజినెస్
శుక్రవారం
2-8-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	126	81,868
నిఫ్టీ ▲	60	25,010

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ		మార్పు
నాస్‌డాక్	17,123	▼ 476
డోజోన్స్	40,210	▼ 633
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,283	▼ 85
డాక్స్	18,083	▼ 426
షాంఘై	2,932	▼ 6
నికాయ్	38,126	▼ 975

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	69,721 ▲	412
బంగారం (99.5 స్వచ్ఛత)	69,442 ▲	411
వెండి (కిలో)	83,464 ▲	490

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.32	84.34
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.45	109.03
€	యూరో	ఎస్‌బీఐ	89.60	91.97
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.25	55.47
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.59	55.52
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.32	65.01
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.43	22.99
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.91	23.69
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.73	12.55

జీఎస్‌టీ వసూళ్లు @ 1.82 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: భారత్ వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు జూలైలో గత ఏడాది ఇదే కాలంతో పోల్చిచూస్తే, 10.3 శాతం పెరిగి రూ.1.82 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2017 జూలై 1వ తేదీన కొత్త పరోక్ష పన్ను వసూళ్ల వ్యవస్థ ప్రారంభమైన తర్వాత ఇవి మూడవ అతిపెద్ద భారీ వసూళ్లు. విభాగాల వారీగా చూస్తే మొత్తం వసూళ్లు రూ.1,82,075 కోట్లు. ఇందులో సెంట్రల్ జీఎస్‌టీ రూ.32,386 కోట్లు. స్టేట్ జీఎస్‌టీ రూ. 40,289 కోట్లు. ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.96,447 కోట్లు. సెస్ రూ.12,953 కోట్లు. 2024 ఏప్రిల్‌లో 2.10 లక్షల కోట్లు రికార్డు జీఎస్‌టీ వసూలయ్యాయి. అంతక్రితం 2023 ఏప్రిల్‌లో వసూళ్లు రూ.1.87 లక్షల కోట్లు. ఆ రెండు నెలల తర్వాత ఈ స్థాయి వసూళ్లు ఇదే తొలి సారి కావడం గమనార్హం.

పీఎన్‌బీ రుణ రేటు పెంపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రుణ రేటు అన్ని కాలపరిమితులపై స్వల్పంగా 5 బేసిస్ పాయింట్లు (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) పెరిగింది. నిధుల సమీకరణ వ్యయ ఆధారిత (ఎంసీఎల్‌ఆర్) రుణ రేటు 0.05 శాతం పెరగడంతో దీనికి అనుసంధానమైన అన్ని కాల పరిమితుల రుణరేట్లు పెరగనున్నాయి. మారిన రేట్లు 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. ఆటో, వ్యక్తిగత రుణాలుసహా దాదాపు కన్జూమర్ లోన్లు అన్నింటికి అనుసంధానమయ్యే ఏడాది కాలపరిమితి ఎంసీఎల్‌ఆర్ రుణరేటు 8.85 శాతం నుంచి 8.90 శాతానికి ఎగసింది.

జూలైలో 'తయారీ' నెమ్మది



న్యూఢిల్లీ: భారత్ తయారీ రంగం జూలైలో నెమ్మదించింది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) జూన్‌లో 58.3 వద్ద ఉంటే, జూలైలో 58.1 వద్దకు తగ్గింది. కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి తగ్గడం దీనికి కారణం.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
అదానీ ఎంటర్‌ప్రైజెస్ హైజంప్ | ట్రావెల్ ఆపరేటర్లకు అనుకూలం

నిఫ్టీ.. సిల్వర్ జూబ్లీ!



- ఇంట్రాడే, ముగింపుల్లోనూ సరికొత్త రికార్డులు
- సూచీలకు అయిదో రోజూ లాభాలు
- ఫెడ్ వడ్డీరేట్ల తగ్గింపు సంకేతాల ప్రభావం

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ చరిత్రలో గురువారం ఓ మరపురాని అద్భుతం చోటు చేసుకుంది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ ఎన్‌ఎస్‌ఈ తొలిసారి 25,000 పాయింట్ల శిఖరాన్ని అధిరోహించింది. సెన్సెక్స్, నిఫ్టీలు ఇంట్రాడే, ముగింపుల్లోనూ సరికొత్త రికార్డులు నెలకొల్పాయి. సెప్టెంబర్‌లో వడ్డీరేట్ల తగ్గింపు ఉండొచ్చని ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ సంకేతాలతో ఆయిల్‌అండ్‌గ్యాస్, బ్యాంకింగ్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా సెన్సెక్స్ 126 పాయింట్లు పెరిగి 81,868 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 60 పాయింట్లు బలపడి 25 వేల స్థాయిపైన 25,011 వద్ద నిలిచింది. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ షేర్లు సూచీలను ముందుకు నడిపించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 388 పాయింట్లు బలపడి 82,129 వద్ద, నిఫ్టీ 127 పాయింట్లు ఎగసి 25,078 వద్ద జీవితకాల గరిష్టాలు అందుకున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతల ప్రభావంతో మిడ్ సెషన్ నుంచి గరిష్టాల వద్ద ఇన్వెస్టర్లు ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, యుటిలిటీ, టెక్ షేర్లలో లాభాల స్వీకరణకు మొగ్గుచూపారు. దీంతో సూచీలు ఆరంభ లాభాలు కోల్పోయి స్వల్ప లాభాలతో ముగిశాయి. కాగా అమెరికా మార్కెట్లు భారీ నష్టాలతో ట్రేడవుతున్నాయి.



25,000 ప్రయాణం ఇలా..

- 1996, ఏప్రిల్ 22న 13 కంపెనీల లిస్టింగ్‌తో నిఫ్టీ సూచీ 1000 పాయింట్ల వద్ద ప్రయాణం ప్రారంభించింది. తొలినాళ్లలో దేశంలో తీవ్ర రాజకీయ అస్థిరత (1996-98), తర్వాత ఆసియా ఆర్థిక సంక్షోభం, డాట్‌కామ్ బబుల్, ప్రపంచ ఆర్థిక సంక్షోభం(2007) ప్రతికూల ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ తొలిసారి 5,000 పాయింట్లను చేరేందుకు 11 ఏళ్లు పట్టింది.
- సత్యం కుంభకోణం, యూరోపియన్ రుణ సంక్షోభం, ట్యాపర్ తంత్రం, జీఎస్‌టీ అమలు సవాళ్ల ఆటుపోట్లను ఎదుర్కొని 25 జూలై 2017న 10,000 మైలురాయిని చేరింది.
- ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ సంక్షోభం, కార్పొరేట్ పన్ను, కోవిడ్ మహమ్మారి సూచీని పట్టి కుదిపాయి. కరోనా తొలి వేవ్ సమయంలో 7,600కు పడిపోయిన నిఫ్టీ కేవలం 220 రోజుల్లోనే రెండింతలకు కోలుకోవడం విశేషం. ఈ క్రమంలో 5 ఫిబ్రవరి 2021న 15,000 స్థాయిని అందుకుంది.
- కరోనా వేళ పెంచిన వడ్డీరేట్లను తగ్గించేందుకు, పెరిగిన ద్రవ్యోల్బణ కట్టడికి ఆర్‌బీఐ, ఫెడ్ రిజర్వ్‌తో పలు దేశాల కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్ల పెంపు ప్రారంభం ప్రక్రియ ప్రారంభించాయి. ఇదే సమయంలో ఇజ్రాయిల్ - పాలస్తీనా యుద్ధ భయాలు తెరపైకి వచ్చాయి. ఈ సవాళ్లను ధీటుగా ఎదుర్కొని గతేడాది (2023) సెప్టెంబర్ 11న 20,000 స్థాయికి చేరింది.
- ఇక 20,000 స్థాయి నుండి 25000 పాయింట్లు చేరేందుకు 220 ట్రేడింగ్ సెషన్ల సమయం తీసుకుంది. సూచీకి ఇదే అత్యంత వేగవంతమైన 5,000 పాయింట్ల లాభం.

టాటా మోటార్స్ లాభం జంప్

క్యూ1లో రూ. 5,556 కోట్లు; 74 శాతం అప్

న్యూఢిల్లీ: దేశీ వాహన దిగ్గజం టాటా మోటార్స్ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (2024-25, క్యూ1)లో బంపర్ ఫలితాలను ప్రకటించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 74 శాతం జంప్ చేసి రూ. 5,566 కోట్లకు ఎగబాకింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ. 3,204 కోట్లుగా నమోదైంది. ముఖ్యంగా దేశీ వాహన వ్యాపారంతో పాటు జాగ్వార్ ల్యాండ్‌రోవర్ (జేఎల్‌ఆర్) పటిష్టమైన పనితీరు ఇందుకు దోహదం చేసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,03,597 కోట్ల నుంచి రూ. 1,09,623 కోట్లకు వృద్ధి చెందింది. స్టాండెలోన్ ప్రాతిపదికన (దేశీ కార్యకలాపాలు) క్యూ1లో కంపెనీ రూ. 2,190 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది క్యూ1లో రూ. 64 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. స్టాండెలోన్ ఆదాయం రూ. 16,132 కోట్ల నుంచి రూ. 18,851 కోట్లకు పెరిగింది. ఇక జూన్ క్వార్టర్‌లో జేఎల్‌ఆర్ ఆదాయం కొత్త రికార్డులను తాకింది. 5 శాతం వృద్ధితో 7.3 బిలియన్ పౌండ్ల ఆదాయాన్ని ఆర్జించింది.



టాటా మోటార్స్ షేరు ధర 1 శాతం లాభపడి రూ.1,145 వద్ద ముగిసింది.

కంపెనీ విభజనకు బోర్డు ఓకే...

టాటా మోటార్స్‌ను రెండు వేర్వేరు లిస్టెడ్ కంపెనీలుగా విడగొట్టే ప్రతిపాదనను కంపెనీ బోర్డు ఆమోదించింది. దీని ప్రకారం, టాటా మోటార్స్ లిమిటెడ్ (టీఎంఎల్) నుంచి వాణిజ్య వాహన వ్యాపారాన్ని టాటా మోటార్స్ సీవీగా విభజిస్తారు. ప్రస్తుత పీవీ వ్యాపారం టీఎంఎల్‌లో విలీనం అవుతుంది. విభజన తర్వాత టీఎంఎల్‌సీవీ, టీఎంఎల్ పేర్ల మార్పుతో పాటు రెండు వేర్వేరు లిస్టెడ్ కంపెనీలుగా కొనసాగుతాయని కంపెనీ తెలిపింది. ఇది పూర్తయ్యేందుకు 12-15 నెలలు పట్టొచ్చని వెల్లడించింది.

వాహన అమ్మకాలకు బ్రేకులు



ముంబై: వినియోగదారుల నుంచి డిమాండ్ తగ్గడంతో జూలైలో వాహన విక్రయాలు నెమ్మదించాయి. దిగ్గజ ఆటో కంపెనీలైన మారుతీ సుజుకీ, హ్యుందాయ్ మోటార్స్, టాటా మోటార్స్, అమ్మకాలు తగ్గాయి.

కంపెనీ	జూలై 2024	జూలై 2023	(%ల్లో)
మారుతీ సుజుకీ	1,75,041	1,81,630	(-)4
హ్యుందాయ్ మోటార్స్	64,513	66,701	(-)3
టాటా మోటార్స్	71,996	80,633	(-)11
ఎండ్‌అండ్‌ఎం	66,444	66,124	(+)0.5
హోండా కార్స్	4,624	4,864	(-)5
టయోటా కిర్లోస్కర్	31,656	21,911	(+)44
కియా మోటార్స్	20,507	20,002	(2)%
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,54,169	3,19,747	(+)11
టీవీఎస్ మోటార్స్	3,54,140	3,25,977	(+)9
రాయల్ ఎన్‌ఫీల్డ్	67,265	73,117	(-)8
హెచ్‌ఎంఎస్‌ఐ	4,83,100	338,310	(+)43%
వాణిజ్య వాహనాలు			
అశోక్ లేలాండ్	13,928	15,068	(-)8

ఐటీసీ లాభం ఫ్లస్

క్యూ1లో రూ. 5,177 కోట్లు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం నామమాత్రంగా తగ్గి రూ. 5,177 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 5,190 కోట్లు ఆర్జించింది. స్థూల ఆర్థిక పరిస్థితులు, నిర్వహణ వాతావరణం సవాళ్లు విసరడం ప్రభావం చూపింది. మొత్తం ఆదాయం మాత్రం 7.5 శాతం పుంజుకుని రూ. 20,030 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 18,639 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఇతర ఆదాయంతో కలిపితే మొత్తం టర్నోవర్ 7 శాతం అధికంగా రూ. 20,724 కోట్లను తాకింది. అయితే మొత్తం వ్యయాలు 11 శాతం పెరిగి రూ. 13,791 కోట్లకు చేరాయి.

విభాగాలవారీగా..: ప్రస్తుత సమీక్షా కాలంలో ఐటీసీ మొత్తం ఎఫ్‌ఎంసీజీ విభాగం అమ్మకాలు 6 శాతం పుంజుకుని రూ. 14,341 కోట్లను తాకాయి. సిగరెట్ల బిజినెస్ ఆదాయం 6 శాతం వృద్ధితో రూ. 8,842 కోట్లను దాటింది. హోటళ్ల విభాగం నుంచి 14 శాతం అధికంగా రూ. 713 కోట్ల ఆదాయం లభించింది.

ఐటీసీ షేరు 0.3 శాతం నీరసించి రూ. 494 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్


జెంగ్ కిన్‌వెన్

నంబర్‌వన్ స్వియాటెక్‌కు షాక్

పారిస్ ఒలింపిక్స్ మహిళల టెన్నిస్ సింగిల్స్ విభాగంలో కచ్చితంగా స్వర్ణ పతకం సాధిస్తుందనుకున్న ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్‌కు ఊహించని పరాజయం ఎదురైంది. గురువారం జరిగిన సెమీఫైనల్లో జెంగ్ కిన్‌వెన్ (చైనా) 6-2, 7-5తో స్వియాటెక్ (పోలాండ్)ను కంగుతినిపించింది. యేటా ఫ్రెంచ్ ఓపెన్ జరిగే క్లే కోర్టులోనే విశ్వక్రీడలకు సంబంధించిన టెన్నిస్ పోటీలు జరుగుతున్నా... ఇక్కడ ఎదురులేని పోలాండ్ స్టార్ వరుస సెట్‌లలోనే పరాజయం చవిచూసింది. దీంతో ఒలింపిక్స్‌లో చైనాకు తొలి సింగిల్స్ పతకాన్ని జెంగ్ కిన్‌వెన్ ఖాయం చేసింది. గత ఐదేళ్లలో నాలుగు ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించిన స్వియాటెక్ ఇప్పుడిక కాంస్యం కోసం ఆడుతుంది. పురుషుల సింగిల్స్‌లో స్పెయిన్ స్టార్ అల్‌కరాజ్ సెమీఫైనల్ చేరుకున్నాడు. క్వార్టర్స్‌లో అల్‌కరాజ్ 6-3, 7-6 (7/5)తో టామీ పాల్ (అమెరికా)పై గెలుపొందాడు.





భారత హాకీ జట్టుకు తొలి ఓటమి

పారిస్ ఒలింపిక్స్‌లో భారత పురుషుల హాకీ జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. ఇప్పటికే క్వార్టర్ ఫైనల్ బెర్త్ దక్కించుకున్న హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం గురువారం పూల్ 'బి' మ్యాచ్‌లో 1-2 గోల్స్ తేడాతో డిఫెండింగ్ ఒలింపిక్ చాంపియన్ బెల్జియం చేతిలో ఓడింది. ఆట 18వ నిమిషంలో అభిషేక్ తొలి గోల్ నమోదు చేసి టీమిండియాకు ఆధిక్యం అందించగా... మూడో క్వార్టర్‌నుంచి చెలరేగిన బెల్జియం రెండు గోల్స్ చేసి గెలిచింది. ఆ జట్టు తరఫున స్టాక్‌బ్రోక్స్ (33వ నిమిషంలో), జాన్ దోమెన్ (44వ ని.లో) చెరో గోల్ కొట్టారు. తొలి క్వార్టర్‌లో జోరు కనబర్చిన హర్మన్‌ప్రీత్ సేన.. ఆ తర్వాత దాన్ని కొనసాగించడంలో విఫలమైంది. గత మ్యాచ్‌లతో పోలిస్తే బెల్జియంతో పోరులో భారత జట్టు రక్షణపంక్తి నిరాశ పర్చింది. ఈ మ్యాచ్‌లో టీమిండియా ప్రత్యర్థికి 11 పెనాల్టీ కార్నర్‌లు సమర్పించుకోగా... బెల్జియం కేవలం మూడు పెనాల్టీ కార్నర్‌లే ఇచ్చింది. గోల్ కీపర్ పీఆర్ శ్రీజేశ్ అద్వితీయ ప్రదర్శన కారణంగానే బెల్జియం రెండు గోల్స్‌తో సరిపెట్టుకుంది. అంతకుముందు న్యూజిలాండ్‌పై (3-2 గోల్స్ తేడాతో), ఐర్లాండ్‌పై (2-0 గోల్స్ తేడాతో) గెలిచిన టీమిండియా... అర్జెంటీనాతో మ్యాచ్‌ను 'డ్రా' చేసుకుంది. చివరి లీగ్ మ్యాచ్‌లో నేడు ఆస్ట్రేలియాతో భారత్ ఆడుతుంది.

ఇక వన్డే సమరం

- నేడు భారత్, శ్రీలంక మధ్య తొలిపోరు
- మ్యాచ్‌కు వర్షం ముప్పు
- మరో క్లీన్‌స్వీప్‌పై రోహిత్ సేన దృష్టి
- కోహ్లి రాకతో మరింత పటిష్టం
- లంకకు కొత్తగా గాయాల బెడద
- మధ్యాహ్నం గం. 2:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం


రోహిత్, కోహ్లి చేరడంతో...

కొలంబో: ఓ పరిమిత ఓవర్ల సమరాన్ని వైట్‌వాష్ చేసిన భారత జట్టు ఇప్పుడు రెట్టించిన ఉత్సాహంతో మరో ఫార్మాట్‌నూ క్లీన్‌స్వీప్ చేసేందుకు సిద్ధమైంది. ఆతిథ్య శ్రీలంకతో శుక్రవారం నుంచి మూడు వన్డేల సిరీస్ ఆరంభమవుతోంది. పొట్టి ఫార్మాట్‌లో సూర్యకుమార్, కొత్త కోచ్ గౌతమ్ గంభీర్ కాంబినేషన్ విజయవంతమైంది. ఇప్పుడు రోహిత్-గంభీర్‌ల వంతు వచ్చింది. తొలి మ్యాచ్‌లో శుభారంభం చేయడం ద్వారా సిరీస్‌పై పట్టుసాధించాలని టీమిండియా భావిస్తోంది. టి20 ప్రపంచకప్ విజయానంతరం రోహిత్, కోహ్లి ఆడుతున్న తొలి సిరీస్ ఇదే. వీరిద్దరి రాకతో పెరిగిన బ్యాటింగ్ బలం భారత జైత్రయాత్రకు కచ్చితంగా దోహదం చేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. మరోవైపు సొంతగడ్డపై మూడు టి20ల్లో ఓడిన శ్రీలంక జట్టు కనీసం వన్డే ఫార్మాట్‌లోనైనా పుంజుకోవాలని ఆశిస్తోంది. మారిన ఫార్మాట్‌లో ఓటమి రాతను మార్చుకోవాలని గంపెడాశలతో బరిలోకి దిగుతోంది.

భారత టాప్‌స్టార్లు రోహిత్ శర్మ, కోహ్లిలు లేని భారత జట్టు టి20 ఫార్మాట్‌లో క్లీన్‌స్వీప్ చేసింది. ఆఖరి పోరు అయితే హైలైట్! ఓటమి కోరల్లోంచి సూపర్ విజయం దాకా సూర్యకుమార్ సేన పోరాటం ఆకట్టుకుంది. అలాంటి జట్టుకు ఇప్పుడు రోహిత్, కోహ్లిలు కలవడంతో బ్యాటింగ్ దుర్భేద్యంగా మారింది. దీంతో 20 ఓవర్లకే ఆపసోపాలు పడిన లంక బౌలర్లకు వన్డేల్లో మరింత కష్టాలు తప్పవేమో! హార్దిక్, సూర్య వన్డే జట్టులో లేకపోవడంతో హిట్టర్లు దూబే, పరాగ్‌కు లక్కీ చాన్స్ కానుంది. మూడు వన్డేల్లో వీరిలో ఎవరికి ఎక్కువ అవకాశాలొస్తాయో చూడాలి. భారత్ ఇద్దరు స్పిన్నర్లు అక్షర్, కుల్దీప్‌లతో పాటు ముగ్గురు పేసర్ల తో బరిలోకి దిగాలనుకుంటే ఖలీల్ అహ్మద్ లేదంటే హర్షిత్ రాణాల్లో ఒకరు సిరాజ్, అర్ష్‌దీప్‌లతో బంతిని పంచుకుంటారు.



అయ్యో... కష్టాల లంక!

టి20 ఫార్మాట్‌లో చేతులెత్తేసిన శ్రీలంక ఇప్పుడు వన్డేల్లో అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. గత సిరీస్ ఫలితాన్ని పక్కనబెట్టి కొత్త ఫార్మాట్‌ను తాజాగా ఆరంభించాలనుకుంటుంది. ఓపెనర్లు నిసాంక, కుశాల్ మెండీస్ ఫామ్‌లో ఉన్నప్పటికీ... తర్వాత బ్యాటింగ్ ఆర్డర్‌లో వచ్చేవారిలో కెప్టెన్ చరిత్ అసలంక సహా ఎవరికి నిలకడే లేదు. ఇదే లంక బ్యాటింగ్ దళానికి శాపంగా మారింది. ఇప్పుడున్న కష్టాలు చాలవన్నట్లు వన్డేలకు ముందు గాయాల బెడద లంకను పీడిస్తోంది. 50 ఓవర్ల మ్యాచ్‌లకు కీలకమైన పేసర్లు పతిరణ, మదుషంక గాయాల కారణంగా దూరమయ్యారు. ఆఖరి టి20లో క్యాచ్ కోసం డైవ్ చేసిన పతిరణ కుడి మోచేతికి గాయమైంది. ఫీల్డింగ్ ప్రాక్టీస్‌లో మదుషంక ఎడమకాలి తొడ కండరాలు పట్టేయడంతో ఇద్దరు మొత్తం వన్డే సిరీస్‌కే అందుబాటులో లేకుండా పోయారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత్‌ను ఎదుర్కోవడమంటే ఏటికి ఎదురీదడమే తప్ప ఏమాత్రం సులువు కానేకాదు.


పిచ్, వాతావరణం

బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్. భారీస్కోరు ఆశించొచ్చు. అలాగే స్పిన్నర్లకు తిప్పేసే చాన్స్ ఉంది. కానీ మ్యాచ్‌కు శుక్రవారం వానముప్పు ఉంది. రోజంతా భారీవర్షం కురిసే అవకాశముందని స్థానిక వాతావరణ శాఖ తెలిపింది.

జట్లు (అంచనా)


భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, కేఎల్ రాహుల్/పంత్, దూబే/పరాగ్, కుల్దీప్, అక్షర్, సిరాజ్, అర్ష్‌దీప్, హర్షిత్. శ్రీలంక: అసలంక (కెప్టెన్), నిసాంక, కుశాల్ మెండీస్, సమరవిక్రమ, కమిందు, జనిత్, కురణరత్నే, హసరంగ, తీక్షణ, షిరాజ్/ఇషాన్ మలింగ, ఫెర్నాండో.

ప్రవీణ్ తొలి రౌండ్‌లోనే...




పారిస్ ఒలింపిక్స్ ఆర్చరీ పురుషుల వ్యక్తిగత విభాగంలో భారత్ పోరాటం ముగిసింది. ఇప్పటికే తెలుగు కుర్రాడు బొమ్మదేవర ధీరజ్, సీనియర్ ఆర్చర్ తరుణ్‌దీప్ రాయ్ నాకౌట్ మ్యాచ్‌ల్లో పరాజయం పాలవగా... బరిలో మిగిలిన ఏకైక భారత ఆర్చర్ ప్రవీణ్ జాధవ్ కూడా ఇంటిదారి పట్టాడు. వ్యక్తిగత రికర్వ్ తొలి రౌండ్‌లో ప్రవీణ్ 0-6 (28-29, 29-30, 27-28)తో వెన్‌చావో (చైనా) చేతిలో ఓడాడు. ఇక మహిళల వ్యక్తిగత విభాగంలో దీపిక కుమారి, భజన్ కౌర్ శనివారం ప్రిక్వార్టర్స్ బరిలో దిగనున్నారు.

నడకలో నిరాశ




పారిస్ ఒలింపిక్స్ అథ్లెటిక్స్ పోటీల తొలి రోజు భారత్‌కు నిరాశ తప్పలేదు. 20 కిలోమీటర్ల రేస్ వాక్‌లో మన అథ్లెట్లు ఆకట్టుకోలేకపోయారు. మహిళల విభాగంలో ప్రియాంక గోస్వామి 1 గంటా 39 నిమిషాల 55 సెకన్లలో లక్ష్యాన్ని చేరి 41వ స్థానంతో సరిపెట్టుకుంది. ఆసియా క్రీడల్లో రజత పతకం సాధించి ఆశలు రేపిన ప్రియాంక... 'పారిస్' క్రీడల్లో అదే ప్రదర్శన కనబర్చలేకపోయింది. 28 ఏళ్ల ప్రియాంక తన అత్యుత్తమ ప్రదర్శన (1 గంట 28 నిమిషాల 45 సెకన్లు) కంటే 11 నిమిషాలు వెనుకబడింది. పురుషుల విభాగంలో వికాస్ సింగ్ 30వ స్థానంతో, పరమ్‌జీత్ సింగ్ 37వ స్థానంతో రేసును ముగించారు. మరో వాకర్ అక్ష్‌దీప్ అనారోగ్యం కారణంగా రేసు పూర్తి చేయలేకపోయాడు.

పోరాడి ఓడిన శ్రీజ



పారిస్ ఒలింపిక్స్ టేబుల్ టెన్నిస్ (టీటీ) మహిళల సింగిల్స్‌లో సంచలన ప్రదర్శనతో ప్రిక్వార్టర్స్‌కు చేరిన భారత నంబర్‌వన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ.. ప్రపంచ నంబర్‌వన్ చేతిలో పోరాడి ఓడింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీజ 10-12, 10-12, 8-11, 3-11తో సన్ యింగ్‌షా (చైనా) చేతిలో పరాజయం పాలైంది. తొలి రెండు గేమ్‌ల్లో మొదట ఆధిక్యం కనబర్చిన శ్రీజ.. చివరి వరకు దాన్ని కొనసాగించలేకపోయింది.



నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

ఆర్చరీ
మిక్స్‌డ్ టీమ్ ఎలిమినేషన్ రౌండ్: భారత్ (బొమ్మదేవర ధీరజ్-అంకిత) X ఇండోనేసియా (ఆరిఫ్-దియా నంద) (మధ్యాహ్నం గం. 1:19 నుంచి)

హాకీ
భారత్ X ఆస్ట్రేలియా (గ్రూప్ మ్యాచ్) (సాయంత్రం గం. 4:45 నుంచి)

జూడో
మహిళల ప్లస్ 78 కేజీల ఎలిమినేషన్ రౌండ్: తులికా మాన్ X ఓర్టిజ్ (క్యూబా) (మధ్యాహ్నం గం. 2:12 నుంచి)

అథ్లెటిక్స్
మహిళల 5000 మీటర్ల తొలి హీట్: అంకిత (రాత్రి గం. 9:40 నుంచి). మహిళల 5000 మీటర్ల రెండో హీట్: పారుల్ (రాత్రి గం. 10:06 నుంచి). పురుషుల షాట్‌పుట్ క్వాలిఫికేషన్ రౌండ్: తజిందర్(రాత్రి గం. 11:40 నుంచి)

సెయిలింగ్
మహిళల డింగీ రేసులు: నేత్ర (మధ్యాహ్నం గం. 3:45 నుంచి). పురుషుల డింగీ రేసులు: విష్ణు (రాత్రి గం. 7:05 నుంచి).

గోల్ఫ్
పురుషుల వ్యక్తిగత ఫైనల్స్ (రెండో రౌండ్): గగన్‌జీత్ భుల్లర్, శుభాంకర్ శర్మ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి).

షూటింగ్
మహిళల 25 మీటర్ల పిస్టల్ క్వాలిఫికేషన్ రౌండ్: ఇషా సింగ్, మనూ భాకర్ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి). పురుషుల స్కీట్ క్వాలిఫికేషన్: అనంత్‌జీత్ సింగ్ (మధ్యాహ్నం గం. 1:00 నుంచి).

బ్యాడ్మింటన్
పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్: లక్ష్యసేన్ X చో టిన్ చెన్ (చైనీస్ తైపీ) (సాయంత్రం గం. 6:30 నుంచి)

శుక్రవారం 2-8-2024

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 132

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

నిఫ్టీ @ 25,000

దేశీయ స్టాక్ మార్కెట్ చరిత్రలో ఓ మరపురాని అద్భుతం చోటు చేసుకుంది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ ఎన్ఎస్ఈ తొలిసారి 25,000 పాయింట్ల శిఖరాన్ని అధిరోహించింది. సెన్సెక్స్, నిఫ్టీలు ఇంట్రాడే, ముగింపుల్లోనూ సరికొత్త రికార్డులు నెలకొల్పాయి. - బిజినెస్‌లో






ఉత్తరాన వరుణాగ్రహం

ఢిల్లీ సహా ఉత్తర భారత రాష్ట్రాల్లో ఎడతెగని వర్షాలు కురుస్తున్నాయి. వర్ష సంబంధిత ఘటనల్లో 36 మంది మరణించారు.

వివరాలు 6లో ▸



పేపర్ లీకేజీ.. వాటర్ లీకేజీ

ప్రశ్నపత్రాల లీకేజీలను పార్లమెంటులో వాటర్ లీకేజీతో ముడిపెడుతూ విపక్షాలు భవన నిర్మాణ పటిష్టతను ఎత్తిచూపాయి.

వివరాలు 6లో ▸



కమల భారతీయురాలా? బ్లాకా?

అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ భారతీయురాలా? లేక నల్ల జాతీయురాలా? అంటూ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

వివరాలు 6లో ▸



ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష యుద్ధమే!

హమాస్ నేత హనియేను హత్య చేసిన ఇజ్రాయెల్‌పై దాడులు చేయాలని ఇరాన్ సైన్యానికి ఆ దేశ సుప్రీం లీడర్ ఖమేనీ ఆదేశాలిచ్చారు.

వివరాలు 6లో ▸

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు

సుప్రీం గ్రీన్‌సిగ్నల్

రాష్ట్రాలు ఈ రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేయొచ్చు ● రాజ్యాంగ ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు


- అంతర్గత వివక్ష కారణంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలు అభివృద్ధి చెందలేకపోతున్నాయి
- వీటిలో ఉప వర్గాల ఏర్పాటుకు ఆర్టికల్ 14 అనుమతిస్తోంది
- ఈ మేరకు ఉప వర్గీకరణ చేసుకునేందుకు రాష్ట్రాలకు అనుమతిస్తున్నాం
- ఒకే సబ్‌క్లాస్‌కు మొత్తం రిజర్వేషన్‌ను కేటాయించకూడదు
- ఏయే సబ్‌క్లాస్‌లకు రిజర్వేషన్ ఫలాలు అందడం లేదన్న డేటా ఆధారంగా వర్గీకరణ చేయాలని సూచన
- 2004 నాటి 'ఈవీ చిన్నయ్య' కేసులోని తీర్పును పక్కనపెట్టిన ధర్మాసనం
- ఏడుగురు జడ్జీలలో ఆరుగురు అనుకూలంగా.. ఒకరు వ్యతిరేకంగా తీర్పు
- రాష్ట్రాలు తగిన మార్గదర్శకాలు రూపొందించుకోవచ్చని సూచన

2 లో

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ అమలు చేయాలన్న జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ

రిజర్వేషన్లు ఒక్క తరానికే పరిమితం చేయాలన్న జస్టిస్ పంకజ్ మిత్తల్

రాష్ట్రాలకు ఉప వర్గీకరణ చేసేందుకు అర్హత లేదన్న జస్టిస్ బేలా ఎం.త్రివేది



"ఎస్సీ, ఎస్టీ వర్గాలు అంతర్గత వివక్ష కారణంగా అభివృద్ధి చెందలేకపోతున్నాయి. అందుకే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేసుకోవడానికి రాష్ట్రాలకు అనుమతి ఇస్తున్నాం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 కూడా ఒక వర్గంలో ఉప వర్గాలను ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తోంది. ఈ క్రమంలో 2004 నాటి ఈవీ చిన్నయ్య కేసులోని తీర్పును వ్యతిరేకిస్తున్నాం. అయితే ఉప వర్గీకరణ సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఏదో ఒక సబ్ క్లాస్‌కు మొత్తం రిజర్వేషన్‌ను కేటాయించకూడదు. అంతేగాకుండా ఏయే ఉప వర్గాలు రిజర్వేషన్ ఫలాలు అందుకోలేక పోతున్నాయన్న డేటా ఆధారంగా వర్గీకరణ జరగాలి.

- సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ తీర్పు రాష్ట్రాలకే పరిమితం కేంద్ర ప్రభుత్వ సంస్థలు, విద్యా సంస్థలకు వర్తించదు అంటున్న నిపుణులు



స్వప్నం సాకారం



పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు మూడో పతకం లభించింది. మూడో పతకం కూడా షూటింగ్ క్రీడాంశంలోనే రావడం విశేషం. గురువారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో స్వప్నిల్ కుసాలే మూడో స్థానంలో నిలిచి భారత్‌కు కాంస్య పతకాన్ని అందించాడు. ఫైనల్లో స్వప్నిల్ 451.4 పాయింట్లు స్కోరు చేశాడు. స్వప్నిల్ పతకంతో ఒకే ఒలింపిక్స్‌లో ఒకే క్రీడాంశంలో భారత్‌కు తొలిసారి మూడు పతకాలు లభించాయి. మరోవైపు కచ్చితంగా పతకాలు సాధిస్తారనుకున్న బ్యాడ్మింటన్ స్టార్స్ పీవీ సింధు, సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ... మేటి బాక్సర్ నిఖత్ జరీన్ అనూహ్యంగా ఓడిపోయి పారిస్ ఒలింపిక్స్ నుంచి నిష్క్రమించారు.

11 లో

మూడు దశాబ్దాల వర్గీక'రణం'

2 లో

- ఏబీసీడీ వర్గీకరణ కోసం పోరుబాట.. 50 ఏళ్ల క్రితం విజ్ఞాపనలతో మొదలు



సాగర్‌లో 182.95 టీఎంసీలు

- మరో మూడు నాలుగు రోజుల్లో నిండనున్న సాగర్
- శ్రీశైలంలోకి 4.64 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- పది గేట్లు 18 అడుగుల మేర ఎత్తివేత.. కుడి, ఎడమ కేంద్రాల్లో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి
- శ్రీశైలం నుంచి దిగువకు 4.91 లక్షల క్యూసెక్కులు విడుదల

12 లో



విదేశీ విద్యపైనే మోజు!

- విదేశాల్లో చదువుకునేందుకే మొగ్గు చూపుతున్న భారతీయ యువత
- 2025 నాటికి 20 లక్షల మంది విదేశాల బాట
- ఆదాయాల పెరుగుదలే కారణం
- అదే సమయంలో భారత్‌కు వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్యలో భారీ క్షీణత

12 లో



బీబీఏ, బీసీఏ కోర్సు కనీస ఫీజు రూ.18 వేలు

- ఇంజనీరింగ్ కాలేజీల్లో తొలిసారిగా బీబీఏ, బీసీఏ కోర్సులు
- గరిష్టం రూ.30 వేలు, కనిష్టంగా రూ.18 వేలు ఫీజులు నిర్ణయించిన ప్రభుత్వం
- 5వ తేదీతో ముగియనున్న డిగ్రీ ప్రవేశాల్లో ఆప్షన్ల ఎంపిక
- 10న సీట్లు కేటాయింపు.. 12 నుంచి తరగతులు


12 లో

హామీలిచ్చాం కానీ..

ఖజానా ఖాళీ

శ్రీశైలం, మడకశిర పర్యటనలో సీఎం చంద్రబాబు

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలు అర్థం చేసుకోవాలి



- రాళ్లపల్లి, రత్నగిరి వద్ద రిజర్వాయర్లు నిర్మిస్తాం
- సామాజిక న్యాయం కోసం ఏబీసీడీ వర్గీకరణ విధానం తెచ్చాం

సాక్షి, నంద్యాల, పెద్దదోర్నాల, సాక్షి, పుట్టపర్తి/మడకశిర: సార్వత్రిక ఎన్నికల సమయంలో హామీలన్నీ ఇచ్చుకుంటూ వెళ్లామని, ఇప్పుడు చూస్తే ఖజానా ఖాళీగా దర్శనమిస్తోందని సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. అధ్వానంగా ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. వర్షాలు సమృద్ధిగా పడడంతో శ్రీశైలం డ్యామ్ 20 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా జూలైలోనే నిండిందన్నారు. మరో రెండు మూడు రోజుల్లో నాగార్జునసాగర్, ఆ తర్వాత పులిచింతల ప్రాజెక్టులు నిండుతాయని చెప్పారు. గురువారం శ్రీశైలం నియోజకవర్గం సున్నిపెంటలో నిర్వహించిన మన నీరు– మన సంపద కార్యక్రమం, శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం గుండుమలలో పింఛన్ల పంపిణీలో సీఎం చంద్రబాబు పాల్గొని

మిగతా 12వ పేజీలో ▶

ఆగని మరణ మృదంగం



సహాయక చర్యల కోసం ఆర్మీ ఏర్పాటు చేసిన బ్రిడ్జి

తీసే కొద్దీ గుట్టలుగా బయటపడుతున్న మృతదేహాలు

కేరళ విలయ ఘటనలో 289కి చేరిన మరణాల సంఖ్య

ముమ్మర గాలింపు చర్యల్లో నిమగ్నమైన ఆర్మీ, సహాయక బృందాలు

ఇంకా పెద్ద సంఖ్యలో జనం ఆచూకీ గల్లంతు

6 లో

శ్రీకాకుళం జిల్లా నారాయణపురం వద్ద అర్ధరాత్రి బారులు తీరిన ఇసుక లారీలు



సీఎం పేరు చెప్పి శ్రీకాకుళంలో అర్ధరాత్రి

ఇసుక దందా

బూర్జ మండలం నారాయణపురం వద్ద బారులు తీరిన లారీలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం/బూర్జ : శ్రీకాకుళం జిల్లాలో ఇసుక అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. గురువారం అర్ధరాత్రి వేళ బూర్జ మండలం నారాయణపురం వద్ద నాగావళి నదిలో ఇసుక దందాకు తెరతీశారు. పెద్ద ఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నారు. ఇసుక తరలించేందుకు వందల సంఖ్యలో లారీలు అక్కడికి చేరుకున్నాయి. సీఎం చంద్రబాబు పేరు చెప్పి తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం. నదీ తీరం పొడవునా వాహనాలు బారులు తీరిఉన్నాయి. ఒక వ్యక్తి ఇచ్చిన సమాచారంతో పోలీసులు, రెవిన్యూ సిబ్బంది వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఇసుక తరలించేందుకు సిద్ధంగా ఉన్న లారీలను బయటికి పంపించేశారు. గురువారం అర్ధరాత్రి 1.15 గంటల వరకు తనిఖీలు చేస్తూనే ఉన్నారు. అయితే పోలీసులు, రెవెన్యూ సిబ్బంది వెళ్లకముందు పెద్ద ఎత్తున భారీ వాహనాల్లో ఇసుక తరలించేసినట్టు తెలుస్తోంది.



ముందు సహాయక చర్యలు ఇక్కడి నుండే ప్రారంభించాలి సార్!

ఊరూరా ఏడి 'పింఛన్'!

కూటమి పార్టీల నేతల ఆగడాలు సామాజిక పింఛన్‌దారులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. పార్టీ ముసుగేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారు. ఉన్నట్లుండి పింఛన్ రద్దు చేసి ఓ దివ్యాంగుడి ఆత్మహత్యాయత్నానికి కారణమయ్యారు. 'జెండాలు కట్టుకుని టీడీపీలోనే కొనసాగుతాం' అని ప్రమాణం చేస్తేనే పింఛన్ డబ్బులిస్తామంటూ షరతు పెడుతున్నారు. ఇలా ఒక్కో ఊళ్లో ఒక్కో నిబంధన. రెడ్ బుక్ రాజ్యాంగమే వారికి ఆదర్శమైంది. చేష్టలుడిగి చూడటం తప్ప అధికార గణం ఏమీ చేయలేక చేతులెత్తేస్తోంది. 'అందరూ సచివాలయం వద్దకు రండి' అని ఒక ఊళ్లో.. 'ఇంటింటికీ రావాలంటే సాధ్యం కాదు.. అందరూ ఒకచోటుకు రండి' అని ఇంకో ఊళ్లో.. అవ్వాతాతలను పరుగులు పెట్టించారు.

విజనరీ పాలనలో ఇంటింటికీ పింఛన్ అంటే ఇదే మరి...

ఇంటిపై టీడీపీ జెండా కడితేనే..!



అన్నమయ్య జిల్లా కలకడ మండలం ఎగువబుట్టావారిపల్లెలో ఇంటిపై టీడీపీ జెండా కడితేనే పింఛన్ ఇస్తామని బెదిరించడంతో కలెక్టరేట్‌కు వచ్చిన బాధితులు

3 లో

ఓట్లు వేయలేదని పింఛన్లు నిలిపివేత



టీడీపీకి ఓటు వేయలేదనే కక్షతో చిత్తూరు జిల్లా మీర్జేపల్లిలో పింఛన్లు నిలిపివేయడంతో బాధితుల ఆందోళన

3 లో

వలంటీర్ పోయె.. డోలీ వచ్చె



అనకాపల్లి జిల్లా కొరుప్రోలుకు చెందిన అప్పారావును పింఛన్ కోసం మూడు కిలోమీటర్లు మోసుకెళ్లిన కుటుంబసభ్యులు

పింఛన్ నిలిపివేయడంతో.. దివ్యాంగుడు ఆత్మహత్యాయత్నం

అనంతపురం జిల్లా కుర్లపల్లిలో టీడీపీ నేతలు పింఛన్ నిలిపివేయడంతో పురుగు మందు తాగిన దివ్యాంగుడు వడ్డే శ్రీనివాసులు



3 లో

వలంటీర్ ఇల్లు కూల్చేశారు

పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కంకణాలపల్లిలో టీడీపీ నాయకులు కక్షగట్టి కూల్చివేసిన వలంటీర్ బ్రహ్మయ్య ఇల్లు



ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీం గ్రీన్‌సిగ్నల్!

క్లుప్తంగా...

సుప్రీం తీర్పు షెడ్యూల్ కులాల అభ్యున్నతికి తోడ్పడాలి: ఆదిమూలపు



సాక్షి, అమరావతి: వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు షెడ్యూల్ కులాల అభ్యున్నతికి తోడ్పడాలన్నదే వైఎస్సార్‌సీపీ ఉద్దేశమని మాజీ మంత్రి ఆదిమూలపు సురేశ్ చెప్పారు. గురువారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ లక్ష్యం. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఆయా వర్గాలు సాధికారత సాధించాలన్న ఉద్దేశంతో రాజకీయ పార్టీగా పోరాడాం, ఐదేళ్ల పరిపాలనలో వైఎస్ జగన్ నేతృత్వంలో అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేశాం. జగన్ హయాంలో ఇచ్చిన మంత్రి పదవులు, నామినేటెడ్ పదవులు, అమలు చేసిన పథకాలు, ఏర్పాటు చేసిన కార్పొరేషన్లే ఇందుకు నిదర్శనం. అణగారిన కులాల్లో ఏ రెండు వర్గాలున్నా కూడా.. రెండు కళ్లు మాదిరిగానే వైఎస్సార్‌సీపీ భావించింది. అలాగే చూసింది కూడా. ఇప్పుడు వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అవకాశవాద రాజకీయాలకు వినియోగించకుండా.. అందరికీ న్యాయం జరిగేలా చూడాలి. ఎస్సీల బలోపేతానికి వినియోగించాలని వైఎస్సార్‌సీపీ కోరుకుంటోంది' అని ఆదిమూలపు సురేశ్ చెప్పారు.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం



సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉపవర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పలువురు స్వాగతించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ వర్గీకరణ ఉద్యమాన్ని దెబ్బతీయడానికి ఎన్నో కుట్రలు జరిగాయని, అయినా సహనం కోల్పోకుండా పట్టుదలతో పోరాటం చేస్తూ విజయం సాధించినట్టు చెప్పారు. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవ తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఏనాటికైనా ధర్మమే గెలుస్తుందనేది రుజువు అయ్యిందని చెప్పారు.

'సుప్రీం' తీర్పు చరిత్రాత్మకం



సాక్షి, అమరావతి: సుప్రీంకోర్టులో ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు రావడం చరిత్రాత్మకమని నేషనల్ దళిత జేఏసీ చైర్మన్, న్యాయవాది పెరికె వరప్రసాదరావు కొనియాడారు. ముప్పై ఏళ్ల పోరాటానికి ఫలితమిదని పేర్కొన్నారు. గురువారం తాడేపల్లి దళిత జేఏసీ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీలందరూ ఐక్యంగా ఉండటం వల్లే ఇది సాధ్యమైందని, ఇక నుంచి మాల, మాదిగలు 59 ఉప కులాల వారందరూ అన్నదమ్ములుగా కలిసి మెలిసి హక్కులు సాధించుకుందామన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



సాక్షి, అమరావతి: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలు చేయవచ్చని సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఒక వర్గం సాగించిన నిరంతర పోరాటానికి దక్కిన ఫలితం అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు ఎన్డీయే పాలనలో సానుకూలత రావడం స్వాగతించదగిన పరిణామం అని పేర్కొన్నారు.

తీర్పు రాజ్యాంగ వ్యతిరేకం

మాల మహానాడు నిరసన




నరసరావుపేటలో ధర్నా చేస్తున్న మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు

నెహ్రూ నగర్ (గుంటూరు)/నరసరావుపేట: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ వ్యతిరేకించారు. గురువారం గుంటూరులోని లాడ్జి సెంటర్లో అంబేడ్కర్ విగ్రహం ఎదుట చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. ఈ నెల 9న 'హలో మాల.. ఛలో ఢిల్లీ' కార్యక్రమంతో ఢిల్లీలో వర్గీకరణపై పెద్దఎత్తున ఉద్యమించనున్నట్టు తెలిపారు. కాగా.. నరసరావుపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు నేతలు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు.

మోదీ, చంద్రబాబు కుట్ర

మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు వెనుక ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కుట్ర ఉందని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ఎస్సీలకు, దళితులకు చీకటి రోజన్నారు. ఈ తీర్పుపై భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసేందుకు రాజమహేంద్రవరంలో శనివారం రాష్ట్రస్థాయి నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఆరుగురు అనుకూలం.. ఒకరు వ్యతిరేకం

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మ ఉన్నారు. వీరిలో జస్టిస్ బేలా త్రివేదీ వర్గీకరణను విభేదించగా.. మిగతా న్యాయమూర్తులు సమర్థించారు. చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ మనోజ్ మిశ్రా కలిపి ఒకే తీర్పు ఇవ్వగా, మిగతా జడ్జీలు వేర్వేరుగా తమ తీర్పులు ఇచ్చారు. దీనితో 6 తీర్పులు వెలువడ్డాయి. మెజారిటీ న్యాయమూర్తులు అనుకూలంగా ఉండటంతో.. వర్గీకరణకు ధర్మాసనం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు అయింది.

రాష్ట్రాలు ఈ రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేయవచ్చు

చరిత్రాత్మక తీర్పు ఇచ్చిన రాజ్యాంగ ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం పచ్చజెండా ఊపింది. అత్యంత వెనుకబడిన ఉప కులాలకు ఊతమిచ్చేందుకు వీలుగా రాష్ట్రాలు ఆయా రిజర్వేషన్లను వర్గీకరణ చేసుకోవచ్చని తెలిపింది. రాజ్యాంగంలోని 14వ, 341వ ఆర్టికల్‌లు ఈ ఉప కోటాకు అడ్డంకి ఏమీ కాదని తేల్చింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం గురువారం చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. దీనితో విద్య, ఉద్యోగాలలో అమలవుతున్న ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను సబ్‌క్లాస్‌లుగా వర్గీకరించి.. ఆయా వర్గాల్లో అత్యంత వెనుకబడిన కులాలకు ప్రాతినిధ్యం కల్పించేందుకు మార్గం సుగమం కానుంది.

25 ఏళ్లుగా నానుతున్న వర్గీకరణ!

దేశంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను ఆయా వర్గాల్లోని కొన్ని కులాల వారే పొందుతున్నారని.. అందువల్ల ఈ రిజర్వేషన్లను వర్గీకరించాలని చాలా కాలం నుంచి డిమాండ్లు ఉన్నాయి. దీనికి సంబంధించి 2000వ సంవత్సరంలో ఉమ్మడి ఏపీలో చేసిన రిజర్వేషన్ల చట్టం, దానిని కొట్టివేస్తూ 2004లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం చేసిన రిజర్వేషన్ల చట్టాన్ని ఈ తీర్పు ఆధారంగా పంజాబ్–హరియాణా హైకోర్టు కొట్టివేయడం తదితర పరిణామాలతో ఈ అంశం సుప్రీంకోర్టుకు చేరింది. తొలుత దీనిపై (పంజాబ్ వర్సెస్ దేవీందర్‌సింగ్ కేసు) విచారణ జరిపిన ఐదుగురు జడ్జీల సుప్రీంకోర్టు ధర్మాసనం.. పూర్తిస్థాయిలో పునర్విచారణ నిమిత్తం చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ఏడుగురు జడ్జీల రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేసింది. ఈ ధర్మాసనం "రాజ్యాంగం నిర్దేశించిన రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేయడం 14, 15, 16 ఆర్టికల్‌లకు భంగం కలిగిస్తుందా? షెడ్యూల్ కులాలు/తెగలు సజాతీయమేనా (ఒకే వర్గం కింద పరిగణించవచ్చా?) లేక భిన్నమైన వర్గాల సమూహమా? ఆర్టికల్ 341కు ఇవి భిన్నమా? ఉప వర్గీకరణ పరిధిలో ఏమైనా పరిమితులు ఉన్నాయా?" అన్న అంశాలను లోతుగా పరిశీలించింది. ఈ కేసుకు సంబంధించి అన్ని వర్గాల వాదనలు విని.. ఈ ఏడాది ఫిబ్రవరి 8న తీర్పును రిజర్వు చేసి గురువారం తీర్పు వెలువరించింది.

నెహ్రూ వ్యాఖ్యలను కోట్ చేస్తూ..

"మతపరంగా, కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు కొనసాగితే భారతదేశం రెండో లేదా మూడో గ్రేడ్ దేశంగా మారుతుంది. ఈ మార్గం మూర్ఖత్వం మాత్రమే కాదు. విపత్తు కూడా. కానీ వెనుకబడిన వర్గాలకు అన్ని విధాలుగా సహాయం చేయాల్సి ఉంది.." అన్న మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వ్యాఖ్యలను ధర్మాసనం తమ తీర్పులో ఉటంకించింది. మన తొలితరాల వారు, న్యాయమూర్తులతోపాటు మాజీ ప్రధాని కూడా.. ఏ వర్గం లేదా కులానికి చెందినవారికి పూర్తిగా కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని వ్యతిరేకించారని.. మెరిట్ ప్రాతిపదికన దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరుకున్నారని పేర్కొంది. ఈ విధమైన అభిప్రాయాలు ఉన్నప్పటికీ వెనుకబడిన తరగతుల్లో కొంతమంది ముందుకుసాగడంలో ఇబ్బంది పడుతున్నారని.. వారికి చేయూతనివ్వడం ఎంతో అవసరమని తెలిపింది. ఈ నేపథ్యంలోనే రిజర్వేషన్ల ఉప వర్గీకరణకు ధర్మాసనం అనుమతిస్తోందని వెల్లడించింది. ఈ మేరకు 565 పేజీల తీర్పు వెలువరించింది. ఈ తీర్పునకు అనుగుణంగా రాష్ట్రాలు తదుపరి మార్గదర్శకాలు రూపొందించుకోవచ్చని సూచించింది.

'వర్గీకరణ' వీటికి వర్తించనట్లే!

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్రాల పరిధిలోని విద్యా సంస్థలు, ఉద్యోగాలు, పదోన్నతులకు మాత్రమే వర్తిస్తుందని న్యాయ నిపుణులు, ఎమ్మార్పీస్ నేతలు చెప్తున్నారు. సుప్రీం తీర్పు కేంద్ర ప్రభుత్వ, కేంద్ర సంస్థల్లోని ఉద్యోగాలు, విద్యా సంస్థలపై ప్రభావం చూపదని అంటున్నారు. రాష్ట్రాలు చేసిన చట్టాలపైనే సుప్రీం కోర్టులో విచారణ జరిగిందని.. కోర్టు కూడా రాష్ట్రాలు ఉప వర్గీకరణ చేసుకోవచ్చనే దానిపైనే తాజా తీర్పు ఇచ్చిందని వివరిస్తున్నారు. ఇందులో జాతీయ స్థాయిలో, కేంద్ర సంస్థల్లో రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించిన అంశమేదీ లేదని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రాల వారీగా ఎస్సీ, ఎస్టీ వర్గాలు, కులాలు, తెగలు విభిన్నంగా ఉంటాయని.. వాటిని కేంద్ర స్థాయిలో వర్గీకరించడం సాధ్యమయ్యే పనికాదని అభిప్రాయపడుతున్నారు.

వెనుకబాటు ఆధారంగా ఉప వర్గీకరణ

"షెడ్యూల్ కులాలు సజాతీయ తరగతి (ఒకే వర్గానికి చెందిన సమూహం) కాదని సూచించే చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఈ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 కింద పొందుపరిచిన సమానత్వ సూత్రాన్ని గానీ.. ఆర్టికల్ 341(2)ను గానీ ఉల్లంఘించదు. ఆర్టికల్ 15, ఆర్టికల్ 16లలో కూడా రిజర్వేషన్లను ఉప వర్గీకరణ చేయకుండా రాష్ట్రాలను నిరోధించేది ఏమీ లేదు. ఉప వర్గీకరణ అయినా, మరేదైనా నిశ్చయాత్మక చర్య అయినా.. వాటి లక్ష్యం వెనుకబడిన తరగతులకు సమాన అవకాశాలు కల్పించడమే. కొన్ని కులాలకు తగిన ప్రాతినిధ్యం లేకపోవడం ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఉప వర్గీకరణ చేయవచ్చు. అయితే ఏదైనా కులం/ఉప వర్గానికి ప్రాతినిధ్యం అందకపోవడానికి దాని వెనుకబాటుతనమే కారణమని రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించుకోవాలి. ఆ కులం/ ఉప వర్గానికి ప్రాతినిధ్యం అందకపోవడంపై డేటాను సేకరించాలి. అందుకు అనుగుణంగా ఉప వర్గీకరణ చేయాలి.."

– జస్టిస్ డీవై చంద్రచూడ్,
– జస్టిస్ మనోజ్ మిశ్రా

ఉప వర్గీకరణకు అనుకూలం

ఎస్సీల్లో ఉప వర్గీకరణకు అనుమతి వీలుకాదన్న 'ఈవీ చిన్నయ్య' కేసులోని తీర్పు సరికాదన్న చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ బీఆర్ గవాయిల అభిప్రాయాలతో నేను ఏకీభవిస్తున్నాను. క్రీమీలేయర్ విధానాన్ని కూడా అమలు చేయడం మరింత సమానత్వానికి తోడ్పడుతుంది.

– జస్టిస్ విక్రమ్‌నాథ్

క్రీమీలేయర్ వర్తింపజేయాలి

వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వడం రాష్ట్రాల విధి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలో కొద్ది మంది మాత్రమే రిజర్వేషన్లు అనుభవిస్తున్నారు. ఈ విషయంలో క్షేత్రస్థాయి వాస్తవాలను తిరస్కరించలేం. శతాబ్దాలుగా అణచివేతకు గురవుతున్న కులాలు ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో ఉన్నాయి. అయితే ఉప వర్గీకరణ సమయంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని క్రీమీలేయర్ (అధికాదాయం ఉన్నవారిని) గుర్తించాలి. నిజమైన సమానత్వం సాధించాలంటే ఇదొక్కటే మార్గం. ఇందుకోసం రాష్ట్రాలు ఒక విధానాన్ని రూపొందించాలి. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల క్రీమీలేయర్ మినహాయింపు ప్రమాణాలు ఇతర వెనుకబడిన కేటగిరీలకు వర్తించే ప్రమాణాలకు భిన్నంగా ఉండవచ్చు. ఈవీ చిన్నయ్య వర్సెస్ ఏపీ ప్రభుత్వం కేసులో ప్రాథమిక లోపం ఏమిటంటే.. ఆర్టికల్ 341 రిజర్వేషన్లకు ప్రాతిపదిక అని అర్థం చేసుకొని ముందుకు వెళ్లడమే! ఆర్టికల్ 341 అనేది రిజర్వేషన్ల ప్రయోజనాల నిమిత్తం కులాల గుర్తింపు కోసం మాత్రమే.

– జస్టిస్ బీఆర్ గవాయి

రిజర్వేషన్లు ఒక తరానికే పరిమితం చేయాలి

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను సమర్థిస్తున్నాను. అయితే ఏ రిజర్వేషన్లు అయినా మొదటి తరానికి లేదా ఒక తరానికి మాత్రమే వర్తింపజేయాలి. కుటుంబంలోని ఏదైనా తరం రిజర్వేషన్‌ను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థితిని సాధిస్తే.. రిజర్వేషన్ల ప్రయోజనం లాజికల్‌గా రెండో తరానికి అందుబాటులో ఉండరాదు. రిజర్వేషన్‌ను సద్వినియోగం చేసుకుని సాధారణ వర్గంతో కలసిన కుటుంబాలను.. తర్వాత రిజర్వేషన్లు పొందకుండా మినహాయించడానికి కాలానుగుణ కసరత్తు చేపట్టాలి.

– జస్టిస్ పంకజ్ మిత్తల్

డేటా సేకరించి అమలు చేయాలి

రిజర్వేషన్ల ఉప వర్గీకరణకు రాజ్యాంగ చెల్లుబాటు ఉందన్న చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ బీఆర్ గవాయిల అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నాను. రాష్ట్రాలు తగిన డాటా సేకరించి ఉప వర్గీకరణ అవసరాన్ని నిర్ధారించాలి. ఇందులో క్రీమీలేయర్ గుర్తింపునకు కూడా ఆవశ్యకత ఉండాలి.

– జస్టిస్ సతీశ్‌చంద్ర

రాష్ట్రాలకు అర్హత లేదు

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణ అర్హత రాష్ట్రాలకు లేదు. షెడ్యూల్ కులాల పరిణామ చరిత్ర, నేపథ్యానికి తోడు రాజ్యాంగంలోని 341 కింద ప్రచురించిన రాష్ట్రపతి ఉత్తర్వులు కలసి షెడ్యూల్ కులాలు ఒక సజాతీయ తరగతిగా మారాయి. దీని ప్రకారం షెడ్యూల్ కులాలు, జాతులు లేదా తెగలను విభజించడం /ఉప వర్గీకరణ చేయడం/ పునర్విభజన చేయడం తద్వారా నిర్దిష్ట కులం/కులాలకు రిజర్వేషన్లు కల్పించడానికి చట్టాన్ని రూపొందించే శాసన అధికారం రాష్ట్రాలకు లేదు. రిజర్వేషన్లు కల్పించే ముసుగులో, బలహీనవర్గాలకు మంచి చేస్తున్నామన్న నెపంతో రాష్ట్రాలు రాష్ట్రపతి జాబితాను మార్చకూడదు, ఆర్టికల్ 341తో విభేదించకూడదు. రాష్ట్ర ప్రభుత్వ చర్య సదుద్దేశంతో ఉన్నా, రాజ్యాంగంలోని నిర్దిష్ట నిబంధనలను ఉల్లంఘించినట్లయితే.. ఆర్టికల్ 142 ప్రకారం సుప్రీంకోర్టు తన అధికార పరిధిని ఉపయోగించి ధ్రువీకరించడం కుదరదు.

– జస్టిస్ బేలా ఎం త్రివేది

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల కేసు పూర్వాపరాలివీ..

ఉమ్మడి ఏపీ సమయంలో 1999లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల (రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) ఆర్డినెన్స్–1999ను జారీ చేసింది. దానిని సవాల్ ఈవీ చిన్నయ్య, మరికొందరు హైకోర్టులో పిటిషన్ వేశారు. అది విచారణలో ఉన్న సమయంలోనే ఆర్డినెన్స్ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల (రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) చట్టం–2000 చేసింది. ఎస్సీ రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా వర్గీకరించింది. గ్రూప్ ఏకు 1 శాతం, గ్రూప్ బీకి 7 శాతం, గ్రూప్ సీకి 6 శాతం, గ్రూప్ డీకి 1 శాతంగా రిజర్వేషన్‌ను విభజించింది. దీనిని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఈవీ చిన్నయ్య సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాష్ట్ర శాసనసభకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టాన్ని రూపొందించే అధికారం లేదని వాదించారు. ఇది ఆర్టికల్ 341 (2), ఆర్టికల్ 14లను ఉల్లంఘించడంతోపాటు రాష్ట్రపతి జాబితాతోనూ ముడిపడిందని వివరించారు. పార్లమెంట్ మాత్రమే రాష్ట్రపతి జాబితాలో మార్పులు చేయగలదని పేర్కొన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు.. రిజర్వేషన్ల వర్గీకరణ కుదరదంటూ 2004లో తీర్పు ఇచ్చింది.

పంజాబ్ కేసు విచారణతో మళ్లీ తెరపైకి..

1975లో పంజాబ్‌లో 25శాతంగా ఉన్న ఎస్సీ రిజర్వేషన్లను రెండు ఉప వర్గాలుగా విభజిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. మొదటి వర్గంలో ఆర్థికంగా, విద్యాపరంగా బాగా వెనుకబడిన వాల్మీకి, మజాబీ సిక్కులకు రిజర్వేషన్ ఇచ్చింది. ఆ నోటిఫికేషన్ మూడు దశాబ్దాలపాటు అమల్లో ఉంది. అయితే దీనిపై కేసులు నమోదవడంతో.. పంజాబ్–హరియాణా హైకోర్టు 2010లో ఈ నోటిఫికేషన్‌ను కొట్టివేసింది. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమంటూ 'ఈవీ చిన్నయ్య వర్సెస్ ఏపీ ప్రభుత్వం' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును దీనికి ఆధారంగా తీసుకుంది. దీనిపై పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుదీర్ఘ విచారణ అనంతరం సుప్రీంకోర్టు ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 'ఈవీ చిన్నయ్య' కేసు తీర్పును తప్పుపట్టింది. ఈ వ్యవహారంలో ముఖ్యమైన అంశాలను నాడు పరిగణనలోకి తీసుకోలేదంది. తీర్పును పునర్విచారణ చేయాల్సిన అవసరం ఉందంటూ.. ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేసింది. రాజ్యాంగ ధర్మాసనం ఇరుపక్షాల వాదనలు విని.. తాజాగా తీర్పు వెలువరించింది.

మూడు దశాబ్దాల వర్గీక'రణం'

ఏబీసీడీ వర్గీకరణ కోసం పోరుబాట.. 50 ఏళ్ల క్రితం విజ్ఞాపనలతో మొదలు



ఇది దోపిడీ, అణచివేతలకు సంబంధించిన అంశం కాదు. ఇది అణచి వేయబడ్డ సమూహంలోనే అసమానతలకు సంబంధించిన అంశం. దీనికి మూలాలు హిందూ వర్ణ వ్యవస్థలో, దానిలో ప్రధాన భాగమైన నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలోనే ఉన్నాయి.

- వర్గీకరణపై గతంలో మానవ హక్కుల కార్యకర్త బాలగోపాల్

సాక్షి, అమరావతి: ఒకే సామాజిక వర్గంలోని ఉప కులాలకు సమ న్యాయం జరగడం లేదంటూ దాదాపు ఆరు దశాబ్దాల క్రితం వారిలో అంతరాలకు బీజం పడింది. అన్నదమ్ముల్లా మెలిగే వారిలో అంతరాలు తొలగించి జనాభా ప్రాతిపదికన (దామాషా) రిజర్వేషన్ల అమలును సరిచేసి, వాటి ఫలాలు అందించాలని ఐదు దశాబ్దాల క్రితం విజ్ఞాపనలతో మొదలైంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణ చేయాల్సిందేనంటూ మూడు దశాబ్దాల క్రితం ఉద్యమం మొదలైంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో అటు మీడియాలో, ఇటు సమాజంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. అసలీ వర్గీకరణ ఏమిటి? ఎక్కడ తేడా వస్తోంది? భావోద్వేగాలను పురిగొల్పేలా ఉద్యమం ఎందుకు జరిగింది? వంటి అనేక ప్రశ్నలకు బదులు దొరకాలంటే 6 దశాబ్దాల పరిణామాలను ఒకసారి పరికించాల్సిందే. ఎస్సీ రిజర్వేషన్లలో న్యాయమైన వాటా దక్కడం లేదని, రిజర్వేషన్ల ఫలాలు అందుకోవడంలో ఎస్సీ కులాల్లో అసమానతలు పొడచూపడంతోనే వర్గీకరణ అంశం ఉద్యమ రూపానికి దారి తీసిందని అనేక మంది సామాజిక కార్యకర్తలు, మేధావులు పలుమార్లు స్పష్టం చేశారు. ఎస్సీల్లోని 59 ఉప కులాలకు రిజర్వేషన్ ఫలాలు జనాభా నిష్పత్తి ప్రకారం అందడం లేదని ఎస్సీ రిజర్వేషన్లపై అధ్యయనం కోసం 1965లో లాల్ బహదూర్‌శాస్త్రి ప్రభుత్వం నియమించిన లోకూర్ కమిషన్ నివేదించింది. ఇదే అంశంపై 1972 నుంచి మొదలుకుని ఉమ్మడి ఏపీలో మారిన ప్రతి సీఎంకు విజ్ఞప్తుల వెల్లువ మొదలైంది. ఎస్సీని ఏబీసీడీ గ్రూపులుగా వర్గీకరించి విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాల్లో న్యాయం చేయాలనే డిమాండ్‌తో 1994లో మొదలైన ఉద్యమం రాష్ట్రమంతటా విస్తరించింది. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో 1994 జూలై 7న వర్గీకరణే ప్రధాన డిమాండ్‌గా సభ జరిపి ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.

రిజర్వేషన్ వర్గీకరణ ఇలా..

1996లో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ నివేదిక ఆధారంగా ఏబీసీడీ వర్గీకరణ చేస్తూ నిర్ణయం తీసుకుంది. 15% ఎస్సీ కోటాను విభజిస్తూ 1997 జూన్ 6న ఆనాటి ప్రభుత్వం జీవో జారీ చేసింది. 'ఏ' గ్రూపులో రెల్లి, దాని అనుబంధ కులాలతో సహా మొత్తం 12 కులాలను అట్టడుగు స్థానంలో ఉన్న కులాలుగా గుర్తించి ఒక శాతం కోటాను కేటాయించారు. 'బీ' గ్రూపులో మాదిగ, దాని ఉప కులాలతో సహా మొత్తం 18 కులాలను చేరుస్తూ వారికి 7% కోటాను కేటాయించారు. 'సీ'లో మాల, దాని ఉప కులాలతో సహా మొత్తం 25 కులాలను చేరుస్తూ వారికి 6% కోటా ఇచ్చారు. 'డీ'లో ఆది ఆంధ్రులతో పాటు మొత్తం 4 కులాలను చేర్చి 1% కోటా నిర్ణయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది.

ఎస్సీల్లో మాల, మాదిగల మధ్య వివాదం

రిజర్వేషన్ల ఫలాల్లో 59 ఉప కులాలకు సమ న్యాయం నినాదం

న్యాయస్థానం తలుపుతట్టిన 'వర్గీకరణ'

ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని మాల మహానాడు కోర్టును ఆశ్రయించింది. ఈ జీవో రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధికి మించిందని, రాజ్యాంగ విరుద్ధమైందని ఏపీ హైకోర్టు ప్రకటించింది. ఆర్టికల్ 338 క్లాజ్ 9 ప్రకారం, ఈ వర్గీకరణ చేయడానికి ముందు ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను సంప్రదించాల్సి ఉందని కూడా కోర్టు వ్యాఖ్యానించింది. దీంతో ఆ రిజర్వేషన్ వర్గీకరణ కాస్తా రద్దైంది. దీనిపై తొలుత అభ్యంతరాలతో ముందుకొచ్చింది మాల మహానాడు . పీవీ రావు ఆధ్వర్యంలో ఏర్పాటైన మాల మహానాడు వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టింది. మాదిగల వర్గీకరణ డిమాండ్‌పై మొట్ట మొదట మాలలు అభ్యంతరం చెప్పారు. సబ్–కేటగిరైజేషన్ సామాజిక వైషమ్యాలకు దారి తీస్తుందన్నారు. ఇది ప్రాంతీయ వ్యత్యాసమే తప్ప మాదిగలకు అన్యాయం ఏమీ జరగలేదనే



వాదనను పీవీ రావు తెరమీదకు తెచ్చారు. నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ ప్రయోజనాల కోసం ఎస్సీల ఐక్యతను దెబ్బతీసే కుట్రతో సృష్టించిందే వర్గీకరణ ఉద్యమం అని ఆరోపించారు. అప్పట్లో రాష్ట్రంలో మాలలు ఎక్కువగా కాంగ్రెస్ వైపు ఉన్నారు కాబట్టి, మాదిగల్ని తన వైపు తిప్పుకొనే వ్యూహంతోనే చంద్రబాబు వర్గీకరణ చిచ్చు పెట్టారనే విమర్శలు చేశారు.

'చట్టాన్ని' కొట్టేసిన సుప్రీంకోర్టు

ఎస్సీలను వర్గీకరిస్తూ 2000లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ అనే చట్టాన్ని అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ ఆమోదంతో అమల్లోకి వచ్చిన ఆ చట్టంలో ఎస్సీలను ఏబీసీడీ గ్రూపులుగా వర్గీకరిస్తూ.. వెనుకబాటుతనం , జనాభా నిష్పత్తి ప్రకారం ఆ కులాలకు కోటాలను నిర్ణయించారు. కాగా, 2004 నవంబర్‌లో సుప్రీంకోర్టు ఆ చట్టాన్ని కొట్టివేసింది. ఎస్సీ కులాల జాబితాలో జోక్యం, పునర్ వర్గీకరణ వంటివి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం లేదని ప్రకటించింది. దీంతో వర్గీకరణ వివాదం మళ్లీ మొదటికి వచ్చింది. 2000 నుంచి 2004 మధ్య దాదాపు ఐదేళ్లపాటు రిజర్వేషన్ల అమలుతో మాదిగలకు దాదాపు 22 వేల వరకు ఉద్యోగాలు వచ్చినట్టు అప్పట్లో మంద కృష్ణ ప్రకటించారు.

రాజ్యాంగ సవరణ కోరిన వైఎస్సార్

ఎస్సీ వర్గీకరణ వివాదం జటిలం కావడంతో దానికి సామరస్యంగా పరిష్కారం చూపే దిశగా దివంగత సీఎం వైఎస్సార్ గట్టి ప్రయత్నం చేశారు. వర్గీకరణ విషయంలో జాతీయ స్థాయిలో పరిష్కారం చూపేలా రాజ్యాంగ సవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసింది. దీనిపై స్పందించిన అప్పటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందిన సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ.. ఉషా మెహ్రా కమిషన్ ఏర్పాటు చేసింది. 2008 మే లో కేంద్ర మంత్రి మీరాకుమార్‌కు ఉషా మెహ్రా కమిషన్ నివేదికను సమర్పించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కు సవరణ చేయాలని, ఆ ఆర్టికల్‌లో 3వ క్లాజును చేర్చడం ద్వారా, రాష్ట్ర అసెంబ్లీలు ఏకగ్రీవ తీర్మానం చేసిన పక్షంలో కులాల వర్గీకరణను పార్లమెంట్ ఆమోదించవచ్చని ఈ కమిషన్ సిఫార్సు చేసింది. 2014 ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. అయితే దీనిపై ఏ నిర్ణయం తీసుకున్నా, మరో ప్రధాన వర్గానికి చెందిన ఓటు బ్యాంకు దూరమవుతుందనే భావనతో పదేళ్లుగా దానికి పరిష్కారం చూపలేదు. ఇటీవల హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో మంద కృష్ణ నిర్వహించిన మాదిగ విశ్వరూప మహాసభకు హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ ఈ అంశంపై కమిటీ వేసి న్యాయం చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు ఐదుగురితో కమిటీ వేశారు.

ఎస్సీ ఉప వర్గీకరణ.. పరిణామక్రమం

- రాష్ట్రంలోని ఎస్సీ కులాల వర్గీకరణ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం 1997లో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రామచంద్ర రాజు నేతృత్వంలో ఓ కమిషన్‌ను ఏర్పాటు చేయగా.. కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించి ఎస్సీ కులాలను వర్గీకరించాలని ప్రతిపాదించగా ఈ నివేదికను అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది.
- ఎస్సీలను ఏ, బీ, సీ, డీ ఉప కులాలుగా వర్గీకరిస్తూ ఏపీ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. ఎస్సీలకు ఉన్న మొత్తం 15% రిజర్వేషన్లలో ఏ ఉప కులానికి 1%, బీ ఉప కులానికి 7%, సీ ఉప కులానికి 6%, డీ ఉప కులానికి 1 % మేర రిజర్వేషన్లు కల్పించింది.
- ఈ ఆర్డినెన్స్‌ను సవాలు చేస్తూ హైకోర్టులో పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్డినెన్స్‌పై హైకోర్టులో విచారణ జరుగుతుండగానే, ఆర్డినెన్స్ స్థానంలో ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం 2000లో ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కులాల (రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) చట్టం పేరుతో ఓ చట్టాన్ని తెచ్చింది. ఈ చట్టాన్ని కూడా హైకోర్టులో సవాలు చేశారు.
- ఈ చట్టంపై విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం ప్రభుత్వం తీసుకొచ్చిన ఉప వర్గీకరణ చట్టాన్ని సమర్థించింది. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని హైకోర్టు ధర్మాసనం చెప్పింది. ప్రభుత్వ చట్టంతో రాష్ట్రపతి ఉత్తర్వులకు వచ్చిన నష్టం ఏమీ లేదంది. చట్టాలు చేయకుండా రాష్ట్రాలను రాష్ట్రపతి ఉత్తర్వులు నిరోధించజాలవంది.
- ఈ తీర్పును సవాలు చేస్తూ డాక్టర్ ఈవీ చిన్నయ్య, మాల మహానాడులతో పాటు పలువురు 2000లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీళ్లపై ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపి 2004లో తీర్పునిస్తూ ఏపీ హైకోర్టు ధర్మాసనం తీర్పును తప్పుపట్టింది.
- 2006లో పంజాబ్, హర్యానా హైకోర్టు ధర్మాసనం ఈ సర్క్యులర్‌ను రద్దు చేసింది. పంజాబ్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. దీంతో పంజాబ్ ప్రభుత్వం 2006లో పంజాబ్ రిజర్వేషన్ ఇన్ సర్వీసెస్ చట్టం తీసుకురాగా ఈ చట్టాన్ని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసన పంజాబ్ తీసుకొచ్చిన చట్టాన్ని కొట్టేస్తూ 2010లో తీర్పునిచ్చింది.
- పంజాబ్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో పలు అప్పీళ్లు దాఖలయ్యాయి. ఈ అప్పీళ్లపై జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది.
- జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం 2020లో తీర్పునిస్తూ ఈ మొత్తం వ్యవహారాన్ని ఏడుగురు న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనానికి నివేదించింది. డాక్టర్ ఈవీ చిన్నయ్య కేసులో ఐదుగురు న్యాయమూర్తుల నేతృత్వంలోని ధర్మాసనమే తీర్పు చెప్పిందని, తమది కూడా ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనమే కాబట్టి, చిన్నయ్య కేసులో తీర్పును తాము సమీక్షించజాలమంది. అయితే చిన్నయ్య కేసులో ఇచ్చిన తీర్పును కూడా ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం పునః పరిశీలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.
- దీంతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ తన నేతృత్వంలో ఏడుగురు న్యాయమూర్తులతో ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తూ పాలనాపరమైన నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత ఉప వర్గీకరణపై ఈ రాజ్యాంగ ధర్మాసనం సుదీర్ఘ విచారణ జరిపి గురువారం తీర్పు వెలువరించింది.

క్లుప్తంగా...

ఇంటిపై టీడీపీ జెండా కట్టుకుంటేనే పింఛన్!

అన్నమయ్య జిల్లాలో టీడీపీ అరాచకం

సాక్షి, రాయచోటి : 'మీ ఇళ్లపై టీడీపీ జెండాలు కట్టుకుంటేనే పింఛన్ ఇస్తాం. లేదంటే ఇవ్వం. దిక్కున్న చోట చెప్పుకోండి' అంటూ టీడీపీ నేతలు వేధిస్తున్న వైనమిది. అన్నమయ్య జిల్లా కలకడ మండలం రాచగుంటపల్లి పంచాయతీలోని ఎగువ బుట్టావారిపల్లెలో ఈ దురాగతం చోటుచేసుకుంది. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులనే నెపంతో గ్రామంలో అణగారిన వర్గాలకు చెందిన 26 మందికి రెండు నెలలుగా పింఛన్ ఇవ్వకుండా టీడీపీ నేతలు అడ్డుపడ్డారు. 'ఇకపై ఎప్పటికీ టీడీపీలో కొనసాగుతాం' అని ప్రమాణం చేయించుకుని, వారి ఇళ్లపై టీడీపీ జెండాలు కట్టిన తర్వాత గురువారం ఆరుగురికి పింఛన్ అందించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ విషయమై బాధితులు ఎం.చంద్రయ్య, గుడి వెంకట్రామయ్య కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.

పింఛన్ కోసం డోలీ మోత

రోలుగుంట: పింఛన్ కోసం అనారోగ్యం బారిన పడిన వారిని సైతం డోలీల్లో సచివాలయాలకు మోసుకెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. అనకాపల్లి జిల్లా ఎంకే పట్నం శివారు కొరుప్రోలు ఆదివాసీ గిరిజన గ్రామానికి చెందిన గెమ్మిలి అప్పారావు వృద్ధాప్య పింఛన్ అందుకుంటున్నాడు. కొద్ది రోజులుగా అతను అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పింఛన్ నగదు మూడు కిలోమీటర్ల దూరంలోని ఎంకే పట్నం సచివాలయానికి వచ్చి తీసుకోమని చెప్పడంతో కుటుంబ సభ్యులు గురువారం డోలీ కట్టించి ఆయన్ని సచివాలయానికి తీసుకెళ్లారు.

60 మంది 'సచివాలయ' ఉద్యోగులకు షోకాజ్

వజ్రపుకొత్తూరు రూరల్: పింఛన్‌ల పంపిణీలో విధులు సక్రమంగా విధులు నిర్వహించలేదనే కారణంతో శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలోని 60 మంది గ్రామ సచివాలయ ఉద్యోగులకు అధికారులు షోకాజ్ నోటీసులిచ్చారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమం గురువారం ఉదయం 6 గంటలకు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. అయితే 60 మంది గ్రామ సచివాలయ ఉద్యోగులు ఉదయం 6:30 గంటలు గడిచినప్పటికీ పింఛన్‌లు పంపిణీ ప్రారంభించకపోవడంతో ఎంపీడీవో తిరుమలరావు షోకాజ్ నోటీసులిచ్చారు

ఉపాధి హామీ పనిదినాలు పెంపు

ప్రధానికి కృతజ్ఞతలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి పవన్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనిదినాల పెంపునకు కేంద్రం అంగీకరించినట్లు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈ క్రమంలో 21.5 కోట్ల పనిదినాలను పెంచినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. పనిదినాల పెంపుతో 53 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.

త్వరలో మునిసిపాలిటీల్లో పురసేవ: మంత్రి నారాయణ



నెల్లూరు(బారకాసు): త్వరలోనే మున్సిపాలిటీల్లో పురసేవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. గురువారం నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో పెండింగ్ భవన నిర్మాణాల దరఖాస్తులపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం జరిగింది. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో టౌన్‌ప్లానింగ్‌లో అనేక ఆరోపణలొచ్చాయని.. అందుకోసమే టౌన్‌ప్లానింగ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2014 నుంచి 2019 వరకు టిడ్కో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారందరికీ ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.

పింఛన్లు పంపిణీ చేసిన నాగబాబు



కొత్తపల్లి: ప్రభుత్వపరంగా అధికారికంగా ఎటువంటి హోదా లేని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు సామాజిక పింఛన్లు పంపిణీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే రాయలసీమలో ఒక మంత్రి భార్య, ఒక ఎమ్మెల్యే భార్య తమ భర్తల తరఫున అధికారిక కార్యక్రమాల్లో పాల్గొని హడావుడి చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. అయినా గురువారం కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం కొండెవరంలో నాగబాబు పింఛన్లు పంపిణీ చేయడం విశేషం. లబ్ధిదారులకు వారి ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా... ఇందుకు విరుద్ధంగా అధికారులు కొంతమంది లబ్ధిదారులను ఒకచోటకు పిలిచి నాగబాబుతో పంపిణీ చేయించారు. ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఊరూరా ఏడీపింఛన్!



శ్రీకాకుళం జిల్లా అనంతగిరి గ్రామంలోని మండపం వద్ద పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగి



విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం జోగిరాజుపేటలో చెట్టుకింద పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది



కర్నూలు జిల్లా బ్రాహ్మణదొడ్డి సచివాలయం వద్ద పింఛన్ కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు, వితంతువులు



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు దుంబ్రిగుడలోని ఓ దుకాణం వద్ద పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది



గుంటూరు రామిరెడ్డితోటలో రోడ్డుపై కుర్చీ వేసుకుని పింఛన్ అందజేస్తున్న సచివాలయ సిబ్బంది



ఏలూరు జిల్లా తంగెళ్లమూడి సచివాలయంలో పింఛన్ కోసం వృద్ధుల పడిగాపులు



విశాఖ జిల్లా భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ నమ్మివానిపాలెంలో పింఛన్ కోసం ఎదురు చూస్తున్న స్థానికులు



కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురు సచివాలయం వద్ద పింఛన్ కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు

ఓట్లు వేయలేదని పింఛన్ల నిలిపివేత

- నిలదీసిన దళితులపై దాడి
- పోలీసులకు ఫిర్యాదు

పుంగనూరు: టీడీపీకి ఓట్లు వేయలేదన్న కారణంగా వృద్ధ దళిత మహిళలకు పింఛన్లు ఆపేశారు. ఇదేమని నిలదీసినందుకు కులం పేరుతో దూషించడమేగాక వారిపై దాడికి పాల్పడ్డారు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం మీర్జేపల్లిలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మీర్జేపల్లికి చెందిన చెన్నమ్మ, రామయ్య, అమరక్క, మునెమ్మ, గంగమ్మ, సరస్వతి అనే దళిత మహిళలకు గురువారం పింఛన్ నిలిపివేశారు. దీంతో వారంతా కలసి పంచాయతీకి వెళ్లి పింఛను చెల్లించాలని కార్యదర్శిని కోరారు. దీంతో టీడీపీకి చెందిన నాగరాజు, గిరి తదితరులు వారిని కులం పేరుతో దూషించి.. మా ఇష్టం వచ్చిన వారికే పెన్షన్ ఇస్తాం. మీరు మా పార్టీకి ఓట్లు వేశారా అంటూ దాడి చేసి కొట్టడమే కాకుండా మీ అంతు చూస్తామని బెదిరించారని వృద్ధ మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా.. ఓట్లు వేయలేదనే కారణంతో మీర్జేపల్లి నుంచి నాయకురాళ్లపల్లి, బసివినాయునిపల్లె తదితర బీసీ కులస్తులు ఉన్న గ్రామాలకు వెళ్లే రోడ్డుకు గత నెలలో గొయ్యి తవ్వించి రాకపోకల్ని ఆపేసిన విషయం విదితమే.



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చేందుకు వచ్చిన దళిత నేత అశోక్, బాధిత కుటుంబీకులు

దళిత నేతల ఆగ్రహం

మీర్జేపల్లిలో పెన్షన్ అడిగిన దళితులపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసి దళితులకు రక్షణ కల్పించాలని మాల మహానాడు కార్యదర్శి ఎన్‌ఆర్ అశోక్ డిమాండ్ చేశారు. గురువారం పుంగనూరులో మీడియాతో విలేకరులతో మాట్లాడుతూ మీర్జేపల్లిలో దళితులను, బీసీలను తిరగనివ్వకుండా రోడ్లను తవ్వేసి అడ్డగిస్తున్నారని, పెన్షన్ ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆరోపించారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పింఛన్ నిలిపేయడంతో దివ్యాంగుడి ఆత్మహత్యాయత్నం

కంబదూరు: పింఛన్ నిలిపివేయడంతో ఓ దివ్యాంగుడు పురుగు మందు తాగి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. అనంతపురం జిల్లా కుర్లపల్లిలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా.. కుర్లపల్లికి చెందిన వడ్డే శ్రీనివాసులు దివ్యాంగుడు. భార్య గోవిందమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీనివాసులుకు 86 శాతం వైకల్యం ఉండటంతో ఏ పనీ చేయలేడు. దీంతో భార్య గోవిందమ్మ కంకర కొట్టి కుటుంబాన్ని పోషిస్తోంది. వీరి పరిస్థితి గుర్తించిన ప్రభుత్వం కొన్నేళ్లుగా శ్రీనివాసులుకు పింఛన్ అందిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్థానిక టీడీపీ నాయకులు కమ్మ కిష్టయ్య, కమ్మ కృష్ణ తదితరులు దివ్యాంగుడైన శ్రీనివాసులుపై వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడన్న ముద్రవేసి కక్షగట్టారు. జూలైలో పెంచిన పింఛన్ శ్రీనివాసులుకు ఇవ్వకుండా అడ్డుకున్నారు. శ్రీనివాసులు టీడీపీ నాయకుల్ని సంప్రదించగా.. మూడు రోజులు తిప్పించుకుని అర్హుల జాబితాలో పేరు లేదని జూలై నెలకు సంబంధించిన పింఛన్ ఎగ్గొట్టారు. తాజాగా గురువారం కూడా పింఛన్ కోసం వెళితే జాబితాలో పేరు లేదని టీడీపీ నాయకులు చెప్పారు. ఏ ఆధారం లేని తనపై కక్ష గట్టడం తగదని శ్రీనివాసులు ప్రాధేయపడినా వినిపించుకోలేదు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీనివాసులు ఇంటికి వెళ్లి పురుగుమందు తాగాడు. శ్రీనివాసులు పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలియడంతో సచివాలయ సిబ్బంది హడావుడిగా కళ్యాణదుర్గం ఆస్పత్రికి వెళ్లి ఆగస్టు పింఛన్ సొమ్మును అందజేశారు. అర్హుల జాబితాలో పేరు లేకపోతే ఇప్పుడెలా పింఛన్ ఇచ్చారని శ్రీనివాసులు భార్య గోవిందమ్మ ప్రశ్నించగా.. జవాబివ్వకుండా వెళ్లిపోయారు.

వలంటీర్‌పై కక్ష సాధింపు.. పూరి గుడిసె కూల్చివేత

పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో టీడీపీ దురాగతం

సత్తెనపల్లి : తెల్లారకముందే ఇంటికి వచ్చిమరీ పింఛన్ ఇచ్చిన వలంటీర్‌పై కూటమి నేతలు కక్షగట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీకి అనుకూలంగా పనిచేయలేదన్న కారణంతో పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆ వలంటీర్ పూరిగుడిసెను కూల్చివేసి భార్యాబిడ్డలకు నిలువనీడ లేకుండా చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కంకణాలపల్లిలో వలంటీర్ కంటూ బ్రహ్మయ్య గ్రామంలోని పోరంబోకు స్థలంలో పూరి గుడిసె వేసుకుని చిన్నపాటి టీ హోటల్ నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. వలంటీర్‌గా పార్టీలకతీతంగా సేవలందించిన బ్రహ్మయ్యను తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా పనిచేయాలని ఆ పార్టీ నేతలు గతంలో కోరారు. అయితే దానికి ఆయన ఒప్పుకోలేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రామ టీడీపీ నాయకులు ఈ నెల 29న బ్రహ్మయ్య ఇంట్లో లేని సమయంలో 20 ట్రాక్టర్ల మట్టి పోసి ఇంట్లోకి దారి లేకుండా చేశారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. ఎన్టీఆర్ విగ్రహం పునఃప్రతిష్ట చేసి ఇక్కడ పార్కుగా అభివృద్ధి చేయదల్చుకున్నామని తక్షణమే ఇంటిని కూల్చివేయమన్నారు. కనీసం నాలుగు నెలలు సమయం ఇవ్వాలని కోరగా పట్టించుకోకపోగా, స్థానిక టీడీపీ నేతలు బుధవారం ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాద్‌ను కలిసి బ్రహ్మయ్య ఇల్లు ఖాళీ చేయించాలని వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆగమేఘాల మీద బుధవారం అర్ధరాత్రి టీడీపీ నాయకులు పూరి గుడిసెను తొలగింపజేశారు. గ్రామస్తులు అక్కడ గుమికూడి టీడీపీ చర్యలపై ముక్కున వేలేసుకున్నా పూరి గుడిసె కూల్చేసే వారి ప్రయత్నాలు మాత్రం ఆపలేదు. దీంతో వలంటీర్ బ్రహ్మయ్య, అతని భార్య, ఇద్దరు కుమార్తెలు వీధినపడ్డారు.



పూరిగుడిసె తొలగింపుతో గుమికూడిన గ్రామస్తులు

దొంగ సర్టిఫికెట్లతో దివ్యాంగుల పింఛన్లు

- అనర్హుల పెన్షన్లను తొలగిస్తాం: మంత్రి అచ్చెన్న
- ప్రభుత్వం చేతిలో చిల్లి గవ్వ లేదు

టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వం కష్టాల్లో ఉందని, చేతిలో చిల్లి గవ్వ లేదని మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. గురువారం శ్రీకాకుళం జిల్లాలో టెక్కలిలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి ఆయన పింఛన్ల పంపిణీలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హత లేని ఎంతో మంది వివిధ రకాల పింఛన్లు అందుకుంటున్నారని, అలాంటి వాటిని తొలగిస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో దివ్యాంగులు కాని వారు సైతం వస్తాదుల్లా ఉన్నా సదరం దొంగ సర్టిఫికెట్లతో రూ.10 వేల పింఛన్లు పట్టుకెళ్లిపోతున్నారని చెప్పారు. అలాంటి పింఛన్లు తొలగిస్తామని హెచ్చరించారు. ఎన్టీఆర్ రూ.35తో పింఛన్లను ప్రవేశపెడితే చంద్రబాబు రూ.70, వైఎస్సార్ రూ.200కు పెంచారని చెప్పారు. వైఎస్ జగన్ ఏటా రూ.250 చొప్పున పెంచుతూ గత ఎన్నికలకు రూ.3 వేలు ఇచ్చారన్నారు. పింఛన్ల కోసం బ్యాంకులు, పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిప్పి సుమారు 40 నుంచి 50 మంది వృద్ధులు చనిపోవడానికి గత పాలకులే కారణమని ఆరోపించారు. సచివాలయ సిబ్బందికి బాధ్యతలు అప్పగిస్తే వలంటీర్ల కంటే అరగంట ముందే పింఛన్లు ఇస్తారని నాడు తాను చెబితే చులకనగా చూశారన్నారు. ముఖ్యమంత్రి నుంచి ప్రతి నాయకుడూ ఒకటో తేదీన పింఛన్ల పంపిణీలో పాల్గొనాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏ శాఖలోనూ చిల్లి గవ్వ లేదని, గత ప్రభుత్వంలో ఒక్కో శాఖలో రూ.10 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్ల అప్పులు చేసేశారన్నారు. గత ప్రభుత్వం రూ.12 లక్షల కోట్లు అప్పులు చేసిందన్నారు. టెక్కలి నియోజకవర్గంలో తాగునీటి కోసం సుమారు రూ.460 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మత్స్యకారులు చేపలు పట్టుకోవడానికి వలలు ఇస్తామన్నారు.



భయపడితే బదిలీపై వెళ్లిపోండి..!

టెక్కలి ఆస్పత్రి పరిశీలన సందర్భంగా సిబ్బందికి అచ్చెన్న హెచ్చరికలు జారీ చేశారు. కొంత మంది వైద్యులు ఇక్కడకు వస్తున్న రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు తరలిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. తన ఒత్తిడికి భయపడితే వేరే ప్రాంతాలకు బదిలీపై వెళ్లిపోవాలన్నారు. ఆస్పత్రి సమయాల్లో వైద్యులు కచ్చితంగా అందుబాటులో ఉండాలన్నారు. తాను నిర్వహించే ఆకస్మిక తనిఖీల్లో పట్టుబడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

పింఛను సొమ్ము స్వాహా.. సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

ప్యాపిలి: పింఛన్ సొమ్ము స్వాహా చేసి.. అధికారులను తప్పుదారి పట్టించాలనుకున్న సచివాలయం జేఎల్ఎంను అధికారులు సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. నంద్యాల జిల్లా ప్యాపిలి మండల పరిధిలోని వెంగళాంపల్లి సచివాలయంలో పనిచేస్తున్న జేఎల్ఎం పవన్ గురువారం పింఛన్లను పంపిణీ చేయాల్సి ఉంది. అయితే వెంగళాంపల్లి గ్రామానికి చెందిన 52 మంది లబ్ధిదారుల పింఛను సొమ్ము రూ.2,23,500 తీసుకుని ద్విచక్రవాహనంపై వెళ్తుండగా డబ్బుల బ్యాగు పోయిందని పవన్ అధికారులకు తెలిపాడు. దీంతో ఎంపీడీఓ సాయిమనోహర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ అనంతరం పవన్ నుంచి పింఛను సొమ్ము రికవరీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అతనిని సస్పెండ్ చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ వినయ్ తెలిపారు. వెంగళాంపల్లికి చెందిన 52 మందికి యథావిధిగా పింఛను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

పింఛన్ కోసం సచివాలయానికి రండి

ఎక్కువ మంది లబ్ధిదారులకు తొలిరోజు అక్కడే పంపిణీ

- ఇంటి వద్దే పంపిణీ అన్న మాట.. ఆచరణలో కానరాలేదు
- పలుచోట్ల పింఛన్ల పంపిణీలో రాజకీయ నేతల హడావుడి
- బహిరంగ సభలకు వృద్ధులను పిలిచి పంపిణీ చేసిన వైనం
- కక్షగట్టి కొన్ని చోట్ల పింఛన్‌లు ఆపేసిన నేతలు
- తొలిరోజు 63.18 లక్షల మందికి పంపిణీ చేశామన్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్ : లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టుగా టీడీపీ కూటమి ప్రభుత్వం గొప్పగా చెప్పినప్పటికీ.. ఆచరణలో మాత్రం అది కనిపించడం లేదు. మెజార్టీ లబ్ధిదారులను స్థానిక వార్డు, గ్రామ సచివాలయాల వద్దకు పిలిపించుకొని పింఛన్ల పంపిణీ చేశారు. కొన్ని చోట్ల చెట్ల కింద, రచ్చబండల వద్ద, ప్రైవేటు స్థలాల్లో పంపిణీ చేశారు. గతంలో రాజకీయాలకతీతంగా పింఛన్ల పంపిణీ జరిగితే.. ప్రస్తుతం అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే పింఛన్ల పంపిణీ జరిగింది. పింఛన్ల పండుగ పేరిట మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక టీడీపీ నేతల సమక్షంలో పింఛన్ల పంపిణీ చేస్తున్నారు. పలు చోట్ల బహిరంగసభలు నిర్వహించి వృద్ధులను ఇబ్బంది పెట్టారు. కక్షగట్టి పింఛన్లు ఆపేసిన ఘటన పలుచోట్ల జరిగింది. కాగా, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా 64,82,052 మంది పింఛన్‌దారులకు పంపిణీ చేసేందుకు రూ. 2,737 కోట్లు విడుదల చేశారు. గురువారం తొలి రోజు 63,18,881 మందికి రూ. 2,668.28 కోట్లు పంపిణీ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. తొలిరోజే 97.48 శాతం పింఛన్‌దారులకు పంపిణీ పూర్తి చేశామని వెల్లడించింది.

పింఛన్ల పంపిణీలో నేతలు

తిరుపతి జిల్లా నాగలాపురం పట్టణంలో సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లకుండా గాంధీవీధిలోని ఓ ఇంటి వద్దకు అందరినీ రమ్మని అక్కడే పింఛన్లు ఇచ్చారు. తిరుపతి కేవీబీపురం మండలంలోని రాయపేటు గ్రామ సచివాలయ పరిధిలో వగత్తూరు గ్రామంలో టీడీపీ నేతలు గోపాల్, సురేష్‌రెడ్డి చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు.

ప్రశ్నించాడనిసాక్షి విలేకరి తల్లి పింఛన్ ఆపేశారు

పంచాయతీలకు రావాల్సిన నిధులు ఎందుకు పక్కదారి పడుతున్నాయని ప్రశ్నించినందుకు సాక్షి విలేకరి తల్లి పింఛన్‌ను నిలిపివేసిన ఘటన శ్రీకాకుళం జిల్లాలో జరిగింది. పోలాకి మండలంలోని బెలమరపాలవలస పంచాయతీలో చేపల చెరువుకు బుధవారం వేలం జరిగింది. ఈ వేలంపాటలో వచ్చిన సొమ్ములు స్థానిక సర్పంచ్‌కు కాకుండా అధికార పార్టీ నేతల వద్ద ఉంచటాన్ని అదే గ్రామానికి చెందిన 'సాక్షి' విలేకరి షణ్ముఖరావు ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి టీడీపీ నేతలు చేరవేశారు. దీంతో నేరుగా ఎమ్మెల్యే.. ఎంపీడీవో ఉషశ్రీకి ఫోన్ చేసి విలేకరి తల్లి అయిన చింతు రమణమ్మ వితంతు పింఛన్ ఆపేయాలని మౌఖికంగా ఆదేశించినట్లు తెలిసింది. దీనిపై మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ స్పందించారు. ప్రశ్నించే గొంతును నొక్కే చర్యలకు పాల్పడటం ఎమ్మెల్యే స్థాయిని దిగజార్చుతుందని అన్నారు. నరసన్నపేట ప్రెస్‌క్లబ్ దీన్ని ఖండించింది. ఇలాంటి చర్యలు ఆమోదయోగ్యం కావని ఏపీడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు సదాశివుని కృష్ణ అన్నారు.

కష్టాన్ని కొని తెచ్చుకున్నాం



పింఛన్ కోసం ఏలూరులోని సచివాలయానికి వస్తున్న ఓ అవ్వ

మొన్నటి వరకు తెల్లవారక ముందే వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్ అందించేవారు. కానీ ఇప్పుడు రోజులు మారాయి. ఆధార్ కార్డు పట్టుకుని పింఛన్ ఎక్కడ ఇస్తారా అని వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంకొందరైతే సచివాలయంలో పింఛన్ల కోసం గంటల కొద్దీ పడిగాపులు కాస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో 'ఎంతటి కష్టాన్ని కొనితెచ్చుకున్నాంరా నాయనా' అంటూ వృద్ధులు బాధపడుతున్నారు. ఏలూరు నగరంలో గురువారం పలు డివిజన్లలో పింఛన్‌దారులు అవస్థలు పడుతూ కనిపించారు.

ఇదేం పింఛన్ల పంపిణీ 'స్వామి'!

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలంలోని పాకల పల్లెపాలెంలో పెన్షన్లను బహిరంగ సభకు పిలిచి ఇవ్వడంపై లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేశారు. పబ్లిసిటీ కోసం వృద్ధులను ఇలా బాధపెట్టడం ఏంటని మంత్రి తీరును పలువురు తప్పుబట్టారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తున్నట్లు ప్రకటించడంపై మండిపడ్డారు.

అవివేకం వల్ల ఏదైనా చెడు కార్యానికి పాల్పడి, వెనువెంటనే తప్పు తెలుసుకుని పశ్చాత్తాపం చెందేవారి పశ్చాత్తాపాన్ని స్వీకరించే బాధ్యత మాత్రమే అల్లాహ్‌పై ఉంది. అటువంటి వారి పశ్చాత్తాపాన్ని అల్లాహ్ స్వీకరిస్తాడు. అల్లాహ్ మహాజ్ఞాని, గొప్ప వివేకవంతుడు.

– ఇస్లాం ధర్మం

ఫోకస్

సాక్షి

శుక్రవారం, 2 ఆగస్టు 2024

విస్తరిస్తున్న యుద్ధమేఘాలు

ఇజ్రాయెల్ – హమాస్‌ల మధ్య యుద్ధం ఆగి, గాజా ప్రాంతంలో శాంతి నెలకొంటుందని నిన్నటి దాకా ఉన్న కొద్దిపాటి ఆశ ఇప్పుడు ఆవిరైపోయినట్టు అనిపిస్తోంది. హమాస్ సీనియర్ నేత ఇస్మాయిల్ హనియేను ఇరాన్ రాజధాని టెహరాన్‌లో బుధవారం గుట్టుచప్పుడు కాకుండా చంపిన తీరు ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. హనియేను చంపింది తామేనని ఇజ్రాయెల్ ప్రకటించలేదు కానీ, ఆయన చనిపోవాలని ఇజ్రాయెలీల కన్నా ఎక్కువగా మరెవరూ కోరుకోరన్నది నిజం. మరోపక్క ఆ హత్యకు కొద్ది గంటల ముందే మంగళవారం లెబనాన్ రాజధాని బీరుట్‌లో ఇరాన్‌కు మిత్రపక్షమైన హెజ్బొల్లా తీవ్రవాద గ్రూపు సీనియర్ మిలటరీ కమాండర్ ఫాద్ షుక్ర్ ప్రాణాలు గాలిలో కలిశాయి. గత వారం (ఆక్రమిత) గోలన్ హైట్స్‌లో రాకెట్ దాడితో 12 మంది పిల్లల్ని పొట్టనబెట్టుకున్న ఆయనను మాత్రం అడ్డు తొలగించినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. అలా ఆ దేశ శత్రువులకు రెండు రోజుల్లో రెండు ఎదురుదెబ్బలు తగిలాయి. ఇజ్రాయెల్ ఒప్పుదల మాటెలా ఉన్నా... ఇరాన్ నూతన అధ్యక్షుడి పదవీ స్వీకారోత్సవానికి హనియే వచ్చివుండగా జరిగిన ఈ హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ అధినాయకుడు అయతొల్లా ఖొమేనీ గర్జించారు. ప్రతిగా ఎవరు రెచ్చగొట్టే చర్యలకు దిగినా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ హెచ్చరించారు. వెరసి, వ్యవహారం ఇజ్రాయెల్ – ఇరాన్‌ల మధ్య నేరు ఘర్షణకు దారి తీస్తోంది. మొత్తం గాజా కథ మరో ప్రమాదకరమైన మలుపు తిరిగింది.

అసలే సంక్లిష్టంగా ఉన్న పశ్చిమాసియా సంక్షోభం కాస్తా హనియే హత్యోదంతంతో మరింత సంక్లిష్టంగా మారింది. ఇజ్రాయెల్ – హమాస్ యుద్ధానికి పరిష్కారం కనుగొనాలని చేస్తున్న శాంతి ప్రయత్నాలకు తాజా ఘటన విఘాతం కల్పించింది. ఇరుపక్షాల మధ్య రాజీ కుదర్చడానికి చర్చలు జరుగుతున్నప్పుడు... ఒక పక్షం వాళ్ళు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న వ్యక్తినే చంపేస్తే ఇక మధ్యవర్తిత్వం ఏం సఫలమవుతుంది? రాజీ కుదర్చడానికి ప్రయత్నిస్తున్న ఖతార్ పక్షాన ఆ దేశ ప్రధాని సరిగ్గా ఆ మాటే అన్నారు. ఆ మాటలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి. హనియేపై యుద్ధ నేరాలున్న మాట, అతనిపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్ట్ ఇటీవలే వారెంట్ జారీ చేసిన మాట నిజమే. కానీ, హమాస్ గ్రూపులో మిలటరీ నేత యాహ్యా సిన్వర్ సహా ఇతర పిడివాదులతో పోలిస్తే రాజీ చర్చల విషయంలో రాజకీయ విభాగ నేత హనియే కొంతవరకు ఆచరణవాది అంటారు. ఇప్పుడు ఆయనే హత్యకు గురయ్యాడు గనక కథ మొదటికి వచ్చింది. కాల్పుల విరమణ, బందీల విడుదల ఒప్పందం కుదిరినంత మాత్రాన ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు చల్లబడతాయని గ్యారెంటీ లేదు కానీ, అసలు ఒప్పందమే లేకపోతే ఉద్రిక్తతలు తగ్గే అవకాశమే లేదు. మొత్తంగా ఈ ఘటన ఆ ప్రాంత సుస్థిరతనే దెబ్బ తీస్తూ, గాజా యుద్ధాన్ని చివరకు పెను ప్రాంతీయ ఘర్షణ స్థాయికి తీసుకెళుతోంది.

అతిథిగా వచ్చిన మిత్రపక్షీయుణ్ణి భద్రత ఎక్కువగా ఉండే సమయంలోనే సొంతగడ్డపై, స్వకీయ గూఢచర్య వైఫల్యంతో పోగొట్టుకోవడం ఇరాన్‌కు తీరని తలవంపులే. ఖొమేనీ గర్జించినట్టు ఇరాన్ దీనికి బదులు తీర్చుకోవచ్చు. అదే జరిగితే ఇజ్రాయెల్ ప్రతిచర్యా తప్పదు. నిజానికి, ఆ మధ్య ఏప్రిల్‌లో డెమాస్కస్‌లోని ఇరాన్ ఎంబసీలో తమ జనరల్స్ ఇద్దరిని హత్య చేసినప్పుడు ఇరాన్ తొలిసారిగా నేరుగా ఇజ్రాయెల్‌పై సైనిక దాడి జరిపింది. వందలాది క్షిపణులు ప్రయోగించింది. అదృష్టవశాత్తూ అప్పట్లో అది పూర్తిస్థాయి ప్రాంతీయ యుద్ధంగా పరిణమించలేదు. ప్రతిసారీ అలా ఆగుతుందనుకోలేం. తాజా ఘటనలతో యెమెన్ నుంచి హౌతీలు ఎర్రసముద్రంలో దాడులు ఇబ్బడిముబ్బడి చేస్తారు. హెజ్బొల్లా సైతం ఇజ్రాయెల్‌ను చూస్తూ ఊరుకోదు. అసలు నిరుడు అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ గ్రూపు చేసిన దుర్మార్గమైన దాడి ఇక్కడికి తెచ్చింది. అప్పటి నుంచి మధ్యప్రాచ్యంలో పూర్తిస్థాయి యుద్ధం తప్పదనే భయాందోళనలు చెలరేగుతూనే ఉన్నాయి. చిత్రం ఏమిటంటే, ఏ పక్షమూ ఆ రకమైన యుద్ధం కోరుకోవడం లేదు కానీ, తమ చర్యలతో ఎప్పటికప్పుడు కయ్యానికి కాలుదువ్వుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మధ్యప్రాచ్యంలో ప్రాంతీయ యుద్ధం తీవ్రతరమయ్యే ముప్పు తప్పాలంటే ముందు గాజాలో కాల్పుల విరమణ జరగాలి.

అయితే, వరస చూస్తుంటే హమాస్‌పై పూర్తి విజయమే లక్ష్యమన్న నెతన్యాహూ మాటలనే ఇజ్రాయెల్ ఆచరిస్తోందని అనిపిస్తోంది. పది నెలలుగా సాగుతున్న యుద్ధంలో ఒక్క గాజాలోనే ఇప్పటికి 40 వేల మంది చనిపోయారు. ఇలాగే ముందుకు సాగితే యుద్ధం ఇతర ప్రాంతాలకూ విస్తరించి, మరింత ప్రాణనష్టం తప్పదు. మానవీయ సంక్షోభమూ ఆగదు. హనియే హత్యతో హమాస్ తల లేని మొండెమైంది. పగ తీర్చుకోవాలన్న ఇజ్రాయెల్ పంతం నెరవేరింది. ఇకనైనా ఆ దేశం ప్రతీకార మార్గం వీడి, రాజీ బాటను అనుసరించాలి. శాంతికి కట్టుబడ్డ మన దేశానికి సైతం ఆ ప్రాంతంలో యుద్ధంతో భారీ నష్టమే. అక్కడ 89 లక్షల మంది మన వలస కార్మికులున్నారు. పైగా, శాంతి, సుస్థిరత లేకుంటే నిరుడు ఢిల్లీ జీ–20 సదస్సులో ప్రకటించిన 'ఇండియా– మిడిల్ ఈస్ట్ – యూరప్ ఎకనామిక్ కారిడార్' (ఐఎంఈసీ) లాంటివి పట్టాలెక్కవు. ఇజ్రాయెల్, పాలెస్తీనాలు రెంటికీ మిత్రదేశంగా ఇరుపక్షాలనూ తిరిగి రాజీ చర్చలకు కూర్చోబెట్టేందుకు ప్రయత్నించాలి. అధ్యక్ష ఎన్నికలతో తీరిక లేని అమెరికా సహా ఇతర దేశాలన్నీ ఒత్తిడి తెచ్చి అయినా సరే రెండువైపులవారినీ అందుకు ఒప్పించాలి. పశ్చిమాసియాలో శాంతి పునరుద్ధరణకు చిత్తశుద్ధితో నడుం బిగించాలి. ఎందుకంటే, ఏ యుద్ధంలోనూ విజేతలుండరు. ప్రతిసారీ ప్రజలు పరాజితులుగానే మిగులుతారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం, **తిథి:** బ.త్రయోదశి ప.3.42 వరకు తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** ఆరుద్ర ప.12.16 వరకు తదుపరి పునర్వసు, **వర్జ్యం:** రా.12.32 నుండి 2.10 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.14 నుండి 9.05 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.22 వరకు, **అమృతఘడియలు:** లేవు.

సూర్యోదయం : 5.42
సూర్యాస్తమయం: 6.30
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

కృత్రిమ మేధకు ముకుతాడు వేయాలి!

విశ్లేషణ



అశ్వినీ కుమార్

ప్రజల ఆరోగ్యం, విద్య విషయాల్లో కృత్రిమ మేధ ఉపయోగకారి కావచ్చు. సైబర్ నేరాలు, ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకూ సాయపడవచ్చు. కానీ దీనిద్వారా ప్రజల అభిప్రాయాలను కృత్రిమంగా మార్చే అవకాశాలు ఉన్నట్లు స్పష్టం కావడం ఆందోళన కలిగించే అంశం. కొందరిపై ఉద్దేశపూర్వకంగా ద్వేషం పెరిగేలా చేయడం, వ్యక్తుల బలహీనతలు ఆసరాగా సమాజంలో అసమానతలను పెంచే ప్రయత్నం జరుగుతూండటమూ గమనార్హం. ఏ కొత్త విజ్ఞానమైనా మానవీయ విలువలను ఎంత మేరకు పెంచుతోంది అన్నది కీలకం. చాలామంది నిపుణులు ఈ సాంకేతిక పరిజ్ఞానానికి ముకుతాడు వేయాల్సిందేనంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత నైతిక ప్రమాణాల పరిధిలోనే దీని వాడకాన్ని సమీక్షించి హద్దులు నిర్వచించాల్సిన అవసరం ఉంది.

కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ)... మన తరం అనుభవిస్తున్న విప్లవాత్మకమైన, అత్యంత ప్రభావశీలమైన సాంకేతిక పరిజ్ఞానం అనడంలో సందేహం అవసరం లేదు. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థం చేసుకోవడమే కాకుండా... పెరుగుతున్న మానవ కాంక్షలకు తగ్గట్టుగా దాన్ని మలచుకోవాలనే, నియంత్రించాలనే మానవ ఆసక్తికి తాజా నిదర్శనం కూడా. ఈ మార్పు జరిగే క్రమంలో సవాళ్లు లేకపోలేదు. కృత్రిమ మేధ వాడకంతో సమాజంలో మానవ విలువలు తగ్గిపోతాయని, సమాజం అమానవీయమైన రీతిలో మారిపోతుందని ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ సాంకేతిక పరిజ్ఞానం విసురుతున్న నైతిక సవాళ్లపై అంతర్జాతీయ స్థాయిలో చర్చ మొదలైంది. ఏఐ వాడకాన్ని నియంత్రించేందుకు, నియమాల ఏర్పాటు కూడా ఈ చర్చలో భాగమే. ఇప్పటికే కొన్ని ప్రాంతీయ స్థాయి, మరికొన్ని అంతర్జాతీయ స్థాయి చర్యలూ మొదలయ్యాయి. మానవ హక్కుల విషయంలో ఇప్పుడున్న నియమావళి, నిబంధనల పరిధిలోనే కృత్రిమ మేధ వాడకాన్ని పరిమితం చేయడం ఈ చర్చల్లో ఒక భాగంగా ఉంది.

గత ఏడాది నవంబరులో ప్రపంచంలోని 193 దేశాలు ఏకగ్రీవంగా ఏఐ నైతిక నియమావళికి సంబంధించి యునెస్కో సిద్ధం చేసిన సూచనలకు ఆమోదం తెలిపిన విషయం ఇక్కడ చెప్పుకోవాలి. ఇది మాత్రమే కాదు... 'ఎథిక్స్ ఆఫ్ ఇంటెలిజెన్స్ సిస్టమ్స్'పై మాంట్రియాల్ ప్రకటన, 'ఏసీఎం ఫ్యాక్ట్ కాన్ఫరెన్స్', బైడెన్ నేతృత్వంలో అమెరికా ప్రభుత్వం చేసిన 'ఏఐ బిల్ ఆఫ్ రైట్స్', యూరోపియన్ యూనియన్ 'ఏఐ చట్టం', అమెరికాలో జాతీయ స్థాయి నియంత్రణ సంస్థలు పార్లమెంటులో జరిపిన చర్చలు... అన్నీ ఏఐతో రాగల సవాళ్లను ఎదుర్కొనేందుకు చేస్తున్న ప్రయత్నాలే. ఏఐ ప్రస్థానాన్ని నిశితంగా పరిశీలించేందుకు ఏర్పడిన 'గ్లోబల్ అబ్జర్వేటరీ ఆన్ ద ఎఫెక్ట్ ఆఫ్ ఏఐ', 'గ్లోబల్ ఫోరమ్ ఆన్ ఎథిక్స్ ఆఫ్ ఏఐ', 'ఏఐ ఎథిక్స్ ఎక్స్‌పర్ట్స్ వితౌట్ బార్డర్స్', 'విమెన్ ఫర్ ఏఐఎథిక్స్' వంటివి కూడా ఏఐ విషయంలో ఎదురుకాగల నైతిక సవాళ్లపై మరింత పదునైన అవగాహన కలిగి ఉన్నాయి.

అభివృద్ధి పథంలో వేసే ప్రతి ముందడుగులోనూ మానవజాతి... ఈ అభివృద్ధికి నిర్వచనంగా మానవీయత, ప్రజల సంతోషం మరింత పెరగడాన్నే చూసినట్లు చరిత్ర చెబుతోంది. కృత్రిమ మేధ ప్రజల ఆరోగ్యం, విద్య విషయాల్లో ఎంతో ఉపయోగకారి కావచ్చు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకునేందుకు, సమస్య పరిష్కారానికీ అక్కరకు రావచ్చు. సైబర్ నేరాలు, కోవిడ్ వంటి మహమ్మారులు, ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకూ సాయపడవచ్చు. ఇవన్నీ మానవ నాగరికత పరిణామ క్రమంలో విప్లవాత్మకమైన ముందడుగులే. అయినా సరే... ఏఐ రంగంలో పని చేస్తున్న చాలామంది నిపుణుల అభిప్రాయం... ఈ సాంకేతిక పరిజ్ఞానానికి ముకుతాడు వేయాల్సిందే అని! సాంకేతిక పరిజ్ఞానం ద్వారా మనం సాధించే విజయాలు... మానవతా విలువల శిథిలాల్లో చేసుకునే సంబరాలు కానే కాకూడదు. ఏ కొత్త విజ్ఞానమైనా మానవీయ విలువలను ఎంత మేరకు పెంచుతోంది అన్నది కీలకం. ఈ నేపథ్యంలోనే ఏఐ వాడకంపై మానవీయ నైతిక విలువల చట్రంలోనే సమీక్ష జరగాల్సిన అవసరం ఎంతైనా కనపడుతుంది.



చరిత్రను మార్చేయగలదు...

మనిషి ఏ మాత్రం వదులుకోలేని స్వేచ్ఛ, వ్యక్తిగత గోప్యత, భావోద్వేగాలు, సన్నిహిత సంబంధాలు, వ్యక్తిగత స్వతంత్రత, మానవ మేధ తాలూకూ పవిత్రత వంటివి అన్నీ అత్యంత ప్రాథమిక హక్కులని ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలన్నీ గుర్తించాయి. ఏఐ ద్వారా ఎన్నికల్లో, ప్రజల అభిప్రాయాలను కృత్రిమంగా మార్చే అవకాశాలు ఉన్నట్లు స్పష్టం కావడం ప్రజాస్వామ్యానికి ఆందోళన కలిగించే అంశమే. డీప్‌ఫేక్‌ల ద్వారా భాషను హైజాక్ చేసి ప్రజాస్వామ్య ప్రక్రియలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. కొందరిపై ఉద్దేశపూర్వకంగా ద్వేషం పెరిగేలా చేయడం, వ్యక్తుల బలహీనతలను ఆసరాగా చేసుకుని సమాజంలో అసమానతలను పెంచే ప్రయత్నం జరుగుతూండటమూ గమనార్హం. కృత్రిమ మేధ 'చరిత్ర'ను కూడా మార్చేసే అవకాశంపై ఇప్పటికే తీవ్రస్థాయి ఆందోళన వ్యక్తమైంది.

ఏఐ అనే భూతాన్ని ప్రపంచవ్యాప్తంగానూ కట్టడి చేయాల్సిందే. లేదంటే చిక్కులు తప్పవు. ఈ విషయాన్నే ఎలాన్ మస్క్ వంటి వాళ్లు కూడా విస్పష్టంగా ప్రకటించారు. ''నిర్వీర్యం చేయగల స్విచ్ లేకుండా కృత్రిమ మేధను అభివృద్ధి చేయడం దయ్యానికి ఆహ్వానం పలకడమే'' అని 'ఎక్స్' అధినేత మస్క్ హెచ్చరిస్తే... ''ప్రపంచం మరింత డిజిటల్ మయం అవుతుంది. అయితే ఈ పరిణామం మానవ సమాజానికి ఏమంత మంచి చేసేది కాకపోవచ్చు'' అని 'ఫేస్‌బుక్' వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ స్పష్టం చేశారు. 'ఆపిల్' వ్యవస్థాపకుడు స్టీవ్ వోజినిక్ ఓ బహిరంగ లేఖ రాస్తూ... ఏఐ నియంత్రణకు సమర్థమైన వ్యవస్థ ఒకదాన్ని వీలైనంత తొందరగా ఏర్పాటు చేసుకోవాలని సూచించడం గమనార్హం.

అయితే ఈ ఏర్పాటు స్వీయ నియంత్రణకే పరిమితం కాకూడదు. నిర్వచించుకున్న హద్దులను దాటినవారు ఎవరు, బాధ్యత ఎవరి దన్నది నిర్ధారించేలా కూడా ఉండాలి. సైన్స్ విజయాల వెలుగులో వెలిగిపోవాలంటే... నీడల వెంబడి నడవడమూ అలవాటు చేసుకోవాలన్నమాట.

కృత్రిమ మేధ వాడకంపై ప్రస్తుతం వెల్లువెత్తుతున్న ఆందోళనలు అవసరానికి మించి ఉన్నాయా, లేదా? అన్నది కాసేపు పక్కనబెడదాం. ఈ అంశంపై ఎక్కువ మంది చెప్పేదేమిటంటే... మనిషి నైతికాంశాల విషయంలో సర్వ స్వతంత్రుడు; మానవ విలువలు, మానవీయతలను గుర్తించే వ్యక్తి హేతుబద్ధత కేంద్రంగానే మనవ నాగరత అభివృద్ధి చెందుతూ వస్తోందని. అందరినీ కలుపుకొని పోవడం, సమానత్వాన్ని పాటించడం, న్యాయం వంటివి కూడా కీలకమే. అయితే ఏఐ పని చేయాల్సిన నైతిక విలువల చట్రంలో ఇవన్నీ సాధ్యమేనా? అతి సంక్లిష్టమైన మానవ నైతిక విలువలను ఒక అల్గారిథమ్ పరిధిలోకి చేర్చడం వీలవుతుందా? లేదా, మనిషి లాగా అన్నింటినీ అర్థం చేసుకోగల 'ఫుల్ ఎథికల్ ఏజెంట్ల'ను సిద్ధం చేయడం కుదురుతుందా? అన్నవి అసలు ప్రశ్నలు. ఏఐ చుట్టూ దుర్భేద్యమైన సరిహద్దుల ఏర్పాటైతే తప్పనిసరిగా జరగాలి. ఇలాంటి ఏర్పాటు ద్వారానే ఈ విశ్వంపై మనిషి పెత్తనం నడుస్తుంది. మనకు మాత్రమే ప్రత్యేకమైన వ్యక్తిగత జీవితాలు సురక్షితంగా ఉంటాయి.

న్యూఢిల్లీలో ఇటీవలే 'గ్లోబల్ ఏఐ' శిఖరాగ్ర సమావేశం ఒకటి జరిగింది. ఇందులో జరిగిన చర్చలు ఏఐ బాధ్యతాయుతంగా, నైతిక విలువలతో వ్యవహరించేలా చేసేందుకు ఏం చేయాలన్న విషయంపై కొంత అవగాహన ఇచ్చే ఉంటుంది.

మానవ నాగరకత శిఖరస్థాయికి చేరడం అంటే, మనిషి మరింత ఎత్తుకు ఎదగడమే కావాలి. తెలిసో, తెలియకో మానవ విలువలు పతనం కారాదు. శాస్త్రవేత్తల మాటలను, వేదాంతవేత్తల మాటలను కలిపి చదవగలిగిన మన సామర్థ్యం మానవ సమాజం, విలువల కొనసాగింపునకు దోహదపడాలి. ఇదెలా సాధిస్తామన్నది ఓ మహా సవాలే కానీ మన నాయకత్వ పటిమకు నిర్ణయాత్మకమైంది కూడా.

వ్యాసకర్త కేంద్ర న్యాయశాఖ మాజీ మంత్రి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

అలవాటు



తమకు ఉన్న అధికారాన్ని ఎలా వాడుకోవాలో బీజేపీకి తెలియదు. తమకు లేని అధికారాన్ని ఎలా వాడుకోవాలో కాంగ్రెస్‌కు తెలుసు.

– వినోద్ కుమార్, స్క్వాడ్రన్ లీడర్

జాగ్రత్త కోసం...



జాతీయ మహిళా కమిషన్ ఎఫ్ఐఆర్‌కు సంబంధించి ఢిల్లీ పోలీసులు నన్ను కలవాలని ప్రయత్నిస్తున్నారనుకుంటున్నా, సర్... నేను పార్లమెంట్ లాబీలో దొరకొచ్చు, గొడుగు పట్టుకుని ఎదురుచూస్తుంటా. (పార్లమెంట్‌లోకి నీళ్లు వచ్చిన నేపథ్యంలో.)

– మహువా మొయిత్రా, తృణమూల్ ఎంపీ

పోటీ పడగలరా?



జన్మతః పురుషుడైన అల్జీరియాకు చెందిన ఇమేన్ ఖెలీఫ్ చేతిలో ఇటలీకి చెందిన ఏంజెలా కారిని కేవలం 45 సెకన్లలో ఒలింపిక్స్ 66 కిలోల బాక్సింగ్ ప్రాథమిక పోటీల్లో ఓడిపోయింది. జన్మతః మహిళలైన అథ్లెట్లకు హక్కులు లేవా? ఎంత సిగ్గుచేటు! దీని గురించి స్త్రీవాదులు మాట్లాడరా?

– వెలీనా చకరోవా, వ్యాఖ్యాత

ముఖ్యమైన తీర్పు



ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో ఎస్సీలకు ఇస్తున్న రిజర్వేషన్లలో ఉప విభాగాలు చేయడానికి రాష్ట్రాలను అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపట్ల రాజకీయ పార్టీల వ్యాప్తంగా ఉద్దేశపూర్వకమైన మౌనం కనబడుతోంది. కానీ అదొక విశేషమైన తీర్పు.

నిస్తులా హెబ్బర్, పాత్రికేయురాలు

ఏడాదికే?



దాదాపుగా వందేళ్ల కింద 1927లో బ్రిటిష్‌వాళ్లు నిర్మించిన పాత పార్లమెంట్ భవనంలో ఒక్కసారి కూడా నీళ్ళు కారలేదు. కానీ విశ్వగురు 2023లో నిర్మించిన కొత్త పార్లమెంట్ భవనం ఒక్క ఏడాదిలోనే కారడం మొదలైంది. ప్రకృతి మరీ క్రూరంగా బీజేపీని బట్టబయలు చేసింది.

– రోషన్ రాయ్, సెటైరిస్ట్

ఆధారాలు లేకుండా...



ఒక దళితుడైన అంబేడ్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్లకు అవకాశం కల్పించారు. ఆయన దళితులను వర్గీకరించలేదు. కానీ బ్రాహ్మణ మెజారిటీతో కూడిన సుప్రీంకోర్టు న్యాయమూర్తుల బెంచ్ ఏ విధమైన వాస్తవిక ఆధారాలూ లేకుండా ఎస్సీ, ఎస్టీలను వర్గీకరించేందుకు రాజ్యాంగపరంగా అనుమతి ఉందని నిర్ణయించింది.

– అనుభవ్ సింగ్, వ్యాఖ్యాత

అపనమ్మకమా?



గత 24 గంటల్లో నేను చాలామందితో మాట్లాడాను. అందులో అత్యధికులు (హమాస్ చీఫ్) ఇస్మాయిల్ హనియేను ఇజ్రాయెల్ హత్య చేసేందుకు ఇరానే అప్పగించివుంటుందని భావిస్తున్నారు. దీనికి ఏ విధమైన ఆధారమూ లేదు, అర్థం లేదు. కానీ సిరియన్ యుద్ధం తర్వాత ఇరాన్ మీద ఇప్పటికీ అపనమ్మకం బాగా ఉందని తెలుస్తోంది.

– ముర్తజా హుస్సేన్, పరిశోధనాత్మక జర్నలిస్ట్

ఇన్ బాక్స్

అలా వదిలివేయడమేనా?

ఈ మధ్య పత్రికలలో, ప్రసార మాధ్యమాలలో ఆదివాసుల తండాలకు, గూడేలకూ వైద్యం చేయడం కోసం వాగులు దాటుతున్న డాక్టర్లు, వైద్య సిబ్బందిని చూస్తున్నాం. అంతకంటే ఎక్కువగా... ప్రసవం కోసం, జ్వరం ఇతర అనారోగ్య చికిత్సల కోసం వెళ్లే వారూ, చదువుల కోసం బడులకు వెళ్లే పిల్లలూ, ఇతర అవసరాల కోసం వెళ్లేవారూ... ఒర్రెలు, వాగులు వంకలు దాటే దృశ్యాలను చూస్తున్నాం. డోలీలలో ప్రసవ వేదన అనుభవిస్తున్న గిరిజన మహిళలను వాగులను దాటిస్తున్న దృశ్యాలు ఒళ్లు జలదరింపచేస్తున్నాయి.

ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వాలు వచ్చి, దేశం అంతరిక్షంలోకి దూసుకుపోతున్న ఈ కాలంలోనూ గిరిజన గూడేలకు రవాణా సౌకర్యాలు లేకపోవడం దిగ్భ్రాంతికి గురి చేస్తున్నది. దేశం ప్రపంచంలో ఉన్నత స్థానంలో నిలబడడానికి పోటీపడుతోంది. క్రికెట్ క్రీడలో, సాఫ్ట్‌వేర్ రంగంలో మన దేశ కీర్తి ప్రతిష్ఠలు ఉన్నత శిఖరాలకు చేరుతున్నాయి. అయినా దేశంలోని మిగతా ప్రాంతాలతో పాటు ఈ గిరిజన తండాలు అభివృద్ధి చెందకుండా మౌలిక వసతులు, విద్య, వైద్య సదుపాయాల లేమితో కునారిల్లుతున్నాయి. ఇందుకు ఎవరిని నిందించాలి? ప్రభుత్వాలు ఆదివాసీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూడడం వల్లనే వీరి తండాలను పట్టించుకోవడంలేదని భావించాలా?

వీరి అభివృద్ధి అసలేమీ జరగడంలేదని కాదు. కాకపోతే మారుమూలల్లో వారు సహజ వాతావరణంలో నివసించే అడవులూ, కొండ, గుట్టల ప్రాంతాలలో కనీస వసతులు కల్పించలేక పోవడం ఇంకా కొనసాగుతుండడం శోచనీయం.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా బృహత్తర పథకాలు రచించి దేశంలో మారుమూలల్లో ఉన్న గిరిజన ప్రాంతాలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రోడ్డు రవాణా సౌకర్యాలు కల్పించాలి. అలాగే వాగులు, వంకలపై చిన్నపాటి వంతెనలన్నా నిర్మించాలి.

– దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

నీతి ఆయోగ్ ఏర్పాటు లక్ష్యం నెరవేరేనా?

అభిప్రాయం



డా॥ తిరునహరి శేషు

ఆరు దశాబ్దాలకు పైగా కొనసాగిన ప్రణాళిక సంఘం స్థానంలో నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత 2015లో 'నీతి ఆయోగ్' లాంటి ఒక అడ్వైజరీ సంస్థను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సహకార సమాఖ్య స్ఫూర్తిని మరింత బలోపేతం చేయటం దీని ప్రధాన ఉద్దేశ్యం. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్ల సమాహారంగా 'టీం ఇండియా'గా, ఒక థింక్ ట్యాంక్‌గా జాతీయ అభివృద్ధి అజెండాతో పని చేసే సంస్థ నీతి ఆయోగ్. దేశాభివృద్ధికి కేంద్ర రాష్ట్రాలు కలిసి పనిచేసే విధంగా కోఆపరేటివ్, కాంపిటీటివ్ ఫెడరలిజాన్ని బలోపేతం చేయటం; గ్రామస్థాయి నుండి విశ్వసనీయ ప్రణాళికలను రూపొందించటం, వాటి అమలు, పర్యవేక్షణ చేయటం ద్వారా నీతి ఆయోగ్ దేశంలో ఒక బలమైన వ్యూహాత్మక భాగస్వామ్య సంస్థగా పనిచేయాలి.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన నీతి ఆయోగ్ 9వ సమావేశంలో మాట్లాడుతూ... 'వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో రాష్ట్రాలదే కీలక భాగస్వామ్యం. దేశంలోని రాష్ట్రాలన్నీ అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది కాబట్టి పేదరిక నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్రాలు గ్రామస్థాయి నుండి పనిచేయాలని' పిలుపునిచ్చారు. దేశాభివృద్ధి లక్ష్యసాధనలో కేంద్ర, రాష్ట్రాలు కలిసి పనిచేసినప్పుడే లక్ష్యాలు సాధించగలుగుతామని ప్రధాని సమావేశంలో దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందటానికి అన్ని అవకాశాలను అందిపుచ్చుకోవాలనీ... ముఖ్యంగా పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు, జల వనరులను సమర్థంగా వినియోగించుకొని సాంకేతిక మార్పులకు అనుగుణంగా రాష్ట్రాలు పనిచేయాలని ప్రధాని సూచించారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడమే ప్రధాన అజెండాగా నీతి ఆయోగ్ సమావేశం సాగిందని చెప్పాలి.



ప్రణాళిక సంఘం ఆశించిన స్థాయిలో పని చేయలేదని, ప్రణాళిక దానితో భవిష్యత్తు లక్ష్యాలను సాధించలేమని నీతి ఆయోగ్ ఏర్పాటు జరిగింది. కానీ గడిచిన 9 ఏళ్లలో నీతి ఆయోగ్ విపక్ష పార్టీలు అధికారంలో ఉన్న ప్రభుత్వాల నుండి అనేక ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఈ ఆరోపణలు ఎంత దూరం వెళ్లాయి అంటే... దాన్ని రద్దుచేసి మళ్ళీ పూర్వపు ప్రణాళిక సంఘాన్ని పునరుద్ధరించాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వంటివారు డిమాండ్ చేసే దాకా వెళ్లాయి. ఇది కేంద్ర ప్రభుత్వ జేబు సంస్థగా పనిచేస్తోందని విపక్ష పార్టీల ముఖ్యమంత్రులు ఆరోపిస్తున్నారు. నీతి ఆయోగ్ సమావేశానికి తొమ్మిది రాష్ట్రాల ముఖ్యమంత్రులు గైరు హాజరు కావడం, సమావేశానికి హాజరైన విపక్షాలకు చెందిన ఏకైక ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సమావేశాన్ని బహిష్కరించి బయటికి వెళ్లిపోవడంతో నీతి ఆయోగ్ లాంటి సంస్థ... కేంద్ర ప్రభుత్వానికి– రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య జాతీయ అజెండా విషయంలో సమన్వయం సాధించలేకపోతుందా అనే అనుమానాలు బలపడుతున్నాయి. దరిదాపు పది రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు హాజరు కాకపోవటం, ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలకు చెందిన బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కూడా హాజరు కాకపోవటం... నీతి ఆయోగ్ సంస్థ విశ్వసనీతను దెబ్బతీసోంది అనటంలో సందేహం లేదు.

2030 నాటికి భారతదేశం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలన్నా, భారతదేశం 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్నా, 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలన్నా ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేయాలి. నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశ విశాల ప్రయోజనాల దృష్ట్యా నీతి ఆయోగ్ లాంటి సంస్థను స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా మరింత క్రియాశీలకంగా పనిచేసే విధంగా అవకాశాలు కల్పించినప్పుడే నిర్దేశిత లక్ష్యాలను సాధించగలుగుతాం.

వ్యాసకర్త అర్థశాస్త్ర అధ్యాపకులు, కాకతీయ విశ్వవిద్యాలయం | 98854 65877

మమకార త్యాగమే ముక్తి!

ఒక వ్యక్తి తన హృదయంలో ఏఏ వస్తువులపై, వ్యక్తులపై అధికమైన మమత కలిగి ఉంటాడో, ఆ వస్తువుల నుండి, వ్యక్తుల నుండే అతడికి అధికమైన దుఃఖం కూడా కలిగే అవకాశం ఉంటుంది. ఆ కారణం చేతనే, ప్రాకృతికాలైన విషయ భోగాలతో ఏకత్వాన్ని, మమకారాన్ని త్యజించడమే ముక్తికి మార్గం అని చెప్పారు. సంగత్యాగము వలన సంసారదుఃఖాలు మనసును కలతపెట్టవనీ, నిర్మమత్వమనే సుఖం చేకూరుతుందనీ, ఆ సుఖమునే వైరాగ్యం అంటారనీ, వైరాగ్యం వలన కలిగే జ్ఞానమే సమగ్రమైన జ్ఞానమనీ, సమగ్ర జ్ఞానమే మోక్షార్హమైన జ్ఞానమనీ, మిగిలినది అజ్ఞానంగానే పరిగణించబడుతుందనీ అన్నారు. అలా, మోక్షమనే సాధానికి ప్రాకృతికమైన విషయాలపైనా, వస్తువులపైనా మమకారాన్ని వదలడమన్నది మొదటి మెట్టు అయింది. తాగే నీరు వస్త్రంతో వడకొట్టబడి శుద్ధమైనదిగా మారినట్లుగా... ఏ వ్యక్తిలోనైతే అతడు వేసే అడుగులు కంటితో చూసే చూపుతోనూ, మాట్లాడే మాట సత్యమనే ప్రమాణంతోను, చేసే ఆలోచన సద్బుద్ధితోను వడకొట్టబడి శుద్ధమైనవిగా మారతాయో ఆ వ్యక్తి జ్ఞానానికీ, తద్వారా వైరాగ్యానికీ చేరువవుతాడు. ఈ విషయాన్ని మారన కవి 'మార్కండేయ పురాణం' తృతీయాశ్వాసంలో చెప్పాడు. మమత అనే సంకెళ్లు ఏ వ్యక్తిని బాధించవో ఈ క్రింది కంద పద్యం ద్వారా ఆయన చెప్పాడు.

జ్యోతిర్మయం

తనకున్నయదియె యిల్లుగ
దనయాకలి కొదవినదియ తగుభోజ్యముగా
దనకు గలయదియ ధనముగ
మనమున ముద మందుయోగి మమత బొరయునే!

తాటాకులతో కప్పబడిన గుడిసె అయినప్పటికీ, తాను నివసించేదే ప్రాప్తమైన ఇల్లుగా, ఆకలిగా అనిపించిన సమయానికి ఆ పూటకు తినడానికి తనకు ప్రాప్తమయినదే పంచభక్ష్య పరమాన్నంగా, తనకు అప్పటికి కలిగినదే సమస్త సంపదగా మనస్సులో భావించి, అందులోనే ఆనందం అనుభవించే వ్యక్తి యోగి. అతడిని మమకారం అనే సంకెళ్లు ఎప్పటికీ బాధించవు.

– భట్టు వెంకటరావు

ఆగస్టు 15 వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

• అధికారులకు సీఎస్ ఆదేశాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రస్థాయిలో ఈనెల 15న విజయవాడ, ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15 ఏర్పాట్లపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈ వేడుకలకు శాఖల వారీగా పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అదేరోజు సాయంత్రం రాజ్‌భవన్‌లో జరిగే ఎట్ హోంకు కూడా విస్తృత ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవన్నీ ప్రొటోకాల్ విభాగం, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ సంబంధిత శాఖలను సమన్వయం చేసుకోవాలని సీఎస్ ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆయా శాఖల వారీగా ప్రత్యేక శకటాల ప్రదర్శనను ఏర్పాటు చేయాలని చెప్పారు. రాజ్‌భవన్, హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయం సహా ఇతర ప్రముఖ కార్యాలయాలు, భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. సాధారణ పరిపాలన (పొలిటికల్) ముఖ్య కార్యదర్శి ఎస్. సురేశ్‌కుమార్, శాంతి భద్రతల ఐజీ శ్రీకాంత్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన, ప్రోటోకాల్ డైరెక్టర్ బాల సుబ్రహ్మణ్యం రెడ్డి, రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు పి.కిరణ్ కుమార్ మాట్లాడారు.

కలెక్టర్ల సదస్సుపై రెవెన్యూ ప్రత్యేక సీఎస్ సమీక్ష



సాక్షి, అమరావతి: ఆగస్టు 5, 6 తేదీల్లో రాష్ట్ర సచివాలయంలో జరగనున్న కలెక్టర్లు, ఎస్పీల సమావేశాలకు తగిన ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఉన్నతాధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో సీసీఎల్ఏ (భూ పరిపాలన ప్రధాన కమిషనర్) జయలక్ష్మితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సదస్సు ఏర్పాట్లపై సిసోడియా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ..5న ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు సమావేశ ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 2 రోజులూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సమావేశం ఉంటుందని చెప్పారు. దీనికి హాజరయ్యే వారికి రవాణా, వసతి ఏర్పాట్లు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజనను ఆదేశించారు. సమావేశం నిర్వహణకు సహాయ సిబ్బందిని సమకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి సూచించారు. భద్రతా చర్యలను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, సచివాలయ ఎస్పీఎఫ్ అధికారులు చూడాలని చెప్పారు.

అలా పోస్టింగ్ ఆర్డర్.. ఇలా వీఆర్

• నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి వీఆర్‌కు బదిలీ

నందికొట్కూరు: పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చి పట్టుమని పది గంటలు గడవకముందే నంద్యాల జిల్లా నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్ రెడ్డిని వీఆర్‌కు బదిలీ చేశారు. పోస్టింగ్‌ల విషయంలో టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తండ్రి బైరెడ్డి రాజశేఖరరెడ్డి మధ్య రగడ జరుగుతోంది. బుధవారం రాత్రి మాండ్ర సిఫార్సు మేరకు సుధాకర్‌రెడ్డికి ఆర్డర్ ఇచ్చిన పోలీసు అధికారులే, తెల్లవారే సరికి బైరెడ్డి సిఫార్సు మేరకు బీఆర్ కృష్ణయ్యకు పోస్టింగ్ ఇచ్చేశారు. ఇచ్చిన ఆర్డర్ కాపీ చేతిలోకి అందకమునుపే పోలీసు ఉన్నతాధికారులు మరొకరికి పోస్టింగ్ ఇవ్వడం పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. శాంతిభద్రతలను పరిరక్షించే పోలీసుల విషయంలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే.. క్షేత్రస్థాయిలో వీళ్ల విధి నిర్వహణ ఎలా ఉంటుందో అర్థమవుతోందంటూ రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఎమ్మెల్యే వర్సెస్ మంత్రి

రోడ్డెక్కిన మార్టూరు గ్రానైట్ అక్రమ దందా రచ్చ



మార్టూరు గ్రానైట్ పాలిషింగ్ పరిశ్రమ

• పర్చూరు ఎమ్మెల్యే, మంత్రి గొట్టిపాటి వర్గాల మధ్య విభేదాలు
• లారీకి రూ. 32 వేలు చొప్పున పర్చూరు ఎమ్మెల్యే అనుచరుల వసూలు
• తమ లారీలకు మామూళ్లు ఇచ్చేది లేదంటున్న మంత్రి అనుచరులు
• ఇరువర్గాల మధ్య ముదిరిన వివాదం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: మార్టూరు గ్రానైట్ అక్రమ రవాణా వ్యవహారం అధికారపార్టీలో అగ్గి రాజేస్తోంది. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మంత్రి గొట్టిపాటి రవికుమార్ వర్గాల మధ్య ఇది మరింత విభేదాలు సృష్టించింది. గ్రానైట్ అక్రమ రవాణాకు సంబంధించి ప్రతి లారీకి కప్పం కట్టాల్సిందేనంటూ పర్చూరు ఎమ్మెల్యే అనుచరులు పట్టుబడుతుండగా, తాము చెల్లించేది లేదంటూ మంత్రి, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి అనుచరులు తెగేసి చెబుతున్నారు. వీరి మధ్య ముదిరిన ఈ వివాదం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

జీరో బిల్లులతో అక్రమ రవాణా

ప్రభుత్వానికి రాయల్టీ, జీఎస్టీతో పాటు ఎటువంటి పన్నులు చెల్లించకుండా జీరో బిల్లులతో మార్టూరు నుంచి గ్రానైట్ నిత్యం తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలు, పలు దేశాలకు తరలిపోతోంది. రోజుకు కనీసం 80 లారీల్లో 30 నుంచి 45 టన్నుల పాలిషింగ్ బండలు ఇలా జీరో బిల్లులతో తరలిస్తున్నారు. గ్రానైట్ ఫ్యాక్టరీలు పర్చూరు నియోజకవర్గంలోని మార్టూరులో ఉన్నాయి. జీరో బిల్లులతో తరలిస్తున్నందున ఇక్కడి అధికారపార్టీ ఎమ్మెల్యే అనుచరులు వసూళ్లకు పాల్పడుతున్నారు. మార్టూరు నుంచి తెలంగాణకు లారీ వెళ్లాలంటే బాపట్ల జిల్లాలోని పర్చూరు, అద్దంకి, పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, నరసరావుపేట, పిడుగురాళ్ల లేదా మాచర్ల నియోజకవర్గాలు దాటాల్సి ఉంది. పర్చూరు నియోజకవర్గం నేతకు లారీకి రూ. 8 వేలు చెల్లిస్తుండగా చిలకలూరిపేట నేతకు రూ. 2 వేలు, నరసరావుపేట నేతకు రూ. 4 వేలు, సరిహద్దు కావడంతో మాచర్ల రూటున వెళితే అక్కడి నేతకు రూ. 10 వేలు, లేదా పిడుగురాళ్ల రూటున వెళితే అక్కడి నేతకు రూ. 10 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. రూ. 8 వేలు దందా నిర్వాహకులు తమ వాటాగా తీసుకుంటున్నారు. మొత్తంగా లారీకి రూ. 32 వేలు వసూలు చేస్తున్నారు.

పర్చూరు నేత కనుసన్నల్లోనే వసూళ్ల పర్వం..

డబ్బు చెల్లించిన లారీలను మాత్రమే పిడుగురాళ్ల లేదా మాచర్ల నుంచి తెలంగాణలోకి అనుమతిస్తున్నారు. లారీకి చెల్లించాల్సిన రూ. 32 వేలు వసూలయ్యాకే వాటిని పంపుతున్నారు. ఇలా వసూలైన మొత్తాన్ని పర్చూరు నేత అనుచరులు అందరికీ పంపకాలు చేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని ఆ పర్చూరు నేత మార్టూరు మండలానికి చెందిన ఓ బీసీ నేతకు అప్పగించారు. ఆవ్యక్తి అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ నేతకు రూ. 2 కోట్లు ఎన్నికల ఫండ్ ముట్టజెప్పాడని సమాచారం. దీంతో కూటమి అధికారంలోకి వచ్చిన మొదటి వారం నుంచే గ్రానైట్ అక్రమ రవాణా వ్యవహారం అతనికి కట్టబెట్టారని తెలుస్తోంది.

కప్పం కట్టేందుకు ససేమిరా..

మంత్రి గొట్టిపాటి సొంత గ్రామం పర్చూరు నియోజకవర్గంలోని యద్దనపూడి మండలంలో ఉంది. మార్టూరు గ్రానైట్ పరిశ్రమ నిర్వాహకుల్లో మంత్రి అనుచరులు కూడా ఉన్నారు. మంత్రికి అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ, సంతమాగులూరు ప్రాంతాల్లో గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. ఇక్కడి నుంచి మార్టూరులోని 250 పాలిషింగ్ పరిశ్రమలకు గ్రానైట్ రాయి (ముడిరాయి)ని తరలిస్తారు. గొట్టిపాటి క్వారీల నుంచి రాయిని తెచ్చుకోవడం, పైగా సొంత నియోజకవర్గానికి చెందినవారు కావడంతో గ్రానైట్ వ్యాపారులకు మంత్రితో సత్సంబంధాలున్నాయి. కొందరు బంధువులు కూడా ఉన్నారు. వీరంతా పర్చూరు టీడీపీ ఎమ్మెల్యే అనుచరులకు కప్పం కట్టేది లేదంటూ తేల్చి చెబుతున్నారు. తమ నియోజకవర్గంలో ఉన్న ఫ్యాక్టరీల నుంచి ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్నందున తమ నేతకు కప్పం కట్టాల్సిందేనంటూ పర్చూరు ఎమ్మెల్యే అనుచరులు డిమాండ్ చేస్తున్నారు. అయితే మంత్రి సొంత గ్రామం ఇదే నియోజకవర్గంలో ఉంది కాబట్టి కట్టించుకుంటున్న కప్పంలో వాటా ఇవ్వాలని గొట్టిపాటి అనుచరులు మెలిక పెట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య అగ్గిరాజుకుంది. ఈ వ్యవహారం అద్దంకి, పర్చూరు ప్రాంతాల్లోనే కాక జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కూటమి అధిష్టానానికి సైతం ఈ రచ్చ చేరినట్లు అధికారపార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

ప్రభుత్వాదాయానికి భారీగా గండి..

అధికార పార్టీకి చెందిన వారే ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా అక్రమంగా గ్రానైట్ తరలిస్తుండటంతో ఖజానాకు భారీగా గండి పడుతోంది. ప్రతి టన్ను పాలిషింగ్ రాయికి సేల్స్‌టాక్స్ రూ. 1,300, మైనింగ్ ట్యాక్స్ రూ. 700 చొప్పున మొత్తం రూ. 2 వేలు ప్రభుత్వానికి చెల్లించాలి. ఈ లెక్కన 35 టన్నుల లారీకి రూ. 70 వేలు ట్యాక్స్ చెల్లించాలి. రోజుకు 80 లారీలు అనుకుంటే రూ. 56 లక్షలు ట్యాక్స్ రావాల్సి ఉంది. ఈ మొత్తాన్ని వ్యాపారులు ప్రభుత్వానికి చెల్లించకుండా అక్రమ మార్గంలో గ్రానైట్‌ను తరలిస్తున్నారు. అయినా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

'భైరవుడి' రక్తదానం

మరో కుక్కకు ప్రాణదానం • బెంగళూరులో అరుదైన ఘటన



'రక్తదానం చేయండి.. ప్రాణాలు కాపాడండి' మనం తరచూ చూస్తుంటాం. కానీ మేం కూడా మనుషులకు ఏమాత్రం తీసిపోమని ఓ కుక్క దీన్ని నిరూపించింది. కర్ణాటకలోని కొప్పళలో 9 ఏళ్ల ల్యాబ్రాడార్ రక్తహీనతతో బాధపడుతోంది. అత్యవసరంగా రక్తం ఎక్కించాల్సి ఉండగా, ఇందుకోసం మూడు డాబర్‌మేన్ కుక్కల యజమానులను సంప్రదించి, వాటి రక్తం శాంపిళ్లను పరీక్షకు పంపారు. అందులో ప్రొఫెసర్ బసవరాజ పూజారకు చెందిన మూడేళ్ల 'భైరవ' అనే డాబర్‌మేన్ జాతికి చెందిన కుక్క రక్తం సరిగ్గా సరిపోయింది. వైద్య నియమాల ప్రకారం కుక్క గొంతు నుంచి 12 నిమిషాల్లో 300 ఎంఎల్ రక్తం సేకరించి, రక్తహీనత ఉన్న ల్యాబ్రాడార్‌కు ఎక్కించి ప్రాణాలు నిలిపారు. దీంతో తన భైరవను చూస్తే గర్వంగా ఉందంటూ ప్రొఫెసర్ పూజార మురిసిపోతున్నారు.

– సాక్షి, బెంగళూరు

సీవోటీ కమిషనర్‌గా వెంకటాచార్యులు

వివిధ హోదాల్లో మరికొందరు నియామకం

సాక్షి, అమరావతి: కమీషనరేట్ ఆఫ్ టెండర్స్ (సీవోటీ) కమిషనర్‌గా ఎస్కే వెంకటాచార్యులును నియమిస్తూ జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వెంకటాచార్యులు చీఫ్ ఇంజనీర్ హోదాలో సచివాలయంలో జల వనరుల శాఖ సంయుక్త కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇదిలావుండగా.. ఎస్ఈ బి.రాంబాబును కృష్ణా డెల్టా సిస్టమ్ (కేడీఎస్) సీఈగా, పీ అండ్ ఎం ఎస్ఈగా పనిచేస్తున్న ఆర్వీ ప్రకాశ్‌ను హెచ్ఆర్ సీఈగా, శ్రీశైలం డ్యామ్ మెయింటెనెన్స్ ఎస్ఈ రామచంద్రమూర్తిని కడప క్వాలిటీ కంట్రోల్ విభాగం సీఈగా, ఏలూరులో నీరు–ప్రగతి ఎస్ఈగా పనిచేస్తున్న వై.శ్రీనివాస్‌ను చిన్న, మధ్యతరహా నీటిపారుదల విభాగం సీఈగా, హైడ్రాలజీ సీఈ టీవీఎస్ఏఆర్ రత్నకుమార్‌ను సీడీవో సీఈగా నియమించారు. పులిచింతల ప్రాజెక్టు ఈఈ జె.గుణాకర్‌రావును హైడ్రాలజీ విభాగం ఎస్ఈగా, ఎస్సార్బీసీ ఈఈ ఎన్సీ సుబ్బరాయుడును తెలుగుగంగ (నంద్యాల) సర్కిల్ ఎస్ఈగా, గోరకల్లు ఈఈ ఎల్.రాజశేఖర్‌ను తెలుగుగంగ ప్రాజెక్టు నంద్యాల సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ ఎస్ఈగా, సీడీవో విభాగంలో డీఈఈగా పనిచేస్తున్న ఎస్ఎన్ సత్యనారాయణను అదే విభాగంలో ఈఈగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

యూఏఈ, ఏపీ మధ్య విమాన కనెక్టివిటీ పెంచుతాం

యూఏఈ రాయబారి అబ్దుల్ నాసర్ అల్షాలీ



సమావేశంలో పాల్గొన్న యూఏఈ రాయబారి అబ్దుల్ నాసర్, మంత్రి టీజీ భరత్ తదితరులు

సాక్షి, అమరావతి: ఇండియా–యూఏఈ వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఆంధ్రప్రదేశ్ అత్యంత కీలకమైనదని, ఇందులో భాగంగా ప్రజల మధ్య సంబంధాలు, ప్రత్యక్ష పెట్టుబడులను మరింతగా పెంచడానికి విమాన కనెక్టివిటీని మెరుగుపరచాలని నిర్ణయించినట్లు భారత్‌లో యూఏఈ రాయబారి అబ్దుల్ నాసర్ అల్షాలీ ప్రకటించారు. యూఏఈ నుంచి విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి నగరాలకు వారానికి 35 డైరెక్ట్ విమానాలను ప్రారంభించడానికి అవకాశాలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. యూఏఈ రాయబార కార్యాలయం, యూఏఈ–ఇండియా సీఈపీఏ కౌన్సిల్ (యూఐసీసీ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఆర్థిక–పెట్టుబడుల అవకాశాలపై గురువారం విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా అల్షాలీ మాట్లాడుతూ యూఏఈ–ఆంధ్రప్రదేశ్ మధ్య ఆర్థిక, పెట్టుబడి సహకార స్థాయిని పెంచడం చాలా అవసరమన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, ఏవియేషన్, బయోటెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఆటోమోటివ్‌లు, పెట్రోకెమికల్స్, షిప్పింగ్, లాజిస్టిక్స్, పోర్టులలో పెట్టుబడుల అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో యూఏఈకి చెందిన అబుదాబి పోర్ట్స్, ఎయిర్ అరేబియా, అరామెక్స్, డీపీ వరల్డ్, డ్యూకాబ్, ఎమ్మార్, ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్, ఎమిరేట్స్ ఎన్‌బీడీ, షైె దుబాయ్, ది లులు గ్రూప్, తబ్రీద్ కంపెనీల ప్రతినిధులతోపాటు రాష్ట్రం నుంచి 50 మందికిపైగా పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నా లాంగ్వేజ్‌కు.. బాడీ లాంగ్వేజ్‌కు స్పీకర్ కుర్చీ పడదు

స్పీకర్ అయ్యన్నపాత్రుడు



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

గోకవరం: 'నా లాంగ్వేజ్‌కు... బాడీ లాంగ్వేజ్‌కు స్పీకర్ కుర్చీ పడదు. కానీ రాజ్యాంగబద్ధంగా నడచుకుంటా' అని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. తూర్పు గోదావరి జిల్లా గోకవరం నుంచి తంటికొండ దేవస్థానం వరకు రూ.3.75 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగానికి అనుగుణంగా ప్రవర్తించాలనే ఉద్దేశంతో రాజ్యాంగం చదువుకుంటున్నానని, అందులో నిబంధనల ప్రకారం గాడితప్పకుండా మంచి పరిపాలన అందించడానికి కృషి చేస్తానని చెప్పారు. అసెంబ్లీలో ప్రజల వాణి వినిపించేందుకు అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు అవకాశం ఇస్తానని తెలిపారు.

ఈ వయసులో నేను రేప్ చెయ్యగలనా?

తనపై 16 కేసులు పెట్టారని, రేప్ కేసు కూడా పెట్టారని, ఈ వయసులో తాను రేప్ చెయ్యగలనా.. అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. గోకవరంలో జరిగిన వెలమ సంఘం ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనేక మంది వెనుకబడిన తరగతుల వారికి ఎన్టీఆర్ రాజకీయ భిక్ష పెట్టారని తెలిపారు. తనకు ఈ గౌరవం ఎన్టీఆర్ వల్లే వచ్చిందని, చచ్చే వరకూ టీడీపీలోనే ఉంటానని తెలిపారు. పిల్లలను కష్టపడి చదివించి మంచి భవిష్యత్తు అందించాలని, పిల్లల చదువే కుటుంబానికి శ్రీరామరక్ష అని చెప్పారు.

నేడు అమరావతికి ఐఐటీ నిపుణులు



సాక్షి, అమరావతి: అమరావతిలో 2019కు ముందు నిర్మాణాలు ప్రారంభమై మధ్యలో నిలిచిపోయిన భవనాల స్థితిగతులను అధ్యయనం చేసేందుకు మద్రాస్, హైదారాబాద్ ఐఐటీల నిపుణుల బృందం శుక్రవారం రానుంది. రెండురోజుల పాటు ఇక్కడే ఉండి .. నిర్మాణాల పటిష్టత, ఇతర సాంకేతిక అంశాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తారని మున్సిపల్ శాఖ మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. సెక్రటేరియట్, హెచ్‌వోడీ కార్యాలయాల టవర్లతో పాటు హైకోర్టు భవనాన్ని ఐకానిక్ కట్టడాలుగా నిర్మించేందుకు గత టీడీపీ ప్రభుత్వం పనులు మొదలు పెట్టి పునాదులు నిర్మించిందని, అయితే, పునాదుల దశలోనే ఆయా నిర్మాణాలు నిలిచిపోయాయని తెలిపింది. ఈ భవనాల ఫౌండేషన్ సామర్థ్యాన్ని పరిశీలించే బాధ్యతను ఐఐటీ మద్రాస్ నిపుణులకు ప్రభుత్వం అప్పగించింది. అఖిల భారత సర్వీసెస్ అధికారుల నివాసాలు, మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్ల నాణ్యతను అంచనా వేసే బాధ్యతను హైదరాబాద్ ఐఐటీకి అప్పగించింది.

ఎస్ఆర్‌సీ నివేదికను సవాల్ చేసుకోండి

• మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి హైకోర్టు స్పష్టీకరణ
• తదుపరి విచారణ ఈనెల 8కి వాయిదా



సాక్షి, అమరావతి: ప్రాణహాని లేదంటూ సెక్యూరిటీ రివ్యూ కమిటీ (ఎస్ఆర్‌సీ) ఇచ్చిన నివేదికను సవాల్ చేసుకోవాలని మాజీ అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి హైకోర్టు స్పష్టం చేసింది. ఎస్ఆర్‌సీ నివేదికను సుధాకర్‌రెడ్డికి అందజేయాలని హోంశాఖను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది. అప్పటి వరకు ఆయనకు భద్రతను కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే ఇందుకు అయ్యే వ్యయాన్ని సుధాకర్‌రెడ్డే భరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో కేసులు వాదించానన్న కక్షతో తనకున్న భద్రతను ఉపసంహరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని, తన భద్రతను కొనసాగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పొన్నవోలు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

రాంసింగ్ వ్యాజ్యంపై విచారణ వాయిదా

12న తుది విచారణ జరుపుతామన్న హైకోర్టు

సాక్షి, అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్పటి సీబీఐ దర్యాప్తు అధికారి రాంసింగ్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణ ఈనెల 12కి హైకోర్టు వాయిదా వేసింది. ఆ రోజున ఈ వ్యాజ్యంపై తుది విచారణ జరుపుతామని తేల్చి చెప్పింది. వివేకా హత్య కేసును తెలంగాణకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను, అలాగే ఫిర్యాదుదారు గజ్జల ఉదయ్‌కుమార్‌రెడ్డి బెయిల్ నిరాకరిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను మెమో రూపంలో కోర్టు ముందుంచేందుకు రాంసింగ్‌కు అనుమతినిచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వివేకా హత్య కేసులో తప్పుడు సాక్ష్యం ఇవ్వాలంటూ అప్పటి దర్యాప్తు అధికారి రాంసింగ్ తనను బెదిరిస్తున్నారంటూ గజ్జల ఉదయ్ ఫిర్యాదు అనంతరం పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నింటినీ నిలిపేస్తూ 2022 ఫిబ్రవరి 23న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన సంగతి విదితమే. తాజాగా గురువారం రాంసింగ్ వ్యాజ్యం మరోసారి విచారణకు వచ్చింది. ఆయన తరఫున కేంద్ర ప్రభుత్వ న్యాయవాది జూపూడి యజ్ఞదత్ వాదనలు వినిపిస్తూ, సుప్రీంకోర్టు, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులను మెమో రూపంలో కోర్టు ముందుంచుతామన్నారు. ఈ సమయంలో ఫిర్యాదుదారు ఉదయ్ తరఫు సీనియర్ న్యాయవాది ప్రద్యుమ్న కుమార్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ కేసులోలాగే మరో వ్యక్తిని కూడా రాంసింగ్ బెదిరిస్తే కోర్టు రాంసింగ్‌పై కేసు నమోదుకు ఆదేశాలిచ్చిందన్నారు. ఆ కేసును కొట్టేయాలని రాంసింగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ఇప్పటికే కొట్టేసిందన్నారు. అదే రీతిలో దాఖలు చేసిన ఈ వ్యాజ్యాన్ని కూడా కొట్టేయాలని ఆయన కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను వాయిదా వేశారు.

మంత్రి గారు అలిగారా?

తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొనని మహిళా శిశు సంక్షేమ మంత్రి / ఆహ్వానం అందక దూరంగా ఉన్న సంధ్యారాణి



సాక్షి, పార్వతీపురం మన్యం: ఆ మంత్రి అలిగారా.. అందుకే ప్రభుత్వపరంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనలేదా? అన్న చర్చ పార్వతీపురం మన్యం జిల్లాలో సాగుతోంది. గురువారం ప్రారంభమైన ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహణలో మహిళా శిశు సంక్షేమ శాఖది ప్రధాన భాగస్వామ్యం. ఆ శాఖకే మంత్రిగా వ్యవహరిస్తున్న రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి.. జిల్లాలో ఉన్నప్పటికీ, ఎక్కడా ఈ కార్యక్రమాల్లో పాల్గొనలేదు. కనీసం, తన సొంత నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమానికీ ఆమె హాజరు కాకపోవడం చర్చకు దారి తీసింది. ఐసీడీఎస్ తరఫు నుంచి ఆమెకు పిలుపు లేకపోవడమే కారణంగా తెలుస్తోంది. సాలూరు పట్టణంలోని 24, 18వ వార్డు సచివాలయాల పరిధిలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పాచిమెంట మండలంలోని పెద్దగెడ్డ ప్రాజెక్టు నీటిని ఖరీఫ్‌కు విడుదల చేశారు. ఈ రెండు చోట్ల పాల్గొన్న ఆమె.. తల్లిపాల వారోత్సవాలకు ఎందుకు హాజరు కాలేదు. ఐసీడీఎస్ సాలూరు సీడీపీఓ శిక్షణ నిమిత్తం బెంగళూరుకు వెళ్లగా.. ఓ సూపర్‌వైజర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రొటోకాల్ విషయంలో సదరు సూపర్‌వైజర్‌కు ఎవరూ చెప్పకపోవడం, కార్యక్రమానికి ఐసీడీఎస్ నుంచి ఆహ్వానం అందకపోవడంతో మంత్రి చిన్నబుచ్చుకున్నట్లు తెలుస్తోంది. దీంతోనే ఆమె అధికారిక కార్యక్రమమైన తల్లిపాల వారోత్సవాలకు హాజరు కాలేదని తెలిసింది.

మహిళలపై జరిగిన అకృత్యాలపై సుమోటోగా విచారణ

• ఏపీ మహిళా కమిషన్ నిర్ణయం
• పోలీసు ఉన్నతాధికారులకు లేఖలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పలుచోట్ల మహిళలపై జరిగిన అకృత్యాలపై ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సీరియస్‌గా స్పందించింది. ఈ మేరకు కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి గురువారం మీడియాలో ప్రచురితమైన పలు ఘటనలను కమిషన్ సుమోటోగా స్వీకరించి విచారించాలని నిర్ణయం తీసుకున్నారు. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చేజెర్లలో జనసేన నేత వేధింపులకు తాళలేక కృష్ణవేణి అనే మహిళ బలవన్మరణానికి సంబంధించిన ఘటనపై తక్షణమే చర్యలు చేపట్టి నివేదిక పంపాలని పల్నాడు ఎస్పీని కోరుతూ లేఖ పంపారు. ఒంగోలు జిల్లా మోటుమాల కేజీబీవీలో ఇంటర్ బాలిక ప్రసవంపై వెంకటలక్ష్మి ఆరా తీశారు. స్థానిక మహిళా శిశు సంక్షేమ అధికారులతో పాటు జిల్లా ఎస్పీలను లేఖల ద్వారా ప్రాథమిక విచారణ నివేదికలు అడిగారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామానికి చెందిన అయిలూరి సంతోషలక్ష్మి టీడీపీ నేతల నుంచి ప్రాణహాని ఉందని కోరినా స్థానిక పోలీసులు పట్టించుకోని వైనంపై పత్రికల్లో వచ్చిన కథనంపైనా మహిళా కమిషన్ దృష్టి పెట్టింది. చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలానికి చెందిన ఓ ఉన్మాది కన్న కూతురిని చార్జింగ్ వైర్‌తో గొంతునులిమి చంపిన వైనంపై మహిళా కమిషన్ స్పందించి దర్యాప్తు నివేదిక పంపాలని చిత్తూరు ఎస్పీని లేఖలో కోరారు. వరుస ఘటనలు చూస్తే రాష్ట్రంలో మహిళలపై, బాలికలపై హత్యలు, అత్యాచారాలు విపరీతంగా జరుగుతున్నాయని వెంకటలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడులను ఆపేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి సస్పెన్షన్

ఏసీబీ విచారణకు ప్రభుత్వం ఆదేశం

సాక్షి, అమరావతి: గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన ఉన్నతాధికారులపై టీడీపీ కూటమి ప్రభుత్వం వేధింపుల పర్వం కొనసాగిస్తోంది. తాజాగా గనుల శాఖ మాజీ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డిని సస్పెండ్ చేసింది. కేంద్ర సర్వీసుల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన ఆయన్ను రిలీవ్ చేయకుండా అడ్డుకుని తిరిగి కేంద్ర సర్వీసులకు వెళ్లే అవకాశం లేకుండా సస్పెండ్ చేయడం అధికార వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇండియన్ కోస్ట్ గార్డ్స్‌లో సీనియర్ సివిలియన్ స్టాఫ్ అధికారిగా ఉన్న వెంకటరెడ్డి డిప్యుటేషన్‌పై ఏపీకి వచ్చారు. గత ప్రభుత్వ హయాంలో గనుల శాఖ డైరెక్టర్‌తో పాటు ఏపీఎండీసీ ఎండీగా బాధ్యతలు నిర్వర్తించారు. కక్ష సాధింపులో భాగంగా ఆయనపై పలు ఆరోపణలు మోపి తిరిగి సొంత సర్వీసులకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వలేదు. తాజాగా సస్పెండ్ చేయడంతో పాటు ఏసీబీ విచారణకు ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం వేర్వేరు ఉత్తర్వులిచ్చారు. ఇసుక ఆపరేషన్స్‌కి సంబంధించిన వ్యవహారాల్లో అవకతవకలు జరిగాయని, తద్వారా ప్రభుత్వ ఆదాయానికి భారీగా నష్టం కలిగించారని ఆయనపై అభియోగాలు మోపారు. సస్పెన్షన్ సమయంలో అనుమతి లేకుండా ఆయన హెడ్‌క్వార్టర్స్ దాటి బయటకు వెళ్లకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వెంకటరెడ్డిపై అభియోగాలు వచ్చిన నేపథ్యంలో శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు సస్పెన్షన్ విధించినట్లు కోస్ట్ గార్డ్స్ డైరెక్టర్ జనరల్‌కు లేఖ రాశారు.

హమాస్ మిలిటరీ చీఫ్ మొహమ్మద్ దీఫ్ హతం

ధ్రువీకరించిన ఇజ్రాయెల్ సైన్యం



జెరూసలేం: హమాస్ మిలటరీ విభాగం 'ఖ స్సం బ్రిగేడ్స్' అధి నేత మొహమ్మద్ దీఫ్‌ను ఖతం చేశామని ఇజ్రాయెల్ సైన్యం గురువారం ఒక ప్రకటనలో తేల్చిచెప్పింది. జూలై 13న దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ సిటీ శివారులో ఓ కాంపౌండ్‌పై నిర్వహించిన వైమానిక దాడులో అతడు హతమయ్యాడని వెల్లడించింది. నిఘా వర్గాల సమాచారం మేరకు తాజాగా ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నట్లు పేర్కొంది. ఇరాన్‌లోని టెహ్రాన్‌లో హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియేను హత్య చేసిన మరుసటి రోజే మొహమ్మద్ దీఫ్ మృతిని ఇజ్రాయెల్ నిర్ధారించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష యుద్ధమే!

- నేరుగా దాడులు చేయండి
- ఇరాన్ సైన్యానికి సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ఆదేశాలు
- మేము సైతం సిద్ధంగా ఉన్నాం.. ప్రతిస్పందించిన ఇజ్రాయెల్


టెహ్రాన్/బీరుట్: ఒకవైపు గాజాలో మారణకాండ సాగిస్తూ, మరోవైపు హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ హనియేను పొట్టనపెట్టుకున్న ఇజ్రాయెల్ దుశ్చర్య పట్ల ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఇజ్రాయెల్‌కు తగిన గుణపాఠం నేర్పాలన్న కృతనిశ్చయంతో ఆయన ఉన్నారు. హనియే హత్యకు ఇక ప్రతీకారం తీర్చుకోక తప్పదని భావిస్తున్నారు. ఇజ్రాయెల్‌పై నేరుగా దాడి చేయాలని ఆయన తమ సైన్యానికి తాజాగా స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు ముగ్గురు ఇరాన్ అధికారులను ఉటంకిస్తూ న్యూయార్క్ టైమ్స్ పత్రిక వెల్లడించింది. హనియే హత్యపై ప్రకటన వెలువడగానే బుధవారం ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ అత్యవసరంగా సమావేశమైంది. చాలా అసాధారణ పరిస్థితుల్లోనే ఇలాంటి సమావేశం నిర్వహిస్తారు. తాజా పరిణామాలపై ఈ భేటీలో ఖమేనీ సమీక్ష నిర్వహించారు. ఇజ్రాయెల్‌పై నేరుగా దాడులకు దిగాలని సైనికాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇజ్రాయెల్‌కు బుద్ధి చెప్పడానికి ఇక ప్రత్యక్ష యుద్ధం తప్పదని పరోక్షంగా సంకేతాలిచ్చారు. ఇదిలా ఉండగా, పూర్తిస్థాయి యుద్ధానికి తాము సైతం సిద్ధంగా ఉన్నామని ఇజ్రాయెల్ ప్రభుత్వం దౌత్యమార్గాల్లో ఇరాన్‌కు సందేశం చేరవేసినట్లు ఇజ్రాయెల్‌కు చెందిన 'చానెల్ 12' తెలియజేసింది. తమ దేశంపై ఇరాన్ గానీ, దాని మిత్రదేశాలు గానీ దాడులకు దిగితే పూర్తిస్థాయి యుద్ధం మొదలైనట్లేనని ఇజ్రాయెల్ తేల్చిచెప్పినట్లు వివరించింది.

భారీ మూల్యం తప్పదు: నెతన్యాహూ

ఇస్మాయిల్ హనియేను హత్య చేసింది ముమ్మాటికీ ఇజ్రాయెల్ సైన్యమేనని ఇరాన్, హమాస్ ఆరోపిస్తున్నాయి. దీనిపై ఇజ్రాయెల్ ఇంకా నోరువిప్పలేదు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ తాజాగా స్పందించారు. తమ దేశం వైపు కన్నెత్తి చూస్తే శత్రువులు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో తమకు మరిన్ని సవాళ్లు ఎదురవుతాయని భావిస్తున్నామని 'అసోసియేటెడ్ ప్రెస్'తో మాట్లాడుతూ చెప్పారు.

ఇస్మాయిల్ హనియేకు ఖమేనీ నివాళులు

ఇజ్రాయెల్ దాడుల్లో ప్రాణాలు విడిచిన హమాస్ అధినేత ఇస్మాయిల్ హనియేకు, ఆయన అంగరక్షకుడికి ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ, నూతన అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఘనంగా నివాళులర్పించారు. గురువారం టెహ్రాన్ యూనివర్సిటీలో నిర్వహించిన నివాళి కార్యక్రమంలో హనియే, సెక్యూరిటీ గార్డు శవపేటికల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.





హిమాచల్‌ప్రదేశ్‌లోని కులూలో ఇళ్ల మధ్యనే వరద ప్రవాహం

ఉత్తరాన వరుణాగ్రహం

7 రాష్ట్రాల్లో మొత్తంగా 36 మంది దుర్మరణం

- ఉత్తరాఖండ్‌లో కుంభవృష్టి
- హిమాచల్‌ప్రదేశ్‌లోనూ భారీ వర్షాలు
- దేశ రాజధానిని ముంచేసిన వాన

డెహ్రాడూన్/సిమ్లా/న్యూఢిల్లీ/జైపూర్: కేరళ కొండల్లో బురద, బండరాళ్లు సృష్టించిన విలయ విషాద ఘటన మరువకముందే ఉత్తరాదిపై వరుణుడు తన ప్రకోపం చూపించాడు. ఉత్తరాఖండ్ మొదలు రాజస్థాన్‌దాకా ఉత్తరభారత రాష్ట్రాల్లో ఎడతెగని వానలు పడ్డాయి. దీంతో ఏడు రాష్ట్రాల్లో కలిపి మొత్తంగా 36 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరాఖండ్‌లో 12 మంది, హిమాచల్ ప్రదేశ్‌లో ఐదుగురు, ఢిల్లీలో ఆరుగురు, ఉత్తరప్రదేశ్‌లో ఇద్దరు, హరియాణాలో ముగ్గురు, రాజస్థాన్‌లో ముగ్గురు, బిహార్‌లో ఐదుగురు చనిపోయారు. చాలా మంది జాడ గల్లంతైంది. నదులు ఉప్పొంగి ప్రవహిస్తూ సమీప జనావాసాలను తమలో కలిపేసుకున్నాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో కొండప్రాంతాల్లోని ఇళ్లు నేలమట్టమయ్యాయి. పలుచోట్ల రోడ్లు తెగిపోయాయి. దీంతో రాకపోకలు స్తంభించాయి. ఎన్‌డీఆర్‌ఎఫ్, రాష్ట్ర విపత్తు స్పందన దళాలు, పోలీసులు, స్థానికులు ముమ్మర సహాయక చర్యల్లో మునిగిపోయారు.

ఉత్తరాఖండ్‌లో ఎక్కువ మరణాలు

ఉత్తరాఖండ్‌లో కుంభవృష్టి కారణంగా 12 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. నదులు ఉప్పొంగి ప్రవహిస్తూ సమీప ఇళ్లను నేలమట్టంచేశాయి. హరిద్వార్, తెహ్రీ, డెహ్రాడూన్, ఛమోలీ జిల్లాలో వర్షపాత ప్రభావం ఎక్కువగా ఉంది. హరిద్వార్‌లోని రోషనాబాద్‌లో 210 మిల్లీమీటర్లు, డెహ్రాడూన్‌లో 172 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తెహ్రీ జిల్లా జఖన్‌యాలీ గ్రామంలో రోడ్డ పక్కన రెస్టారెంట్‌పై కొండచరియలు పడటంతో ఒకే కుటుంబంలో ముగ్గురు మట్టిపెళ్లల కింద సజీవసమాధి అయ్యారు. గౌరీకుండ్-కేదార్‌నాథ్ కొండ మార్గంలో పాతిక మీటర్ల దారి వర్షాలకు కొట్టుకుపోవడంతో భీమ్‌బలీ చౌక్ వద్ద చిక్కుకుపోయిన 1,525 మందిలో 425 మందిని సురక్షితంగా తీసుకొచ్చామని సీఎం చెప్పారు. 1,100 మందిని సోనప్రయాగ్‌కు సురక్షితంగా తీసుకొచ్చామని విపత్తు కార్యదర్శి వినోద్ సుమన్ చెప్పారు. మిగతా వారిని హెలీకాప్టర్లలో తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

హిమాచల్‌లో 50 మంది జాడ గల్లంతు

హిమాచల్ ప్రదేశ్‌నూ వర్షాలు ముంచెత్తాయి. వర్ష సంబంధ ఘటనల్లో ఐదుగురు మరణించారు. వేర్వేరు జిల్లాల్లో మొత్తంగా 50 మంది జాడ గల్లంతైంది. పలు వంతెనలు, రోడ్లు, ఇళ్లు వరదనీటి ఉధృతికి కొట్టుకుపోయాయి. మండీ, రాంపూర్, సిమ్లా జిల్లాల్లో వర్షప్రభావం ఎక్కువగా ఉంది. మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారిపై చాలాచోట్ల కొండచరియలు పడటంతో రాకపోకలు స్తంభించాయి. గల్లంతైన వారి జాడ కోసం ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసులు డ్రోన్ల సాయంతో గాలిస్తున్నారు. కూలూలోని మలానా డ్యామ్ పై నుంచి నీరు కిందకు ప్రవహిస్తోంది. దీంతో భారీఎత్తున నీరు దిగువ ప్రాంతాలను ముంచేసింది. దీంతో ఎగువ ప్రాంతాలకు తక్షణం వెళ్లిపోవాలని స్థానికులకు అధికారులు హెచ్చరికలు పంపారు.

ఢిల్లీలో 108 మిల్లీమీటర్ల వర్షపాతం

గురువారం ఢిల్లీలో వర్ష సంబంధ ఘటనల్లో ఆరుగురు చనిపోయారు. 24 గంటల వ్యవధిలో ఢిల్లీలో 108 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గత 14 ఏళ్లలో ఢిల్లీలో జూలై నెలలో ఒక్కరోజులో ఇంతటి వర్షం పడటం ఇదే తొలిసారి. ముఖ్యంగా మయూర్‌విహార్ వద్ద 147 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయింది.

ఆగని మరణ మృదంగం

తీసే కొద్దీ గుట్టలుగా బయటపడుతున్న మృతదేహాలు

- కేరళ విలయ ఘటనలో 289కి చేరిన మరణాల సంఖ్య
- ముమ్మర గాలింపు చర్యల్లో ఆర్మీ

వయనాడ్(కేరళ): కనీవిని ఎరుగని పెను విషాదం నుంచి కేరళ ఇంకా తేరుకోలేదు. మరుభూమిలా మారిన తమ సొంత భూమి నుంచి బయటకు తీస్తున్న ఆప్తుల పార్థివదేహాలను చూసిన బంధువులు, స్నేహితుల ఆక్రందనలతో ఆ ప్రాంతాలు మార్మోగుతున్నాయి. ముండక్కై, చూరల్మల, అత్తమల, నూల్పుజ కుగ్రామాల్లో ఇప్పటిదాకా మృతిచెందిన వారి సంఖ్య తాజాగా 289కి పెరిగింది. ఇంకా 200 మందికిపైగా స్థానికుల జాడ గల్లంతైంది. కాలంతోపోటీపడుతూ సైన్యం, ఎన్‌డీఆర్‌ఎఫ్, కోస్ట్‌గార్డ్, పోలీసు, స్థానిక యంత్రాంగం ముమ్మర గాలింపు, సహాయక చర్యలు చేపడుతున్నారు. అయితే భీతావహంగా మారిన అక్కడి పరిసరాలు సహాయక చర్యలకు పెద్ద అవరోధంగా తయారయ్యాయి. కూలిన వంతెనలు, కొట్టుకుపోయిన రోడ్లు, కొట్టుకొచ్చిన పెద్దపెద్ద బండరాళ్లు, బురదమయమై నేల, కూలిన చెట్లు, వరద ప్రవాహం, భారీ వర్షం మధ్య సహాయక చర్యలు కొనసాగించడం అక్కడి బృందాలకు పెద్ద సవాల్‌గా మారింది. కాగా, ఇప్పటివరకు 91 శిబిరాలకు 9,328 మందిని తరలించామని కేరళ రెవిన్యూ మంత్రి కె.రాజన్ చెప్పారు. 225 మంది ఆస్పత్రుల్లో చేరగా 96 మందికి చికిత్స కొనసాగుతోంది.

ఇది జాతి విపత్తు: రాహుల్

గతంలో సొంత నియోజకవర్గమైన వయనాడ్‌లో జరిగిన ఈ ఘోర విపత్తు చూసి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చలించిపోయారు. బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు రాహుల్, ప్రియాంకా గాంధీ కేరళకు వచ్చారు. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో వర్షంలోనే పర్యటించారు. తర్వాత మేప్పాడిలోని ఆస్పత్రుల్లో క్షతగాత్రులను, సహాయక శిబిరాల్లో బాధితుల బంధువులను కలిసి పరామర్శించారు. ''ఇది వయనాడ్, కేరళలో భారీ విషాదం నింపింది. బాధిత కుటుంబాలకు తక్షణ సాయం అందాల్సిందే. కుటుంబసభ్యులు, సొంతిళ్లను కోల్పోయిన స్థానికులను చూస్తుంటే మాటలు రావడం లేదు. సర్వం కోల్పోయిన వారిని ఎలా ఓదార్చాలో, వారికెలా ధైర్యం చెప్పాలో తెలీడం లేదు. ఇది జాతీయ విపత్తు' అని రాహుల్ అన్నారు. '' ఇంతటి మహా విషాదాన్ని చూస్తుంటే మా నాన్న చనిపోయిన సందర్భం గుర్తొస్తోంది. అయితే వీళ్లు తమ నాన్నను మాత్రమే కాదు.. మొత్తం కుటుంబాన్నే కోల్పోయారు. నేను బాధపడుతున్నదానికంటే అంతులేని విషాదం వీరి జీవితాల్లో ఆవహించింది. వయనాడ్ బాధితులకు అందరూ అండగా నిలబడటం గర్వించాల్సిన విషయం. దేశ ప్రజలు బాధితులకు ఆపన్నహస్తం అందిస్తారు' అని రాహుల్ అన్నారు.

పారిపోదామనుకున్నా: వైద్యురాలి ఆవేదన

ధైర్యంగా పోస్ట్ మార్టమ్ చేసే వైద్యురాలు సైతం మృతదేహాలు ఛిద్రమైన తీరు చూసి డాక్టర్ మనసు కకావికలమైన ఘటన వయనాడ్‌లోని స్థానిక ఆస్పత్రిలో చోటు చేసుకుంది. ఇంతటి హృదయవిదారక దృశ్యాన్ని ఏనాడూ చూడలేదని బాధితుల మృతదేహాలకు పోస్ట్ మార్టమ్ చేసిన ప్రభుత్వ వైద్యురాలు గద్గద స్వరంతో చెప్పారు. '' ఎన్నో రకాల పోస్ట్‌మార్టమ్‌లు చేశాగానీ ఇలాంటివి ఇదే మొదలు. ఎన్నో ఏళ్ల అనుభవం ఉన్న వైద్యులు శవపరీక్ష సమయంలో గుండెనిబ్బరంతో ఉంటారు. కానీ భారీ బండరాళ్ల పడిన ధాటికి దెబ్బతిన్న మృతదేహాలను చూశాక నాలో స్థైర్యం పోయింది. కొన్ని మృతదేహాలు పూర్తిగా ఛితికిపోయాయి. ఒకదానివెంట మరోటి తెస్తూనే ఉన్నారు. ఎక్కువ మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా రూపు కోల్పోయాయి. ఒక ఏడాది చిన్నారి మృతదేహం దారుణంగా దెబ్బతింది. ఇక నా వల్ల కాదు.. క్షతగాత్రుల సహాయక శిబిరానికి పారిపోదామనుకున్నా. కానీ ఇంకోదారిలేక వృత్తిధర్మం పాటిస్తూ 18 మృతదేహాలకు పోస్ట్‌మార్టమ్ చేశా. తర్వాత కేరళలోని వేర్వేరు ప్రాంతాల నుంచి సర్జన్లు వచ్చారు. రాత్రి 11.30కల్లా 93 పోస్ట్‌మార్టమ్‌లు పూర్తిచేశాం. ఈ ఘటనను జీవితంలో మర్చిపోను' అని వైద్యురాలు తన అనుభవాన్ని చెప్పారు.

కదిలొచ్చిన తల్లి హృదయం

తల్లులను కోల్పోయిన పసిపిల్లలు పాల కోసం గుక్కపెట్టి ఏడుస్తున్న దృశ్యాలను చూసిన ఒక తల్లి అనుకున్న తడవుగా వయనాడ్‌కు పయనమైంది. నాలుగు నెలల బిడ్డకు తల్లి అయిన ఆమె విషాదవార్త తెలియగానే వయనాడ్‌కు భర్త, పిల్లలతో కలిసి బయల్దేరారు. సెంట్రల్ కేరళలోని ఇడుక్కి నుంచి వస్తున్న ఆమెను మీడియా పలకరించింది. '' నాకూ చంటిబిడ్డ ఉంది. తల్లిపాల కోసం బిడ్డపడే ఆరాటం నాకు తెలుసు. అందుకే నా చనుబాలు ఇచ్చి అక్కడి అనాథలైన పసిబిడ్డల ఆకలి తీరుస్తా' అని ఆమె అన్నారు. కాగా, కేరళ బాధితులకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతూ అమెరికా అధ్యక్షుడు బైడెన్ తన సంతాప సందేశం పంపించారు. అవిశ్రాంతంగా సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆర్మీని ఆయన అభినందించారు.



వయనాడ్‌లో బాధితులను ఓదార్చుతున్న రాహుల్, ప్రియాంకా గాంధీ

బయట పేపర్.. లోపల వాటర్ లీకేజీ

నూతన పార్లమెంట్‌లో వర్షపు నీరు కారుతుండటంతో విపక్షాల విమర్శలు

న్యూఢిల్లీ: ఢిల్లీని ముంచెత్తిన వరుణుడు పార్లమెంట్ వేదికగా విపక్షాలకు కొత్త విమర్శనాస్త్రాన్ని అందించాడు. గత ఏడేళ్లలో 15 రాష్ట్రాల పరిధిలో ఏకంగా పలురకాలైన 70 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు లీకవడంపై కేంద్ర ప్రభుత్వంపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్న విషయం విదితమే. గురువారం పడిన వర్షాలకు నూతన పార్లమెంట్ భవంతిలోని లాబీ పైకప్పు నుంచి వర్షపు నీరు ధారగా పడుతోంది. దీంతో పేపర్ లీకేజీలను వాటర్ లీకేజీతో ముడిపెడుతూ విపక్షాలు భవన నిర్మాణ పటిష్టతను ఎత్తిచూపాయి. '' పేపర్ లీకేజీ బయట. వాటర్ లీకేజీ లోపల. రాష్ట్రపతి విచ్చేసినపుడే వినియోగించే లాబీ పైకప్పు నుంచి ధారగా పడుతున్న వర్షపు నీరు.. భవంతి ఏ మేరకు పటిష్టంగా ఉందనే చేదు నిజాన్ని చాటుతోంది. ఈ విషయమై లోక్‌సభలో వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెడతా' అని కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడు మాణిక్కం ఠాకూర్ 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు. వర్షపు నీటి కోసం బకెట్ పట్టడం, అక్కడి వారంతా చూస్తూ వెళ్తున్న వీడియోను పోస్ట్‌చేశారు. సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సైతం విమర్శించారు. '' ఈ భవంతి కంటే పాత భవనమే నయం. ఎంపీలంతా మాట్లాడుకోవడానికి వర్షపు నీరు పడని చోటు ఉండేది. వేల కోట్లతో మళ్లీ కొత్త భవంతి రిపేర్లు పూర్తయ్యేదాక ఎంపీలు పాత భవంతికి మారితే మంచిదనుకుంటా' అని వ్యంగ్య పోస్ట్ చేశారు. గాజు డోమ్‌ల మధ్య ప్రాంతాలను అతికించే జిగురు జారిపోవడంతో అక్కడి నుంచి మాత్రమే నీరు లీక్ అయిందని, వెంటనే సమస్యను పరిష్కరించామని లోక్‌సభ సెక్రటేరియట్ ఒక ప్రకటనలో స్పష్టంచేసింది.



పార్లమెంట్ లాబీలో వర్షపు నీరు కురుస్తున్న దృశ్యం

విస్తరణవాదం కాదు.. అభివృద్ధి కావాలి: మోదీ



న్యూఢిల్లీ: విస్తరణవాదం కాదు... అభివృద్ధి కావాలంటూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరోక్షంగా చైనాకు చురక అంటించారు. తమ మద్దతు ఎల్లప్పుడూ అభివృద్ధికేనని తేల్చిచెప్పారు. ప్రధాని మోదీ, వియత్నాం ప్రధానమంత్రి ఫామ్ మిన్‌చిన్ గురువారం ఢిల్లీలో సమావేశమయ్యారు. అంతర్జాతీయ, ప్రాంతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. భారత్-వియత్నాం మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం, పరస్పర సహకారంపై చర్చించారు. ఇరుదేశాల మధ్య సంబంధ బాంధవ్యాలను మరింత ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ఒక కార్యాచరణ ప్రణాళికను ఆమోదించారు. వియత్నాంలో భారత ప్రభుత్వ సహకారంతో నిర్మించిన ఆర్మీ సాఫ్ట్‌వేర్ పార్కును ఇరువురు ప్రధానమంత్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంధనం, సాంకేతికత, రక్షణ రంగంలో పరస్పర సహకారం తదితర అంశాల్లో ఆరు అవగాహనా ఒప్పందాలపై(ఎంఓయూ) సంతకాలు చేశారు. మరో మూడు ఒప్పందాలను ఖరారు చేశారు. మూడు రోజుల భారత పర్యటన నిమిత్తం ఫామ్ మిన్‌చిన్ మంగళవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్న సంగతి తెలిసిందే.

ఖేడ్కర్‌కు ఢిల్లీ కోర్టులో చుక్కెదురు



న్యూఢిల్లీ: అధికార దుర్వినియోగం, తప్పుడు ధృవీకరణ పత్రాలతో సివిల్స్ రాసిన మాజీ ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్‌కు గురువారం ఢిల్లీ న్యాయస్థానంలో చుక్కెదురైంది. చీటింగ్, తప్పుడు మార్గంలో ఓబీసీ, వైకల్య కోటా లబ్ధిపొందటం వంటి నేరాలకు పాల్పడ్డారంటూ ఖేడ్కర్‌పై ఢిల్లీ పోలీసులు ఇప్పటికే కేసు నమోదుచేయడం తెల్సిందే. ఈ కేసులో అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు ఢిల్లీ కోర్టులో ఖేడ్కర్ ముందస్తు బెయిల్ పిటిషన్ పెట్టుకున్నారు. అయితే ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు అదనపు సెషన్స్ జడ్జి దేవేందర్ కుమార్ నిరాకరిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో ఖేడ్కర్ తరఫు లాయర్ వాదనలను బుధవారం విన్న జడ్జి తీర్పును రిజర్వ్‌చేసి గురువారం వెల్లడించారు.

మిగిలిన సీట్లకు ప్రవేశ పరీక్ష పెట్టుకోవచ్చు: యూజీసీ

న్యూఢిల్లీ: క్యూట్(కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్) ఆధారంగా విద్యార్థులను జాయిన్ చేసుకున్న తర్వాత కూడా మిగిలే సీట్లపై వర్సిటీలకు యూజీసీ స్పష్టత ఇచ్చింది. అర్హత పరీక్షలో మార్కుల ప్రాతిపదికన లేదా సొంతంగా ప్రవేశ పరీక్ష నిర్వహించుకుని ఆయా సీట్లను భర్తీ చేసుకోవచ్చని పేర్కొంది. మిగిలిన సీట్లను విద్యాసంవత్సరమంతా ఖాళీగా ఉంచడమంటే వనరుల వృథాయే కాదు..సెంట్రల్ వర్సిటీల్లో చదువుకోవాలని ఆశపడే విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను నిరాకరించడం కూడా అవుతుందని వ్యాఖ్యానించింది. క్యూట్‌కు హాజరై, కొన్ని కోర్సుల కోసం సంబంధిత వర్సిటీలకు దరఖాస్తు చేసుకోని వారి పేర్లను పరిశీలించుకోవచ్చని తెలిపింది.

రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స

లోక్‌సభలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

న్యూఢిల్లీ: మోటార్ వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురై క్షతగాత్రులుగా మారినవారికి నగదు రహిత చికిత్స అందించే పథకాన్ని రూపొందించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖమంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. ఈ పథకాన్ని ఛత్తీస్‌గఢ్, అస్సాంలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి-జన ఆరోగ్య యోజన(ఏబీపీఎం-జేపీవై) కింద క్షతగాత్రులు ప్రమాదం జరిగిన తేదీ నుంచి వారం రోజులపాటు నిర్దేశిత ఆసుపత్రుల్లో గరిష్టంగా రూ.1.5 లక్షల విలువైన వైద్యం పొందవచ్చని చెప్పారు. నేషనల్ హెల్త్ అథారిటీ(ఎన్‌హెచ్‌ఏ) భాగస్వామ్యంతో ఈ పథకాన్ని రూపొందించినట్లు వెల్లడించారు. మోటార్ వాహనాల చట్టం-1988లోని సెక్షన్ 164బీ కింద ఏర్పాటైన మోటార్ వాహనాల ప్రమాద నిధి నుంచి ఈ పథకానికి అవసరమైన నిధులు సర్దుబాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

నైజీరియాలో బాంబు పేలుడు

16 మంది దుర్మరణం

అబూజా: నైజీరియాలోని బోర్నో రాష్ట్రంలో ఒక దుకాణసముదాయంలో అమర్చిన బాంబు పేలిన ఘటనలో 16 మంది చనిపోయారు. డజన్ల మంది గాయపడ్డారు. బుధవారం ఉదయం 8 గంటలకు కవోరీ ప్రాంతంలోని ఒక టీ దుకాణంలో ఈ పేలుడు సంభవించింది. దాడి చేసింది తామేనని ఇంతవరకు ఏ ఉగ్రసంస్థా ప్రకటించుకోలేదు. కానీ చాన్నాళ్లుగా పలు దాడులకు కారణమైన బోకో హరామ్ ఉగ్రసంస్థే ఈ దాడికి పాల్పడి ఉంటుందని స్థానిక అధికారులు అనుమానిస్తున్నారు. బోకో హరామ్, దాని చీలిక వర్గం ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్‌ల దాడులు, అంతర్యుద్ధం కారణంగా నైజీరియా, కామెరూన్, నైజర్, చాద్ దేశాల్లో గత 15 సంవత్సరాల్లో 35,000 మందికిపైగా ప్రజలు చనిపోయారు.

ఈ వ్యత్యాసాలు ఎందుకు?

ఈసీని డిమాండ్ చేసిన ఏడీఆర్

న్యూఢిల్లీ: ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య వ్యత్యాసం ఎందుకుందో చెప్పాలని భారత ఎన్నికల సంఘాన్ని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) గురువారం డిమాండ్ చేసింది. ఓట్లలో వ్యత్యాసానికి కారణాలను వివరించాలని కోరింది. సార్వత్రిక ఎన్నికల్లో ఏకంగా 538 నియోజకవర్గాల్లో పోలైన ఓట్లు, లెక్కించిన ఓట్లకు మధ్య తేడాలున్నాయని ఏడీఆర్ సోమవారం తమ నివేదికలో వెల్లడించిన విషయం తెలిసిందే. 362 నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల కంటే.. 5,54,598 ఓట్లను తక్కువగా లెక్కించారని తెలిపింది. మరో 176 నియోజకవర్గాల్లో పోలైన ఓట్లకంటే 35,093 ఓట్లను అదనంగా లెక్కించారని పేర్కొంది. ఏడీఆర్ సోమవారం నివేదిక వెలువరించినప్పటికీ ఈసీ ఇప్పటిదాకా ఓట్లలో వ్యత్యాసంపై స్పందించలేదు.

ఏపీలోనే అత్యధికం

పోలైన, లెక్కించిన ఓట్ల మధ్య వ్యత్యాసం మొత్తం దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా ఉంది. ఏపీలో 21 నియోజకవర్గాల్లో కలిపి మొత్తం పోలైన ఓట్ల కంటే 85,777 ఓట్లను తక్కువగా లెక్కించారు. అలాగే మరో నాలుగు నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల కంటే 3,722 ఓట్లను అధికంగా లెక్కించారు. ఇది అనుమానాలకు తావిస్తోంది. ఓట్లలో తేడా ఎలా వచ్చిందో చెప్పాలని.. ఏడీఆర్ గురువారం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధూలకు లేఖ రాసింది. సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ఓట్ల లెక్కింపులో వ్యత్యాసాలపై తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది. ఈ వ్యత్యాసాలపై ఈసీ తక్షణం వివరణ ఇవ్వాలని, ఎన్నికల ప్రక్రియలో ప్రజా విశ్వాసం సడలకుండా చూడాలని కోరింది.



భారతీయురాలా? బ్లాకా?

కమలపై ట్రంప్ వివక్షపూరిత వ్యాఖ్యలు

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ల అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ జాతివివక్ష వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఉపాధ్యక్షురాలు, డెమొక్రాట్ల అధ్యక్ష అభ్యర్థి కానున్న కమలా హారిస్ భారతీయురాలా? లేక నల్ల జాతీయురాలా? అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు ఆమె చాలాకాలంగా భారతీయ సంతతికి చెందిన అమెరికన్‌గా తెలుసని, ఇప్పుడు హఠాత్తుగా నల్లజాతీయురాలినని చెప్పుకొంటున్నారని ఎద్దేవా చేశారు. షికాగోలో బుధవారం జరిగిన నేషనల్ అసోసియేషన్ ఆఫ్ బ్లాక్ జర్నలిస్ట్స్ కన్వెన్షన్‌లో ట్రంప్ మాట్లాడారు. వేదికపై ట్రంప్‌ను ఇంటర్వ్యూ చేస్తున్న జర్నలిస్టులలో ఒకరు.. 'హారిస్ ఎప్పుడూ నల్లజాతీయురాలిగానే గుర్తింపును కోరుకున్నారు. నల్లజాతీయుల యూనివర్సిటీలోనే చదువుకున్నారు' అని చెప్పడానికి ప్రయత్నించగా ట్రంప్ అడ్డుపడ్డారు. ఆమె ఏదో ఒకదానికి కట్టుబడితే గౌరవిస్తానని, కానీ గతంలో భారతీయ వారసత్వం గురించి చెప్పుకున్న ఆమె అకస్మాత్తుగా నల్లజాతి వైపు మలుపు తిరిగారని, ఎవరైనా దానిని పరిశీలించాలని వ్యాఖ్యానించారు. న్యాయవాదిగా ఆమె బార్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించలేదని, పాస్ అవుతానని కూడా ఆమె అనుకోలేదని, ఆ తరువాత ఏమి జరిగిందో తనకు తెలియదని ఎద్దేవా చేశారు. అంతకుముందు రోజు ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సైతం ట్రంప్ అభ్యంతరకరంగా మాట్లాడారు. కమల అధ్యక్షురాలిగా ఎన్నికైతే ప్రపంచవ్యాప్తంగా నేతలు ఆమెను ఆట బొమ్మలా చూస్తారని, ఆమె చుట్టూరా తిరుగుతారని వ్యాఖ్యానించారు.

మళ్లీ అదే పాతపాట: కమల

వాషింగ్టన్: డొనాల్డ్ ట్రంప్ జాతి వివక్ష వ్యాఖ్యలకు ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ గట్టి కౌంటర్ ఇచ్చారు. ట్రంప్ మళ్లీ తన పాత విభజన సిద్ధాంతాన్నే ముందుకు తెస్తున్నారని, అగౌరవపరిచే ధోరణి కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. అలాంటి విభజనవాది కాకుండా, అమెరికాకు నిజాలు మాట్లాడే నాయకులు, వాస్తవాలను ఎదుర్కోవాల్సి వచ్చినప్పుడు.. శత్రుభావంతో, ఆగ్రహంతో ఊగిపోకుండా అర్థం చేసుకునే నాయకులు కావాలని ఆమె అభిప్రాయపడ్డారు. హూస్టన్‌లో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రజల్లో ఉన్న వైరుధ్యాలు విభజనకు తావివ్వకూడదని, అవే మన బలమని తెలిసిన నాయకుడు అమెరికాకు కావాలని చెప్పారు. అమెరికా ప్రజలను విభజించడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారని హారిస్ ఎన్నికల ప్రచార డైరెక్టర్ మైఖేల్ టేలర్ విమర్శించారు. మాజీ అధ్యక్షుడి వ్యాఖ్యలు అవమానకరమైనవిగా వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ జీన్ పెర్రీ పేర్కొన్నారు. వ్యక్తులను ఎలా గుర్తించాలో చెప్పే హక్కు ఎవరికీ లేదని, అది ఎవరికి వారు సొంతగా తీసుకునే నిర్ణయమన్నారు.



సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



క్రికెట్ విజేతలకు అభినందన

విజయవాడస్పోర్ట్స్: ఏసీఏ అండర్–16 బాలుర అంతర జిల్లాల క్రికెట్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టును కృష్ణాజిల్లా అసోసియేషన్ నాయకులు అభినందించారు.



పింఛన్ వెతలు

వృద్ధుల పింఛన్ వెతలు మళ్లీ ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఇంటికే వచ్చిన పింఛన్ల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది. యనమలకుదురు వద్ద నిరీక్షిస్తున్న వృద్ధులను చిత్రంలో చూడొచ్చు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వచ్చే ఇన్‌ఫ్లో పెరగటంతో గురువారం సాయంత్రం 7గంటలకు సాగర్ నీటిమట్టం 538.00 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడ, గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన భక్తులు గురువారం విరాళాన్ని అందజేశారు. మంగళగిరికి చెందిన రేచర్ల జయంత్ పృథ్వీరాజ్ కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,01,116 విరాళాన్ని అందజేసింది. అలాగే విజయవాడ రామకృష్ణాపురానికి చెందిన తంగిరాల వెంకటేశ్వరరావు, లక్ష్మీ పార్వతిలు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసి నిత్యాన్నదానానికి రూ. 1,01,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ పీఆర్వో డీవీవీ సత్యనారాయణ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలతో సత్కరించారు.

ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనుల పరిశీలన



మచిలీపట్నంటౌన్: కలెక్టర్ డీకే బాలాజీ గురువారం గిలకలదిండిలో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించి పనులను పరిశీలించారు. ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సంబంధించిన పనుల పరోగతి వివరాలను ఆయన సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రూ. 422 కోట్ల వ్యయంతో రూపుదిద్దుకుంటున్న ఫిషింగ్ హార్బర్ నిర్మాణంలో డ్రెడ్జింగ్, నార్త్, సౌత్ బ్రేక్ వాటర్ పనులు చురుకుగా సాగుతున్నాయని, మొత్తం మీద 50 శాతం మేర పనులు పూర్తయినట్లు ఆంధ్రప్రదేశ్ మారిటైం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మత్స్యశాఖ జిల్లా అధికారి ఏ. చంద్రశేఖర్, ఏపీ ఎంఐడీసీఎల్ ఈఈ మునిరెడ్డి, ఏఈ మహేష్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

ఉచితంగా బీఎస్ఎన్ఎల్ సిమ్ అప్‌గ్రేడేషన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి కృష్ణా జిల్లాలో బీఎస్ఎన్ఎల్ 2జీ, 3జీ సిమ్ వినియోగదారులకు ఉచితంగా 4జీ అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు బీఎస్ఎన్ఎల్ బిజినెస్ ఏరియా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ వై. రవీంద్రనాథ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్ఎన్ఎల్ దశలవారీగా 4జీ టెక్నాలజీ ప్రవేశపెట్టిందన్నారు. అయినప్పటికీ చాలా మంది వినియోగదారులు 2జీ, 3జీ సిమ్‌లను వినియోగిస్తున్నారన్నారు. 4జీ టెక్నాలజీ అప్‌గ్రేడ్ చేసిన తర్వాత ఆయా ప్రాంతాలలో 2జీ, 3జీ సిమ్ వినియోగిస్తున్నవారికి సేవలలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు తమ సిమ్ గురించి తెలుసుకునేందుకు 54040కు ఎస్ఐఎం అనే సందేశాన్ని పంపించాలన్నారు. అలాగే కస్టమర్ సర్వీస్ సెంటర్, ఫ్రాంచైజీ, రిటైలర్‌లు, ఏజెంట్‌ల ద్వారా ఉచిత 4జీ సిమ్‌ను పొందవచ్చని తెలిపారు.

త్రో బాల్ రాష్ట్ర జట్లు ఎంపిక



విజయవాడస్పోర్ట్స్: దక్షిణ భారత సీనియర్ స్త్రీ, పురుషుల త్రో బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు ఆంధ్రప్రదేశ్ త్రో బాల్ అసోసియేషన్ కార్యనిర్వహణ కార్యదర్శి ఈద సులోచన తెలిపారు. పురుషుల జట్టుకు రవివర్మ, నారాయణ, నరేంద్ర, అనిల్‌కుమార్, ఈశ్వర్, మల్లికార్జున, వెంకట్‌ఖాసీం, రత్నకుమార్, భగవాన్, గణేష్, నాగదేవేంద్ర, శ్రావణ్, గౌస్, ప్రమోద్‌కుమార్, నరసరెడ్డి, నరేంద్ర, మహిళల జట్టుకు సౌమ్య, గోపిక, నిఖితరెడ్డి, తులసి, శ్రావణి, పి.జోషిత, కె.జోషిత, దుర్గాభవాని, పల్లవి, సంధ్య, మౌనిక, దిశ, యమున, సంగీత, నవ్యశ్రీ, జయలక్ష్మీ ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 3, 4 తేదీల్లో బెంగుళూరులో జరిగే సౌత్ జోన్ పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయన్నారు. జట్టుకు ఎంపికైన క్రీడాకారులను ఎన్టీఆర్ జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్.ఏ.అజీజ్, త్రో బాల్ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణరాజు, గౌస్‌బాబు, కోశాధికారి శిరీష ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో గురువారం అభినందించారు.

మామను మించిన అల్లుడు!

- దుర్గగుడి పరిసరాలు పసుపుమయం చేసిన టీడీపీ నేత
- యూనియన్ల పేరిట ఫ్లెక్సీల ఏర్పాటు
- నిబంధనలకు తూట్లు పొడుస్తున్న వైనం
- పార్కింగ్ ఫీజు పేరుతో దారుణ దోపిడీ
- కుమ్మక్కైన వీఎంసీ అధికారులు!

జగన్మాత కనకదుర్గమ్మ కొలువుదీరిన ఇంద్రకీలాద్రిని అందరూ పరమ పవిత్రంగా భావిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి నిత్యం తరలివచ్చే వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని తరిస్తుంటారు. దుర్గమ్మను స్మరించుకుంటూ ఎంతో ఆనందంగా తిరిగి వెళుతుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యం ఉన్న ఆలయ పవిత్రతను దెబ్బతీసేలా కొందరు టీడీపీ నేతలు వ్యవహరించడంపై భక్తుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ పరిసరాల్లో రాజకీయాలు చొప్పించి పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటుతో పాటు యూనియన్లు నెలకొల్పడంపై భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పార్కింగ్ ఫీజు పేరుతో నిబంధనలకు విరుద్ధంగా నిలువునా దోచుకోవడంపై భక్తులు మండిపడుతున్నారు.

ఇంద్రకీలాద్రి/వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దుర్గగుడి వ్యవహారంలో కొందరు టీడీపీ నేతలు అనుసరిస్తున్న వైఖరిపై భక్తుల నుంచి ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. దుర్గగుడిపై పెత్తనం అంతా తనదేనని చెప్పుకునే ఓ మాజీ ఎమ్మెల్సీకి ఏ మాత్రం తీసిపోని విధంగా ఇప్పుడు అతని అల్లుడు వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో దుర్గగుడి వ్యవహారాలను తానే చూసుకుంటానని సాక్షాత్తూ బీజేపీ ఎమ్మెల్యేకి చెప్పిన ఈ మాజీ ఎమ్మెల్సీ అల్లుడు.. ఇప్పుడు యూనియన్ల పేరిట అమ్మవారి ఆలయంలో పట్టు సాధించాలని చూస్తున్నారు. దేవస్థాన నిధులతో నిర్మించిన గోడలు, ఆలయ పరిసరాలను మొత్తం పసుపుమయం చేస్తూ బోర్డులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించారు. ఆలయ పరిసరాల్లో అమ్మవారి నామస్మరణ, అమ్మవారి ఫొటోలు తప్ప మరే ఇతర వ్యక్తుల వ్యక్తిగత ప్రచారం చేయకూడదనే నిబంధనలు ఉన్నా వాటిని తుంగలోకి తొక్కారు. ఆయా దుకాణాలు, ఆటో డ్రైవర్లు, కార్లు, వ్యాన్ డ్రైవర్ల నుంచి ప్రతి నెలా మామూళ్ల వసూలుకు రంగం సిద్ధం చేసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి.

యూనియన్ల పేరిట భారీ ఫ్లెక్సీలు..

మాజీ ఎమ్మెల్సీ అల్లుడు దుర్గగుడి పరిసరాల్లో ఆటో యూనియన్లు ఏర్పాటు చేయిస్తున్నారు. డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఫ్యాన్సీ షాపుల కమిటీ, ఆటో, కార్ డ్రైవర్స్ యూనియన్లను నెలకొల్పి ఆయా యూనియన్లకు గౌరవాధ్యక్షుడిగా ప్రచారం చేయించుకుంటున్నారు.

కనకదుర్గనగర్‌ను మూసేశారు..

అమ్మవారి ఆలయానికి ప్రధాన మార్గమైన కనకదుర్గనగర్‌ను ఆటో యూనియన్ పేరిట పసుపుమయంగా చేయడమే కాకుండా ఆలయానికి వెళ్లే మార్గాన్ని మూసివేశారు. ఆలయం వద్ద ఇటువంటి బోర్డులు ఏర్పాటు చేయకూడదని తెలిసినా అధికార పార్టీ నాయకుడి అల్లుడు కావడంతో ఎవరూ అడ్డు చెప్పడం లేదు. దీనికి తోడు కనకదుర్గనగర్‌కు వెళ్లే మార్గాన్ని మూసివేస్తూ ఆటోలను ఇష్టానుసారంగా నిలిపివేస్తున్నారు. దీనికి ట్రాఫిక్ పోలీసులు సైతం సహకరిస్తుండటంతో భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొండ కింద నుంచి ఓం టర్నింగ్ వరకు భక్తులను చేరవేసేందుకు కార్లు, వ్యాన్‌లను నడిపిస్తున్నారు. యూనియన్ పేరిట భారీగా వసూలు చేసినట్లు డ్రైవర్లు చెప్పుకుంటున్నారు.



కనకదుర్గ నగర్లో ఆటో యూనియన్ పేరిట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పార్కింగ్ పేరుతో అడ్డగోలు వసూళ్లు..

పాతబస్తీలో పార్కింగ్ పేరుతో అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రజల నుంచి నిత్యం లక్షలాది రూపాయలు దోపిడీ చేస్తున్నారు. కేవలం అధికార కూటమి పార్టీలకు చెందిన వ్యక్తులు కావటమే వారి అర్హతగా ఈ దోపిడీ కొనసాగిస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీల ప్రోత్సాహంతో వీరి దోపిడీ మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతోందని ప్రజలు అంటున్నారు.

వీఎంసీ అధికారులను బెదిరించి..

పార్కింగ్ దోపిడీలో నగరపాలకసంస్థకు చెందిన అధికారులను సైతం కూటమి నేతలు బెదిరించినట్లు తెలిసింది. పాతబస్తీ వినాయకుని గుడి నుంచి బొడ్డుబొమ్మ వరకూ ఉన్న పార్కింగ్ నగర పాలక సంస్థ పరిధిలో ఉంది. దాని టెండర్ల కాలపరిమితి జూన్ 26వ తేదీన ముగియటంతో ఆ మరుసటి రోజు నుంచి కొద్ది రోజులు నగర పాలక సంస్థ అధికారులే నిర్వహించారు. దీనిపై కోర్టులో సైతం కేసు కొనసాగుతున్నా స్థానిక కూటమి నేతలు ఆ పార్కింగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీఎంసీ అధికారులను బెదిరించి పార్కింగ్ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇటీవల 'సాక్షి' దిన పత్రిలో 'పాతబస్తీలో పార్కింగ్ దందా' పేరుతో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు ఆ పార్కింగ్‌ను రెండుగా విభజించారు. బొడ్డుబొమ్మ నుంచి రోడ్డు డివైడర్ వరకూ పార్కింగ్ నిత్యం రద్దీగా ఉంటుంది. అక్కడే ఆదాయం వస్తుంది. దానిని మాత్రం కూటమి నాయకులకు వదిలేశారు. మిగిలిన దానికి టెండర్లు పిలిచారు. వదిలేసిన దాని నుంచి దుర్గగుడి పార్కింగ్ కాంట్రాక్టర్‌తో కూటమి నేతలు ఫీజును వసూలు చేయిస్తున్నారు. అయితే దీనికి ఎవరి నుంచి ఎటువంటి అనుమతులు లేవు. ఇటు నగర పాలక సంస్థకు గానీ, దుర్గ గుడి నుంచి గానీ అనుమతులు లేకుండా కేవలం కూటమి నేతల ప్రోద్బలంతో పార్కింగ్ రుసుం దండుకుంటున్నారు.

అక్రమంగా రెట్టింపు వసూళ్లు...

తమకు అనుమతి లేని ప్రాంతంలో వసూళ్లకు పాల్పడుతున్న దుర్గగుడి కాంట్రాక్టర్ రెట్టింపు మొత్తాన్ని వాహన యజమానుల నుంచి వసూళ్లు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం కారు రూ.30, ఇతర పెద్ద వాహనాలకు రూ.50 వసూలు చేయాలి. కానీ నాలుగు చక్రాలు కలిగిన ఏ వాహనమైన వంద రూపాయలు టోకెన్ కోస్తూ అక్రమ దందా కొనసాగిస్తున్నారు. అనుమతులు లేవు, ఆపై భారీ వసూళ్లు ఇదేమని ప్రశ్నిస్తే సిబ్బంది ఘర్షణకు దిగుతున్నారని భక్తులు వాపోతున్నారు.

అధికారులు కుమ్మక్కు..

కూటమి నేతలతో నగర పాలక సంస్థ ఎస్టేట్ విభాగానికి చెందిన ఒకరిద్దరు అధికారులు కుమ్మక్కు అయినట్లు స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. కూటమి నేతల అడుగులకు మడుగులు ఒత్తుతూ వారి అక్రమ దందాకు అండగా నిలుస్తున్నారని విమర్శిస్తున్నారు. నగర పాలక సంస్థకు రావాల్సిన ఆదాయాన్ని కూటమి నేతలు దండుకుపోతుంటే ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం అందించి ఆదాయానికి గండి కొడుతున్నారని ఆ శాఖకు చెందిన సిబ్బంది వ్యాఖ్యానిస్తున్నారు. సుదీర్ఘ కాలంగా పాతుకుపోయిన అధికారి ఒకరు కూటమి నేతలకు సలహాలిచ్చి దోపిడీకి అండగా నిలుస్తున్నట్లు వీఎంసీ సిబ్బంది చెబుతున్నారు.

అర్హులందరికీ పెన్షన్‌లు అందజేయటమే లక్ష్యం

రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



కోనేరుసెంటర్: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్‌లు అందజేయటమే లక్ష్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బందరు మండలం చిన్నాపురం గ్రామంలో గురువారం ఆయన పెన్షన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్నాపురం గ్రామంలో నూరు శాతం అంగవైకల్యం కలిగిన బోదాల సునీతకు రూ.15,000ను పెన్షన్‌గా అందజేశారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడి పూర్తి అంగవైకల్యం కలిగి మంచానికి పరిమితమైన కొండేటి నాంచారయ్యకు రూ.15,000ను అందజేశారు. కార్యక్రమంలో బందరు మాజీ పార్లమెంట్ సభ్యుడు కొనకళ్ల నారాయణరావు, మాజీ ఉపసభాపతి బూరగడ్డ వేదవ్యాస్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ లంకె నారాయణప్రసాద్, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కుంచే నాని, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

సారె సమర్పించిన 600 మంది భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు గురువారం 40 బృందాలకు చెందిన ఆరు వందల మంది భక్తులు సారెను సమర్పించారు. విజయవాడకు చెందిన జి. అప్పారావు బృందం, మంగళగిరికి చెందిన కనకమహాలక్ష్మి బృందం, గూడవల్లికి చెందిన రత్నకుమారి, విజయవాడ చిట్టినగర్‌కు చెందిన జక్కిలంక తనూజ ఘనాచారిని బృందానికి చెందిన భక్తులు అమ్మవారికి సారెను అందజేశారు.

సరిగమల స్వాగతం

ప్రస్తుత రాకెట్ యుగంలో ఎక్కువమంది యువత ఇంజినీరింగ్, సాఫ్ట్‌వేర్ రంగాలను ఎన్నుకుంటుంటే కొంతమంది మాత్రం వారి అభిరుచికి అనుగుణంగా సంగీత రంగంలో శిక్షణ తీసుకుంటూ భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్నారు. విజయవాడ నగరంలో ఆరున్నర దశాబ్దాలుగా సంగీత శిక్షణలో తరిస్తున్న ఘంటసాల సంగీత, నృత్య కళాశాలలో ఏటా వెయ్యికి పైగా విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారు.



వయొలిన్ నేర్చుకుంటున్న విద్యార్థినులు(ఫైల్)

ఘంటసాల సంగీత కళాశాలలో ప్రవేశాలకు వేళాయె

- ఏటా వెయ్యి మంది విద్యార్థులకు తర్ఫీదు
- ఆగస్టు 7 నుంచి నూతన బ్యాచ్‌కు తరగతులు ప్రారంభం



కూచిపూడి నృత్యం నేర్చుకుంటున్న విద్యార్థినిలు(ఫైల్)

విజయవాడ కల్చరల్: స్థానిక దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల గత 64 ఏళ్లగా తన ప్రాభవాన్ని కాపాడుకుంటూ వస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఇక్కడ చిత్తశుద్ధితో సంగీతం నేర్పుతున్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న విద్యార్థులు పలువురు ప్రస్తుతం ఉన్నత స్థితిలో ఉన్నారు.

మహనీయుల సేవలో..

ప్రముఖ సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీకృష్ణ ఈ కళాశాలకు తొలి ప్రిన్సిపాల్. తర్వాతి కాలంలో నేదునూరి కృష్ణమూర్తి, ద్వారం దుర్గాప్రసాద్, పెమ్మరాజు సూర్యారావు, వాసిరెడ్డి కనకదుర్గ, నల్లాన్ చక్రవర్తుల బుచ్చయ్యాచార్యులు లాంటి మహనీయులు ఈ సంగీత కళాశాల వైభవాన్ని చాటారు.

ప్రవేశం ఇలా..

సంగీత కళాశాలలో 2024–2025వ సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నారు. కార్యాలయం పనివేళల్లో నేరుగా కళాశాలకు వచ్చి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. 10 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వరకు ప్రవేశాలకు అర్హులు.

అధ్యాపకుల కొరత

ఇక్కడ పూర్తి స్థాయిలో అధ్యాపకులు లేరు. వీణ, వయొలిన్, థియరీ సబ్జెక్టులకు అధ్యాపకుల కొరత ఉంది.

సంగీత విద్వాంసులను ప్రోత్సహించాలి..



కళలను, సంగీత విద్వాంసులను ప్రోత్సహించి వారికి సమాజంలో సముచితమైన స్థానం కల్పించాలి. సంగీత సాధకులు సాధన, జ్ఞానం, అంకిత భావం, చిత్తశుద్ధి, లక్ష్యం అనే పంచ సూత్రాలను పాటించాలి. ఘంటసాల సంగీత కళాశాలలో చదువుకుని దేశ విదేశాలలో సంగీత ప్రాభవాన్ని చాటుతున్నవారు అనేక మంది ఉన్నారు. ఇదే కళాశాలలో వయొలిన్ అధ్యయనం కోసం చేరి 25 సంవత్సరాలుగా పని చేస్తున్నాను. సంగీత కళాశాల విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు బస్ పాస్ సౌకర్యం కల్పిస్తారు.

– విష్ణుభొట్ల కృష్ణవేణి, సంగీత కళాశాల ప్రిన్సిపాల్

లభించే కోర్సులు ఇవే..

గాత్రం, వీణ, వయొలిన్, తబల, కూచిపూడి, భరతనాట్యం అంశాలలో శిక్షణ లభిస్తుంది. కోర్సు కాల పరిమితి 6 సంవత్సరాలు కాగా దీనిలో డిప్లొమా 2 సంవత్సరాలు, సర్టిఫికెట్‌కు మరో నాలుగు సంవత్సరాలు ఉంటుంది. డిప్లొమాకు ఫీజు రూ. 2,100కాగా, సర్టిఫికెట్‌కు ఫీజు రూ. 1600 చెల్లించాల్సి ఉంటుంది. ఉదయం 7 నుంచి 9.30గంటల వరకు సాయంత్రం 4 నుంచి 6.30గంటల వరకు రెండు షిఫ్టుల్లో కళాశాలలో తరగతులు నిర్వహిస్తారు.

తెలుగు తమ్ముళ్ల రగడ

- ఇరు వర్గాల మధ్య బాహాబాహీ
- వెంట్రప్రగడలో పార్టీ ఆఫీసుకు తాళం
- అర్ధరాత్రి వరకూ హైడ్రామా



సాక్షి ప్రతినిధి, విజయవాడ: టీడీపీలో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. పామర్రు నియోజకవర్గం పెదపారుపూడి మండలం వెంట్రప్రగడలో బుధవారం రాత్రి తెలుగు తమ్ముళ్లు బాహాబాహీకి దిగారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. వెంట్రాప్రగడ గ్రామంలో టీడీపీ నాయకుడైన వెంకటసుబ్బయ్య కుమార్తె అమెరికాకు వెళ్తుండటంతో ఆయన భోజనాలు ఏర్పాటు చేసి, స్థానిక టీడీపీ నాయకులతో పాటు, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వర్లకుమార రాజాను పిలిచారు. దీంతో గ్రామానికి వచ్చిన ఆయన తొలుత అదే గ్రామానికి చెందిన వైజాగ్‌లో బిల్డర్‌గా ఉన్న చదలవాడ ఆంజనేయులు ఇంటికి వెళ్లారు. ఆ వ్యక్తి ఇంటికి ఎమ్మెల్యే వెళ్లటాన్ని జీర్ణించుకోలేని మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్ చౌదరి(చంటి)తోపాటు గ్రామస్తులంతా అలిగి వెళ్లిపోయారు. వెంట్రాప్రగడలో ఉన్న టీడీపీ కార్యాలయానికి తాళం వేసి, ఎమ్మెల్యేను అక్కడికి రానివ్వలేదు. ఎమ్మెల్యే పరువు పోతుందని, గ్రామంలో ఒకరు ఇంటికి వెళ్లి కూర్చొని, పార్టీ ఆఫీసు తాళాలు తీయాలని బతిమలాడారు. దీంతో కొద్దిసేపటికి తాళం తీయటంతో ఆయన పార్టీ ఆఫీసులో కొద్దిసేపు కూర్చున్నారు. అయితే ఎమ్మెల్యేను బిల్డర్ ఇంటికి ఎలమర్రు గ్రామానికి చెందిన టీడీపీ నేత సూరపునేని సత్యనారాయణే తీసుకెళ్లారని, నీటి సంఘం మాజీ ప్రెసిడెంట్ స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే సమక్షంలోనే సత్యనారాయణ, స్వామి బాహాబాహీకి దిగారు. అక్కడితో ఆగని సత్యనారాయణ ఎలమర్రు గ్రామం నుంచి 50 మందికి పైగా మనుషులను తీసుకొచ్చి గొడవకు దిగడంతో అర్ధరాత్రి వరకు రచ్చ సాగుతూనే ఉంది. దీంతో ఎమ్మెల్యే సైతం భోజనం కూడా చేయకుండానే అక్కడ నుంచి జారుకున్నారు. సత్యనారాయణ అనే వ్యక్తి ఎన్నికల్లో డబ్బు అంతా తానే ఖర్చుపెట్టానని, పెత్తనం తనదే అంటూ చేస్తున్న ప్రచారాన్ని మండలంలోని నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాక ముందే వర్గాలుగా విడిపోయి తమ్ముళ్లు కొట్టుకోవడంపై పలువురు పెదవి విరుస్తున్నారు.

సరసమైన ధరలకే నాణ్యమైన సరుకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో రైతు బజార్లు, పెద్ద సంస్థాగత రిటైల్ దుకాణాల్లో సరసమైన ధరల్లో నాణ్యమైన నిత్యావసర సరుకులు అందుబాటులో ఉన్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉషోదయ, మెట్రో, రిలయన్స్, డీమార్ట్ తదితర పెద్ద రిటైల్ దుకాణాల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరసమైన ధరలకు నాణ్యమైన సరుకులు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో కందిపప్పు (దేశవాళి) ధర రూ. 181 ఉండగా, ప్రత్యేక కౌంటర్లలో రూ. 150లకే అందిస్తున్నామన్నారు. అదే విధంగా కిలో బియ్యం (స్టీమ్డ్–బీపీటీ/సోనామసూరి) ధర మార్కెట్లో రూ. 55.85 కాగా ప్రత్యేక కౌంటర్లలో రూ. 48లకు, కిలో బియ్యం (పచ్చి–బీపీటీ/సోనా మసూరి) రూ. 52.40 ఉండగా.. ప్రత్యేక కౌంటర్లలో రూ. 47కే లభిస్తుందని వివరించారు. అన్ని కౌంటర్ల వద్ద సరుకుల నాణ్యతను టెక్నికల్ సిబ్బంది, తూకాన్ని లీగల్ మెట్రాలజీ సిబ్బంది తనిఖీ చేస్తున్నామన్నారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం

కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): తల్లి పాలే బిడ్డకు అమృతం వంటిదని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, బ్యానర్లను గురువారం కలెక్టర్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు మొదటి టీకా అని, బిడ్డ జన్మించిన గంటలోపే తల్లిపాలు తాగించాలని క్షేత్ర స్థాయి సిబ్బంది ఈ విషయంపై అవగాహన కల్పించాలన్నారు. జన్మించిన మొదటి గంటలో వీటి ద్వారా శిశువుకు ముఖ్యమైన పోషకాలు లభిస్తాయన్నారు. న్యుమోనియా, అతిసార వ్యాధుల వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుంచి రక్షణతో పాటు పిల్లల్లో మేధస్సును మెరుగుపర్చటంలో తోడ్పాటును అందిస్తుందన్నారు. తల్లిపాలు అధిక రక్తపోటు, మధుమేహం, స్థూలకాయం వచ్చే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయన్నారు. జేసీ గీతాంజలిశర్మ, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జి. గీతాబాయి, డీసీహెచ్ఎస్ శ్రావణ్‌కుమార్, జిల్లా ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ సతీష్‌కుమార్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎస్. సుందరాచారి పాల్గొన్నారు.

ముగిసిన కేంద్ర బృందం పర్యటన

గంపలగూడెం: మండలంలో జాతీయ జల్ జీవన్ మిషన్ సభ్యుల రెండు రోజుల పర్యటన గురువారం ముగిసింది. నాలుగు బృందాలుగా ఏర్పడి అధికారులు మండలంలోని నెమలి, గుళ్లపూడి, కొణిజర్ల, చెన్నవరం గ్రామాలను బుధవారం సందర్శించగా, వినగడప, కనుమూరు, అనుముల్లంక, నారికింపాడు గ్రామాల్లో గురువారం పర్యటించారు. నీటి నాణ్యత పరీక్షల్లో పీహెచ్ క్లోరిన్‌లను ఓహెచ్ఎస్ఆర్, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను, పలు నివాస గృహాల్లో నీటిని తనిఖీ చేశారు. జాతీయ జల్ జీవన్ మిషన్ సభ్యులు రాజేష్, భరత్, ముసలారెడ్డి, పాపారావు, శివానీ, జిల్లా ప్రతినిధులు రామశేషాచార్యులు, సుగుణారావు, శ్రీధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పఠాన్ వలీ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

బయోమెట్రిక్ తప్పనిసరి

ఈవో రామరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది, అర్చకులు తప్పనిసరిగా బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాలని ఈవో కెఎస్. రామరావు గురువారం ఆదేశాలు జారీచేశారు. ఆలయంలో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్ సిబ్బందితోపాటు ఆలయ అర్చకులు, వేద పండితులందరికి బయోమెట్రిక్ ద్వారా హాజరు తప్పనిసరి అని స్పష్టం చేశారు. దీంతో గురువారం నుంచే ఆలయంలోని బయోమెట్రిక్ మిషన్ల వద్ద ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది హాజరు నమోదు చేసుకునేందుకు బారులు తీరి కనిపించారు. అయితే కొన్ని బయోమెట్రిక్ మిషన్లు సరిగా పనిచేయకపోవడంతో ఉద్యోగులు ఈవిషయాన్ని ఆలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బయోమెట్రిక్ విధానంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను ఒకటి రెండురోజుల్లో పరిష్కరించడంతోపాటు ఆధార్‌నంబర్ అప్‌డేట్ అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఆలయ అధికారులు తెలిపారు.

కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం హెడ్‌వాటర్ వర్క్స్ సమీపంలో కృష్ణానదిలో గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు...కృష్ణానదిలో ఓ వ్యక్తి మృతదేహం నీటిలో తేలియాడుతుండడాన్ని గమనించిన స్థానికులు భవానిపురం పోలీసులకు సమాచారమందించారు. మృతుని వయస్సు 40 నుంచి 45ఏళ్ల మధ్య ఉంటుంది. ఒంటిపై బిస్కెట్ కలర్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్, బ్లాక్ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. నోరు, కళ్ల నుంచి ఎరుపు రంగు రసి కారుతూ ఉంది. ఉబ్బిపోయి నీటిలో తేలి ఉన్నాడు. మృతునికి సంబంధించిన ఆధారాలు ఏవీ లభించలేదు. మహిళా పోలీసు ఇచ్చిన పిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తి అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

రైల్వే వంతెన కింద...

కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణానది రైల్వే వంతెన కింద నాలుగో కానా సమీపంలో ఇసుకలో ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడని గురువారం ఉదయం 12 గంటలకు సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహం వద్ద స్విచ్ ఆఫ్ చేసి ఉన్న సెల్‌ఫోన్ ఉందని, ఊరు, పేరుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. తెలుపు రంగు షర్టు, బ్లూ జీన్స్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని, వయస్సు సుమారు 25ఏళ్లు ఉండవచ్చని చెప్పారు. రైలు నుంచి కిందపడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కనకదుర్గమ్మకు సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పించేందుకు తరలివచ్చిన భక్తులు



అమ్మవారికి సారె తెస్తున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న ఆషాఢ మాసోత్సవాలు ఆదివారంతో ముగియనున్నాయి. మరో మూడురోజుల్లో ఆషాఢమాసం ముగియనుండటంతో ఉభయ కృష్ణా, గుంటూరు జిల్లాలతోపాటు తెలంగాణ నుంచి పెద్దఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని సారెను సమర్పించే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గురువారం ఆలయానికి చేరుకున్న భక్తులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులు, మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తికి సారెను సమర్పించారు. సారె సమర్పించిన భక్తులను ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందచేసి, అమ్మవారి కుంకుమ ప్రసాదాన్ని అందజేశారు. అమ్మవారిని ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి దర్శించుకుని సారెను సమర్పించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.



మహామండపంలో అమ్మవారి ఉత్సవమూర్తి

ఈ రైళ్లు విజయవాడలో ఆగవు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వేస్టేషన్-న్యూ వెస్ట్‌బ్లాక్ హట్ మధ్య మూడో లైన్‌లోని ప్రీ-నాన్ ఇంటర్‌లాక్, ఇంటర్‌లాక్ పనుల కారణంగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను విజయవాడ రైల్వేస్టేషన్‌లోకి రాకుండా నియంత్రించి బైపాస్ మార్గం గుండా దారి మళ్లించి నడపనున్నట్లు విజయవాడ రైల్వే పీఆర్‌ఓ నుస్రత్ మండ్రుప్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

దారి మళ్లించిన రైళ్ల వివరాలు..

ఆగస్టు 3 నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్-విశాఖపట్నం(12728/12727), ఆగస్టు 2 నుంచి 10 వరకు ముంబై-భువనేశ్వర్ (11019) రైళ్లను దారి మళ్లించారు. ఆగస్టు 4న యశ్వంత్‌పూర్-టాటానగర్ (18112), ఆగస్టు 4, 6, 8 తేదీలలో సాయినగర్ షిర్డి-కాకినాడ పోర్టు (17205), ఆగస్టు 2 నుంచి 10 వరకు న్యూఢిల్లీ-విశాఖపట్నం (20806/20805), భువనేశ్వర్-ముంబై (11020), ఆగస్టు 3, 5, 7, 10 తేదీలలో కాకినాడ పోర్టు-సాయినగర్ షిర్డి (17206), ఆగస్టు 8న టాటానగర్-యశ్వంత్‌పూర్ (18111), ఆగస్టు 2 నుంచి 10 వరకు విశాఖపట్నం-ఎల్‌టీటీ ముంబై (18517), ఆగస్టు 6న మచిలీపట్నం-సాయినగర్ షిర్డి (17208), ఆగస్టు 3, 5, 6, 7, 8, 10 తేదీలలో నర్సాపూర్-నాగర్‌సోల్ (12787), ఆగస్టు 3 నుంచి 11 వరకు మచిలీపట్నం-బీదర్ (12749), ఆగస్టు 7న సాయినగర్ షిర్డి-మచిలీపట్నం (17207), ఆగస్టు 2, 4, 6, 7, 8, 9 తేదీలలో నాగర్‌సోల్-నర్సాపూర్ (12788), ఆగస్టు 2 నుంచి 10 వరకు బీదర్-మచిలీపట్నం (12750), ఆగస్టు 2 నుంచి 10 వరకు ఎల్‌టీటీ ముంబై-విశాఖపట్నం (18520) రైళ్లను దారి మళ్లించారు. ఈ రైళ్లు విజయవాడకు బదులుగా బైపాస్ మార్గంలో వయా రామవరప్పాడు స్టేషన్ మీదుగా దారి మళ్లించారు.

రాయనపాడులో హాల్టింగ్...

విజయవాడ రైల్వేస్టేషన్‌కు బదులుగా రాయనపాడు స్టేషన్‌లో హాల్టింగ్ అయ్యే రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. ఆగస్టు 2 నుంచి 10 వరకు సికింద్రాబాద్-విశాఖపట్నం (12740), ఆగస్టు 3 నుంచి 11 వరకు హైదరాబాద్-షాలీమార్ (18046), ఆగస్టు 2 నుంచి 10 వరకు విశాఖపట్నం-సికింద్రాబాద్ (12739), ఆగస్టు 4న గాంధీగమ్-విశాఖపట్నం (20804), ఆగస్టు 7న ఓఖా-పూరి (20820), ఆగస్టు 4, 7 తేదీలలో నిజాముద్దీన్-విశాఖపట్నం (12804), ఆగస్టు 2, 9 తేదీలలో సాయినగర్ షిర్డి-విశాఖపట్నం (18504), ఆగస్టు 2 నుంచి 10 వరకు షాలీమార్-హైదరాబాద్ (18045), ఆగస్టు 5, 9 తేదీలలో విశాఖపట్నం-నిజాముద్దీన్ (12803), ఆగస్టు 8న విశాఖపట్నం-సాయినగర్ షిర్డి (18503), విశాఖపట్నం-గాంధీగమ్ (20803), ఆగస్టు 5న పూరి-ఓఖా (20819) రైళ్లను విజయవాడ స్టేషన్‌కు బదులుగా బైపాస్ మార్గంలో రాయనపాడు స్టేషన్ మీదుగా దారి మళ్లించారు.

హత్యకేసులో నిందితుడికి జీవిత ఖైదు

తిరుపతిలీగల్: ఓ హత్య కేసులో అనంతపురం జిల్లా, గుంతకల్లు, మిల్లు ఏరియా, శ్రీలంక కాలనీకి చెందిన ఆర్ముగం మణిరత్నం అలియాస్ రాముకు జీవిత ఖైదు, వేయి రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జిల్లా జడ్జి అర్చన గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... ఎన్టీఆర్ జిల్లా విజయవాడ, గవర్నర్‌పేట, అలీ బేగ్ వీధికి చెందిన రేపాక లక్ష్మణరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అతను తన పూర్వీకుల ఆస్తులను అమ్మి ముగ్గురు కుమార్తెలకు వివాహాలు చేశాడు. అతను వివిధ ప్రాంతాలు చుడుతూ బిక్షాటన చేస్తూ జీవించేవాడు. అప్పుడప్పుడు తన ఇంటికి వచ్చి వెళ్లేవాడు. కొన్నేళ్ల క్రితం తిరుపతికి చేరుకున్నాడు స్థానిక శ్రీ పద్మావతి అతిథి గృహం సమీపంలోని బస్‌స్టాప్ వద్ద రాత్రిపూట నిద్రించేవాడు. నిందితుడు మణిరత్నం మద్యం, గంజాయి సేవిస్తూ చెడు అలవాట్లకు బానిసై ఇతర ప్రాంతాల లలోని దేవాలయాలు, మసీదులలో దొంగతనాలు చేసేవాడు. అలాగే మూడు హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. అతనికి మతుడు లక్ష్మణరావుకు బస్టాప్‌లో నిద్రించే సమయంలో పరిచయం ఏర్పడింది. 2022 నవంబర్ 15వ తేదీ ఉదయం లక్ష్మణరావును అగ్గిపెట్టి కావాలని నిందితుడు మణిరత్నం అడిగాడు. దీంతో అతను మణిరత్నమును దుర్భాషలాడాడు. మణిరత్నంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని లక్ష్మణరావు బెదిరించాడు. దీంతో మణిరత్నం భయపడి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. లక్ష్మణరావు అప్పుడప్పుడు తనను దుర్భాషలాడటం, తనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించడంపై కక్ష పెంచుకున్నాడు. దీంతో అదే రోజు రాత్రి బస్టాప్‌లో అరుగుపై లక్ష్మణరావు నిద్రిస్తుండగా నిందితుడు మణిరత్నం ఓ బండరాయి తీసుకుని అతని తలపై, ముఖంపై దాడి చేశాడు. తీవ్ర రక్త గాయాలతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. నిందితుడు మణిరత్నం అక్కడి నుంచి పరారయ్యాడు. తిరుపతి వార్డు నంబర్ 24 వీఆర్వో నక్క చలపతి ఫిర్యాదు మేరకు ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడు మణిరత్నంను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం అతనిపై రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితుడు మణిరత్నంకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ విజయలక్ష్మి వాదించారు.



తోటమూల-వినగడప నడుమ పొంగి పొర్లుతున్న కట్టెలేరు

పొంగి పొర్లుతున్న కట్టెలేరు

గంపలగూడెం: స్థానికంగా కురిసిన వర్షాలకు ఎగువ తెలంగాణ ప్రాంతంలో కురుస్తున్న భారీవర్షాలు తోడవ్వడంతో గంపలగూడెం మండలంలోని ప్రధాన నీటివనరైన కట్టెలేరు వరదనీటితో పొంగి పొర్లుతోంది. తోటమూల-వినగడప గ్రామాల నడుమ ధ్వంసమైన వంతెన వద్ద రాకపోకల కోసం నిర్మించిన మళ్లింపు రహదారిపై మూడు అడుగుల ఎత్తు మేర వరద నీరు పారుతోంది. దీంతో ఏటి అవతల గ్రామాలైన కనుమూరు, అనుముల్లంక, వినగడప, లంబాడీతండా, నారికింపాడు, కొత్తపల్లి గ్రామాలకు మండల కేంద్రమైన గంపలగూడెంతో రాకపోకలు నిలిచిపోయాయి. తెలంగాణ రాష్ట్రం ఎర్రుపాలెం మండలానికి చెందిన పలు గ్రామాల ప్రజలు ఇదే రోడ్డులో గంపలగూడేనికి వస్తుంటారు. కాగా మండలంలోని పలు గ్రామాల ప్రజలు విజయవాడ, మచిలీపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి. గడచిన నెలరోజుల్లో వంతెన వద్ద రాకపోకలు నిలిచిపోవడం ఇది మూడోసారి. దీంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ధ్వంసమైన వంతెన వద్ద ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా పోలీస్, రెవెన్యూ సిబ్బంది తగిన భద్రతా చర్యలు చేపట్టారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

మైలవరం: ఉరేసుకుని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి మైలవరం మండలం వెదురుబీడెం గ్రామంలో చోటుచేసుకుంది. మైలవరం పోలీసుల కథనం మేరకు.. వెదురుబీడెం గ్రామానికి చెందిన కందుల పల్లవి(18)కి వెల్వడం గ్రామానికి చెందిన వెల్లంకి నానితో ఎనిమిదినెలల కిందట వివాహం జరిగింది. వివాహం అనంతరం పిల్లలు కలగడం లేదని భార్యభర్తలు మధ్య గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో పల్లవి బుధవారం రాత్రి పుట్టిల్లు వెదురుబీడెంలో ఉరేసుకుని మృతి చెందింది. మృతురాలి తండ్రి కందుల ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విద్యుదాఘాతానికి గురై ఓ బాలుడు మృతిచెందిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత రాజరాజేశ్వరిపేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..పాత రాజ రాజేశ్వరిపేటకు చెందిన కట్టా సురేష్ బీరువాల కంపెనీలో పనిచేస్తుండగా, అతని భార్య ఓ షాపులో పనిచేస్తోంది. వీరికి ఇద్దరు కుమా రులు. రెండో కుమారుడైన అక్షయకుమార్ (14) అక్కడే ఓ ప్రైవేటు పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన అక్షయకుమార్ వంటగదిలో ఫ్రిజ్ పక్కన వెల్లికిలా పడి ఉండటాన్ని రాత్రి ఇంటికి వచ్చిన సురేష్ గమనించాడు. అతని పక్కనే స్టీల్ బకెట్, కరెంట్ హీటర్ ఉండటాన్ని గమనించా డు. తన కుమారుడు విద్యుదాఘాతానికి గురైనట్లు భావించి, వెంటనే బాలుడినే చికిత్సనిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయి తే అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యు లు తెలుపడంతో ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలుడి తండ్రి సురేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనదారుడి నుంచి సెల్‌ఫోన్లు అపహరణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మోపెడ్‌పై వెళ్తున్న యువతీయువకులను అడ్డగించి వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, నగదును దోచుకున్న ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు..జి.కొండూరు మండలం కందుల పాడుకు చెందిన ఓ యువతి సూర్యాపేటలోని ఓ హాస్పిటల్‌లో పనిచేస్తోంది. సదరు యువతి బుధవారం రాత్రి డ్యూటీ ముగించుకుని తనకు పరిచయం ఉన్న పచ్చల నరసింహ సాయితో కలిసి మోపెడ్‌పై ఇంటికి బయలుదేరింది. పాముల కాల్వ దాటిన తర్వాత ఆంజనేయస్వామి గుడివద్దకు వచ్చే సరికి బైక్‌పై వచ్చిన ముగ్గురు యువకులు మోపెడ్‌ను అడ్డగించారు. బంగారం, డబ్బులు, సెల్‌ఫోన్ ఇవ్వాలని బెదిరించారు. యువతి ఇవ్వకపోవడంతో సాయిపై దాడికి పాల్పడి అతని జేబులో ఉన్న రూ.500నగదు, వారిద్దరి వద్ద ఉన్న సెల్‌ఫోన్లు తీసుకుని పారిపోయారు. ఈ విషయం ఎవరికైనా చెబితే మీ ఫోటోలు మార్ఫింగ్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాక్టరీ క్వార్టర్స్‌లో చోరీ

బూదవాడ(జగ్గయ్యపేట): మండలంలోని బూదవాడ అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ ఉద్యోగుల క్వార్టర్స్‌లో గురువారం తెల్లవారుజామున అగంతకులు చోరీకి పాల్పడి బంగారం, వెండి వస్తువులు అపహరించారు. జగ్గయ్యపేట సీఐ జానకిరాం కథనం మేరకు ..ఫ్యాక్టరీ ఉద్యోగి, అర్చకుడు వేదాంతం లక్ష్మీనారాయణ తన కుటుంబంతో కలిసి అక్కడే క్వార్టర్స్‌లో ఉంటున్నారు. నాలుగు రోజుల కిందట కుటుంబసభ్యులతో కలిసి ఊరు వెళ్లిన లక్ష్మీనారాయణ గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూడగా, ఇంటితాళాలు పగలు కొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని 400 గ్రాముల బంగారం, కిలో వెండి వస్తువులు, రూ.10వేల నగదు చోరీ అయినట్లు గుర్తించారు. వెంటనే ఆయన ఈ చోరీ ఘటనపై చిల్లకల్లు పోలీసులకు సమాచారం అందించగా, సీఐ జానకీరాం సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి దర్యాప్తు ప్రారంభించారు. అగంతకులు ఇదే క్వార్టర్స్‌లో మరో రెండు ఇళ్ల తాళాలు కూడా పగులగొట్టడంతోపాటు ఇళ్లలోని సామగ్రి చెల్లాచెదురుగా పడేసి ఉండటాన్ని గుర్తించిన కాలనీవాసులు సమాచారాన్ని పోలీసులకు తెలియజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యాప్ పేరుతో లక్షల్లో బురిడీ

- డేటా మీట్ యాప్‌లో పెట్టుబడి పెట్టి భారీగా నష్టపోయిన బాధితులు
- ఉయ్యూరు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు

కంకిపాడు: రూ.300 పెట్టుబడి పెడితే రెండు రోజుల్లో రూ.400 వస్తాయి. రూ.35 వేలు పెట్టుబడి పెడితే రోజుకి రూ.2625 చొప్పున 20 రోజులు వస్తాయి. స్వల్ప పెట్టుబడితో అధికలాభం..ఆర్థికంగా బలోపేతం కావచ్చు..అని నమ్మిన జనం తమ కష్టార్జితం పోగొట్టుకుని గగ్గోలు పెడుతున్నారు. పెట్టుబడి పేరిట యాప్ నిర్వాహకులు జనానికి లక్షలాది రూపాయలు కుచ్చు టోపీ పెట్టారు. సొమ్ము పోగొట్టుకున్న బాధితులు న్యాయం కోసం ఎదురుచూస్తున్నారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.

అధిక లాభాలను ఆశజూపి...

కొందరికి డబ్బుపై ఉన్న ఆశను సైబర్ మోసగాళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఓ వైపు పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా మోసాలు కొనసాగుతున్నాయి. తాజాగా దాయ్ డేటా మీట్ యాప్‌లో పెట్టుబడి పెడితే వడ్డీతో సహా కేవలం రోజుల వ్యవధిలో అధికమొత్తం లాభం వస్తుందంటూ కంకిపాడు ప్రాంతంలో విస్తృతంగా ప్రచారం సాగింది. అప్పటికే ఈ యాప్‌ను వినియోగిస్తున్న కొందరు ఈ యాప్‌కు సంబంధించిన లింక్‌ను తమ పరిచయస్తులు, బంధుమిత్రులకు పంపి తద్వారా యాప్‌లో పెట్టుబడులు పెట్టించారు. పెట్టుబడి పెట్టిన వారికి వడ్డీ, వారిని యాప్‌లో చేర్పిన వాళ్లు తద్వారా కమిషన్ పొందారు. చైన్ లింక్‌గా కొనసాగిన ఈ పెట్టుబడి వ్యవహారం కేవలం రూ.300ల నుంచి ప్రారంభమై లక్షలకు చేరింది. వడ్డీతో సహా అసలు కూడా కేవలం రోజుల వ్యవధితో చేతికి వస్తుందని నమ్మిన కొందరు ఈ యాప్‌లో భారీగా పెట్టుబడులు పెట్టారు. చేతిలో సొమ్ము లేనిపక్షంలో తమ వద్ద ఉన్న బంగారు ఆభరణాలను సైతం కుదువ పెట్టి యాప్‌లో పెట్టుబడులు పెట్టారు. ఈ లావాదేవీలు, అదనపు ప్రయోజనాలు తెలుసుకునేందుకు సుమారు 400మందికి పైగా సభ్యులతో వాట్సాప్ గ్రూప్ కూడా నడిపిస్తున్నారు.

నిలిచిన యాప్...బాధితుల గగ్గోలు ..

స్వల్ప పెట్టుబడితో డబ్బులు వస్తుండటంతో ఆశపడ్డ అనేక మంది ఈ యాప్‌లో పెట్టుబడి పెట్టారు. అయితే ఈ యాప్‌లో సేవలు, లావాదేవీలు గతనెల 22వ తేదీ నుంచి నిలిచిపోయాయి. అదే విషయాన్ని సొమ్ము కట్టిన వ్యక్తులు యాప్ పనిచేయకపోవడంపై వాట్సాప్‌లో సంప్రదింపులు జరుపగా.., వరుసగా బ్యాంకులకు సెలవులు వస్తే లావాదేవీలు జాప్యం అవుతాయి?, ఆందోళన వద్దు? అంటూ యాప్ నిర్వాహకులు వీరిని నమ్మబలికారు. తీరా రోజులు గడుస్తున్నా సొమ్ము అందకపోయే సరికి మోసపోయామని బాధితులు గుర్తించారు. యాప్‌ను వినియోగిస్తున్న 400మందిలో అనేక మంది అదనపు లబ్ధి చేకూరుతుందని ఆశ పడి లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయారు. మోసపోయిన లబ్ధిదారుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుందని, మోసపోయిన సొమ్ము లక్షల్లో ఉంటుందని అంచనా. యాప్ పేరిట జరిగిన మోసాన్ని గ్రహించి బాధితులు గగ్గోలు పెడుతున్నారు. బాధితుల్లో సాధారణ ప్రజలు, పలుశాఖల్లో పనిచేస్తున్న దిగువ స్థాయి సిబ్బంది ఉండటం గమనార్హం.



దాయ్ డేటా మీట్ యాప్‌లో లావాదేవీలు

ఉయ్యూరులో కేసు నమోదు..

డేటా మీట్ యాప్‌లో జరిగిన మోసంపై ఉయ్యూరు పట్టణ పోలీసుస్టేషన్‌లో రెండు రోజుల కిందట కేసు నమోదైంది. పట్టణానికి చెందిన ఓ బాధిత మహిళ ఈ యాప్ పేరుతో చేసిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐసీడీఎస్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు యాప్ ప్రమోషన్‌లో కీలకంగా ఉన్నారంటూ ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతమ్మ ఆలయ ఆదాయం రూ.16.12కోట్లు

పెనుగంచిప్రోలు: రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాల్లో ఒకటైన ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపమ్మవారి ఆలయ వార్షిక ఆదాయం రూ.16.12 కోట్లకు చేరింది. 2020లో కోవిడ్ కారణంగా అమ్మవారి ఆలయ ఆదాయం గణనీయంగా తగ్గింది. కోవిడ్‌కు ముందు రూ.8కోట్లు నుంచి రూ.9 కోట్లుగా ఉన్న ఆలయ ఆదాయం, కోవిడ్ సమయంలో రూ.4 కోట్లకు పడిపోయింది. 2021-22లో ఆలయానికి రూ.10.18కోట్ల ఆదాయం రాగా, 2022-23లో రూ.14.18కోట్లు వచ్చింది.2023-24కు సంబంధించి ఆలయానికి రూ.16,11,97,787 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

అభివృద్ధితోపాటు పెరిగిన ఆదాయం...

పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయం దినదినాభివృద్ధి చెందుతున్నట్లుగానే ఆలయ ఆదాయం కూడా పెరుగుతోంది. ప్రస్తుతం ఆలయానికి సంబంధించి సుమారుగా రూ.13కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రతి శుక్ర, ఆదివారాల్లో సుమారు 20 నుంచి 40వేల మంది భక్తులు వస్తుండగా, మిగిలిన రోజుల్లో 2నుంచి 5వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఆంధ్రా నుంచేగాక తెలంగాణ నుంచి కూడా భక్తులు భారీగా తరలివస్తుంటారు. ఏడాదిలో సుమారు కోటి మందికిపైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుంటుండటంతో ఆలయం అభివృద్ధి చెందుతుండటంతోపాటు ఆదాయం కూడా ఏటా పెరుగుతోంది.



పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయం

ఆలయ అభివృద్ధిపై దృష్టి..



అమ్మవారి ఆలయ అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ఆలయ అభివృద్ధికి దాతలు కూడా ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం రూ.13కోట్లతో చేపట్టిన ఆలయ అభివృద్ధి పనులు శరవేగంగా సాగు తున్నాయి. ఆలయం దినదినాభివృద్ధి చెందుతుండటంతో ఆదాయం కూడా పెరుగుతోంది.

జంగాల శ్రీనివాసరావు, ఆలయ చైర్మన్

తల్లిపాలు బిడ్డకు సంజీవని

డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): తల్లిపాలు బిడ్డలకు సంజీవినితో సమానమని, ప్రతి తల్లి కనీసం 9నెలలపాటు బిడ్డలకు పాలివ్వాలని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రి పీడియాట్రిక్ విభాగం, జిల్లా ఇమ్యునైజేషన్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పాత ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకతపై బాలింతలకు అవగాహన కలిగించడంతోపాటు, గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈసందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ ప్రసవమైన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టిస్తే శిశువుకు నిమోనియా, అతిసార వ్యాధులు రాకుండా కాపాడవచ్చన్నారు. బిడ్డలకు పాలిచ్చే తల్లులకు రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాలను అన్ని గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. ప్రతి గ్రామంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, సూపర్ వైజర్లు, ఆశలు, అంగన్‌వాడీలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి తల్లిపాలతో బిడ్డకు కలిగే మేలుపై ప్రజలకు అవగాహన కల్పిస్తారని వివరించారు. ప్రభుత్వాస్పత్రి పిడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ పరుచూరి అనీల్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సునీత మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. బిడ్డకు ఆరునెలల వయస్సు వచ్చే వరకూ కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ యు.శోభ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని, వేదికపై డాక్టర్ అనీల్‌కుమార్

తల్లీకొడుకు ఆత్మహత్యాయత్నం

- దివ్యాంగుడైన బాలుడి మృతి
- తల్లిపై హత్యకేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిన్నతనంలోనే వివాహం..అనారోగ్యంతో భర్త మృతి..జీవనోపాధి కోసం చేస్తున్న వ్యాపారంలో నష్టాలు...జీవితంపై విరక్తితో ఆత్మహత్య యత్నానికి ఒడిగట్టింది ఆమె... తాను మృతిచెందితే తనకు తోడుగా ఉంటాడని పెంచుకుంటున్న దివ్యాంగుడైన బాలుడు అనాథ అవుతాడని భావించి, అతనికి కూడా విషంతో కూడిన కూల్‌డ్రింక్ ఇచ్చింది. ఈ ఘటనలో ఆ దివ్యాంగుడైన బాలుడు మృతి చెందగా, తల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. హృదయవిదారకమైన ఈ ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఎల్‌రావునగర్ కుండల మార్కెట్ ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిట్టినగర్ పరిధిలోని కేఎల్‌రావునగర్ కుండల మార్కెట్ వద్ద కుదమల పద్మ(32) నివాసం ఉంటోంది. భర్త శ్రీనివాస్ కొంతకాలం మృతి చెందాడు. దీంతో జీవనాధారం కోసం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడపుతోంది. నా అనేవాళ్లులేని పుట్టుకతో మూగ, మానసిక వికలాంగుడైన చైతన్య(10)ను దత్తత తీసుకుంది. వ్యాపారంలో నష్టాలు రావడంతో నెల రోజుల కిందట దుకాణం మూసివేసింది. దీంతో మానసికంగా కుంగిపోయిన ఆమె మరణమే శరణ్యమనుకుంది. జూలై 30వ తేదీ మంగళవారం రాత్రి అందరూ నిద్రపోయిన తర్వాత మార్కెట్ నుంచి తెచ్చుకున్న విషగుళికలను కూల్‌డ్రింక్‌లో కలిపింది. తాను ఆత్మహత్య చేసుకుని చనిపోతే దివ్యాంగుడైన తనబిడ్డ ఎలా బతుకుతాడనే ఆలోచనతో, తాను తాగేందుకు సిద్ధం చేసుకున్న విషగుళికలు కలిపిన కూల్‌డ్రింక్‌ను ముందుగా చైతన్యకు తాగించి, ఆ తర్వాత తాను కూడా తాగింది. కొంత సమయం తర్వాత చైతన్య అపస్మారకస్థితిలోకి చేరుకుని వాంతులు చేసుకోవడంతో కంగారు పడిన పద్మ వెంటనే బాలుడిని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లింది. ఆసుపత్రికి చేరిన తర్వాత పద్మ పరిస్థితి కూడా విషమించింది. వైద్యులు అందుబాటులో ఉండటంతో సకాలంలో చికిత్స అందించారు. చికిత్స పొందుతున్న దివ్యాంగబాలుడు చైతన్య గురువారం సాయంత్రం మృతిచెందాడు. పద్మ పరిస్థితి విషమంగానే ఉండటంతో ఆమె వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న కొత్తపేట పోలీసులు ఆసుపత్రికి చేరుకుని పద్మ నుంచి వివరాలు సేకరించారు. ఆమెపై హత్య కేసు నమోదు చేశారు.



మృతి చెందిన చైతన్య

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): పటమట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మరమ్మతులు నేపథ్యంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈఈ పి.హరిబాబు గురువారం తెలిపారు. న్యూ ఆర్టీసీ కాలనీ, ఎక్త్రిసిటీ కాలనీలో ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు, మెగాటౌన్ షిప్, యనమలకుదురు లాకు రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ సమాచారాన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

దేవదాయ శాఖ మంత్రిని కలిసిన మైలవరం జమీందారు సుధాకరరావు



మైలవరం: రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని విజయవాడలోని ఆయన కార్యాలయంలో ద్వారకా తిరుమల దేవస్థానాల చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త, మైలవరం జమీందారు ఎస్వీ సుధాకరరావు కుటుంబ సభ్యులు ఎస్వీఎన్ నివృతరావు, ఎస్. పృథ్వీ నరసింహారావు గురువారం కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధి, దేవాలయాల ఆస్తుల పరిరక్షణపై మంత్రితో చర్చించామని చైర్మన్ కార్యాలయం తెలిపింది.

దక్షిణామూర్తికి విశేష అభిషేకాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో దక్షిణామూర్తికి గురువారం విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు మల్లేశ్వరశాస్త్రి, కోట ప్రసాద్‌లు నిర్వహించగా, ఆలయ ఈఈ కె.ఎస్.రామరావు దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం భక్తులను స్వామి వారి దర్శనానికి అనుమతించారు.

రామవరప్పాడు నుంచి రైల్వే స్టేషన్‌కు ఆర్టీసీ బస్సులు

బస్టాండ్(విజయవాడపశ్చిమ): నగరంలోని రామవరప్పాడు, రాయనపాడు రైల్వేస్టేషన్ నుంచి విజయవాడ రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్ వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.ఏసుదానం గురువారం ఒక ప్రకటలో తెలిపారు. రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనుల్లో భాగంగా ఈ నెల రెండు నుంచి 11వ తేదీ వరకు విజయవాడ మీదుగా నడిచే పలు ప్రధాన రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రాయనపాడు, రామవరప్పాడు స్టేషన్‌ల మీదుగా దారి మళ్లించడంతో ఆయా రైల్వేస్టేషన్లలో దిగే ప్రయాణికుల సౌకర్యార్థం ఈ ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ బస్సులను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు.

బాధ్యతలు చేపట్టిన సెంట్రల్ ఏసీపీ దామోదర్



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ సెంట్రల్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా నియమితులైన కె.దామోదర్ గురువారం లబ్బీపేటలోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో పటమట, పెనమలూరు పోలీ స్టేషన్లలో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా పని చేసిన ఆయన బదిలీపై సెంట్రల్ ఏసీపీగా వచ్చారు.

ఘనంగా పీవీపీ మాల్ పదో వార్షికోత్సవం



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజల ఆదరాభిమానాలతో పీవీపీ మాల్‌కు ఒక ప్రత్యేకత ఏర్పడిందని మాల్ అధినేత పొట్లూరి వరప్రసాద్ అన్నారు. ఎంజీరోడ్డులోని పీవీపీ మాల్ పదో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్లూరి వరప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ అన్ని వర్గాల వారు పీవీపీ మాల్‌పై ఆదరణ చూపుతున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. పుట్టిన ఊరిలో ఏర్పాటు చేసిన మాల్‌కు గుర్తింపు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, రవి బోయపాటి, జాస్తి మూర్తి, మాల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో దోమల నియంత్రణ



కాలువ గట్లను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): దోమల వల్ల కలిగే వ్యాధులను నివారించడానికి, మరుగు కాలువల్లో దోమల లార్వను నియంత్రించేందుకు ఆధునిక పద్ధతులను అనుసరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. ఆయన రామకృష్ణాపురంలోని బుడమేరు కాలువను గురువారం ఉదయం పరిశీలించారు. వ్యర్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు ట్రక్సర్ మెషిన్ ద్వారా శుభ్రపరచాలని ఆదేశించారు. వ్యర్థాలు పేరుకుపోయినచోట దోమల లార్వా అధికంగా ఉంటుందని, మనుషులు వెళ్లలేని ప్రదేశాల్లో డ్రోన్ల సాయంతో ఎంఎల్ ఆయిల్ పిచికారీ చేసి దోమలను నిర్మూలించాలని సూచించారు. కాలువ గట్లపై వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచి, గ్రీనరీని అభివృద్ధి చేయాలని, కెనల్ చుట్టు పక్కల గ్రీనరీ పెంచడం ద్వారా కాలుష్యాన్ని నివారించడమే కాకుండా వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్‌ను తగ్గించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించాలని పేర్కొన్నారు. నగరంలోని బందర్, ఏలూరు, రైవస్ కాలవల్లో ట్రక్సర్ వాహనాన్ని వినియోగిస్తూ పేరుకుపోయిన వ్యర్థాలను నిరంతరం తొలగించి, దోమల వ్యాప్తిని అరికట్టాలని ఆదేశించారు.

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం తగదు

పటమట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పూర్తిస్థాయిలో పంపిణీ చేయాలని, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. 30వ డివిజన్, రామకృష్ణాపురం మధ్య కట్ట వద్ద లబ్ధిదారులకు బయోమెట్రిక్ ద్వారా ఆయన గురువారం పింఛన్లు అదజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుతో కమిషనర్ మాట్లాడారు. ప్రతి నెలా పింఛన్ వస్తుందా? ఇంటి వద్దనే ఇస్తున్నారా? లేదా? ఎంత ఇస్తున్నారు? అని అడిగి తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటించి సెక్రటరీలు పింఛన్లు పంపిణీ చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన 29వ డివిజన్ మధురానగర్ అండర్ బ్రిడ్జ్, బీఆర్టీఎస్ రోడ్డు దగ్గర ఉన్న జీఎస్ శాస్త్రి పార్క్‌ను పరిశీలించారు. పార్క్‌లో ఎల్లప్పుడూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉండాలని, పారిశుద్ధ్యం నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా ఉండాలని, పార్క్ ఆవరణలో వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయాలని సబంధిత అధికారులకు సూచించారు. మధురానగర్‌లో చివరి దశలో ఉన్న రోడ్ – బ్రిడ్జి, సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసి త్వరలో ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. బుడమేరు కాలువలోని గుర్రపు డెక్కలను తీసి కాలువను పరిశుభ్రపరచాలని పేర్కొన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు



సమావేశానికి వర్చువల్‌గా హాజరైన కలెక్టర్ సృజన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్థానిక ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల 15వ తేదీన రాష్ట్రస్థాయిలో జరిగే 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ఆయన సంబంధిత శాఖల అధికారులతో గురువారం సమీక్షించారు. ఈ సమావేశానికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ డాక్టర్ నిధి మీనా, విజయవాడ మునిసిపల్ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డీఓ బి.హెచ్.భవానీశంకర్ తదితరులు వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ వేడుకల నిర్వహణకు సంబంధించి ఆయా శాఖల పరంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మార్గనిర్దేశం చేశారు. అదేరోజు సాయంత్రం రాజ్ భవన్‌లో జరగనున్న ఎట్ హోం కార్యక్రమానికి కూడా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత వైభవంగా భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సృజన తెలిపారు. వివిధ శాఖలను సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు.

ఆరోగ్య శ్రీని ఎత్తేసేందుకు కుట్ర

- వైద్య రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు
- వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో వైద్య రంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మెహబూబ్ షేక్ విమర్శించారు. పేదలకు సంజీవని వంటి ఆరోగ్య శ్రీ పథకాన్ని సైతం ఎత్తేసేందుకు కుట్ర జరుగుతోందని, అందుకు ఇటీవల కేంద్ర సహాయ మంత్రి వ్యాఖ్యలే నిదర్శనమని పేర్కొన్నారు. విజయవాడ నగరంలోని తన కార్యాలయంలో మెహబూబ్ షేక్ గురువారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై 50 రోజులు గడిచినా, ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు బిల్లుల చెల్లింపు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ నెల 15 నుంచి సేవలు నిలిపివేస్తామని స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రకటించినట్లు తెలిపారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టీడీపీ ప్రభుత్వంలో పెండింగ్ ఆరోగ్య శ్రీ బిల్లులు అన్నీ రిలీజ్ చేసిన అంశాన్ని గుర్తుచేశారు. పేదల ఆరోగ్యం విషయంలో వివక్ష తగదని తక్షణమే నెట్‌వర్క్ ఆస్పత్రులకు పెండింగ్ బిల్లులు చెల్లించి, ఈ పథకం కొనసాగించాలని డిమాండ్ చేశారు. మరో వైపు రాష్ట్రంలో కొత్తగా నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలల విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. దీంతో ఈ ఏడాది మరో ఐదు కళాశాలల్లో అడ్మిషన్లు జరగాల్సి ఉన్నా, ఎన్‌ఎంసీ నుంచి అనుమతులు రాలేదని పేర్కొన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారశైలి కారణమన్నారు. వెంటనే లోపాలను సరిచేసి అడ్మిషన్లు జరిగేలా చూడాలని కోరారు. ప్రభుత్వాస్పత్రుల్లో సైతం నాణ్యమైన వైద్య సేవలు అందేలా, మందుల కొరత లేకుండా చూడాలని పేర్కొన్నారు.

రహదారి భద్రత నియమాలు పాటించండి





మాట్లాడుతున్న ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి : అవగాహన సదస్సులో పాల్గొన్న ఆటో డ్రైవర్లు

ట్రాఫిక్ డీసీపీ చక్రవర్తి

విజయవాడస్పోర్ట్స్: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించాలని ట్రాఫిక్ డీసీపీ కె. చక్రవర్తి సూచించారు. కమాండ్ కంట్రోల్ రూంలో నగరంలోని ఆటో డ్రైవర్లకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ చక్రవర్తి మాట్లాడుతూ నగరంలోని ట్రాఫిక్ రద్దీ, భద్రతలను దృష్టిలో ఉంచుకుని ఆటోలు నడపాలని సూచించారు. ఎప్పటికప్పుడు వాహన ఫిట్నెస్ చూసుకోవాలని, ఆటోలను నిర్దేశించిన ప్రదేశాల్లోనే పార్క్ చేయాలని పేర్కొన్నారు. ఫిట్నెస్ సరిగా లేకున్నా, ఎక్కడబడితే అక్కడ ఆటోలను పార్క్ చేసి ఇతర వాహనదారులకు, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం, ఇతర మత్తు పదార్థాలు సేవించకుండా వాహనాలు నడపాలని ఆదేశించారు.

డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి



అవగాహన ర్యాలీలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి శ్రీరామ శివ సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన విద్యార్థులకు అవగాహన సదస్సు, ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, వాటి బారిన పడకుండా ఎలా ఉండాలో విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే డ్రగ్స్ గురించి తెలుసుకోవడంతో పాటు వాటికి దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వల్ల విలువైన జీవితం నాశనం అవుతుందని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాలపైన అవగాహన కార్యక్రమాల్ని కొనసాగించడం అభినందించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో స్పెషల్ బ్యూరో విజయవాడ వెస్ట్ సీఐ శ్రీనివాస రెడ్డి, ఎస్ఐ అల్లూరయ్య, కళాశాల పీడీ డి.యుగంధర్, అధ్యాపకులు నవీన, రాధిక, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఆఖరి మజిలీకీ తప్పని అవస్థలు



చెత్తలోనే కడసారి ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు బల్లెంవారి వీధిలోని ఎస్సీ శ్మశాన వాటికలో బుధవారం చోటు చేసుకున్న ఘటన అత్యంత దయనీయ పరిస్థితికి సజీవ సాక్ష్యంగా నిలిచింది. ఈ శ్మశానంలోకి వెళ్లేందుకు కూడా వీలు లేకుండా పంచాయతీ చెత్తను డంప్ చేస్తుండటంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు వచ్చిన క్రైస్తవులు నరకయాతన అనుభవించారు. ఒక పక్క కుప్పలుగా పేరుకుపోయిన చెత్త, మరో పక్క కుళ్లిన వ్యర్థాలతో వెదజల్లుతున్న తీవ్ర దుర్గంధం మధ్య ముక్కుమూసుకుని మృతదేహాన్ని మట్టి చేయాల్సిన దీన పరిస్థితి నెలకుంది. కనీసం కడసారి ప్రార్థనలు నిర్వహించుకునేందుకు కూడా అవకాశం లేకపోవడంతో అంత్యక్రియలకు వచ్చిన వారు ఆ చెత్త, బురదలోనే పరదాలు పరుచుకుని, ముక్కు మూసుకుని ప్రార్థనలు చేశారు. చేసేదీ లేక పాస్టర్ కూడా అక్కడే ప్రార్థనలు నిర్వహించి చనిపోయిన వ్యక్తిని సమాధి చేయించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ అటకెక్కడం ఈ ఎస్సీ శ్మశానవాటికకు శాపంలా మారింది. ఇటు రామవరప్పాడు అటు ప్రసాదంపాడు గ్రామాలకు ఉన్న ఒకే ఒక్క ఎస్సీ శ్మశానానికి ఈ గతి పట్టించారని రెండు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తల్లి ముర్రు పాలే బిడ్డకు మొదటి టీకా

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి



వైఎస్సార్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



44వ డివిజన్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రసంగిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లి పాల వారోత్సవాల కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సెక్టార్ -1 సూపర్‌వైజర్ జి.ప్రశాంతి ముఖ్యఅతిథిగా పాల్గొని గర్భిణులు, బాలింతలను ఉద్దేశించి మాట్లాడారు. బిడ్డ పుట్టిన గంటలో తల్లి పాలు తాగించాలని, తల్లి ముర్రు పాలు బిడ్డకు మొదటి టీకా వంటివని సూచించారు. ముర్రుపాలు బిడ్డను అనేక రోగాల నుంచి సురక్షితంగా ఉంచుతాయని తెలిపారు. నవజాత శిశువు మొదటి ఆహారమైన తల్లి పాలలో ఉన్న పోషక గుణాలు మరి ఏ ఇతర పాలల్లో ఉండవని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బి.లక్ష్మి, కె.బాజీ, కె.లక్ష్మి, ఎ.నాగమణి, ఆశా వర్కర్ కోటేశ్వరి పాల్గొన్నారు.

జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో..

విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు మొదలయ్యాయి. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దివ్య సాగరిక మాట్లాడుతూ.. బిడ్డ సంపూర్ణ మానసిక వికాసం పుట్టిన మొదటి ఆరు నెలలు కేవలం తల్లి పాలతోనే సాధ్యమని పేర్కొన్నారు. తల్లి పాలు బిడ్డ శరీరానికే కాకుండా తల్లి మెదడుకు కూడా పోషణ ఇస్తుందని తెలిపారు. తల్లి పాలకు ఎటువంటి ప్రత్యామ్నాయం లేదని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం దుర్గాభవానీ, సుధాకర్, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం కాలనీలోని ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులకు హెచ్‌బీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు యూసఫ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు నీటి సరఫరాకు అంతరాయం

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల మూడో తేదీ సాయంత్రం నుంచి నాలుగో తేదీ ఉదయం వరకు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగర పాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైజర్‌పేట ఎర్రకట్ట రోడ్డులోని రిజర్వాయర్ వద్ద ఉన్న 8 ఎంజీడీ పంపింగ్ మెయిన్ లైన్‌పై 800 ఎంఎం డయాడి బట్టర్ వాల్స్ దెబ్బతిన్నాయని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసే క్రమంలో తాగు నీటి సరఫ రాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా జరిగే జీవీఆర్ నగర్, కండ్రిక విలేజ్, వాంబే కాలనీ-1, 2 బ్లాకులు, రాజీవ్‌నగర్ ఉడా కాలనీ, ఆంధ్రప్రభ కాలనీ, రాజరాజేశ్వరిపేట 222, అజిత్‌సింగ్‌నగర్-1, 2, 3, ప్రకాష్‌నగర్, రాజీవ్‌నగర్, శాంతి నగర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, ప్రైజర్‌పేట, టన్నెల్ బూస్టర్, కేఎల్‌రావునగర్, చిట్టినగర్, మిల్క్ ప్రాజెక్ట్ ఏరియా ప్రాంతాల్లో తాగు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు.

గేదెల దొంగలు హల్‌చల్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గేదెల దొంగలు హల్ చల్ చేస్తున్నారు. నెల రోజుల నుంచి ఇక్కడ దాదాపు 12 గేదెలకు పైగా కనిపించకపోవడంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. సింగ్‌నగర్ నందమూరినగర్ పరిసరాల్లో పలువురు రైతులు గేదెలను పెంచుతూ పాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతమంది గేదెలను దొంగతనంగా వ్యానుల్లో ఎక్కించి గుంటూరుకు తరలించి విక్రయిస్తున్నట్లుగా తెలుస్తుంది. ఒక్కో గేదె ధర రూ.లక్ష వరకు ఉంటుందని సమాచారం.

అపార్టుమెంట్ విక్రయిస్తానని రూ.9 లక్షలు స్వాహా

పెనమలూరు: తాడిగడపలో అపార్టుమెంట్ విక్ర యిస్తానని రూ.9 లక్షలు స్వాహాచేసిన వ్యక్తిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు కథనం మేరకు.. విజయవాడ చిట్టినగర్ మిల్క్ ప్రాజెక్టు క్వార్టర్స్‌లో ఉంటున్న నర్రా వెంకట్రావు అపార్టుమెంట్ కొనే ఆలోచనలో ఉన్నాడు. మిల్క్ ప్రాజెక్టులో డ్రైవర్‌గా పని చేసే శౌరిబాబు, వెంకట శ్రీనివాసరావు, జి.సురేష్ కలిసి వెంకట్రావు తాడిగడప శ్రీవిఘ్నేశ్వర ప్లాజాలో చెరుకూరి వసంతరావు ఉంటున్న అపార్టుమెంట్‌ను కొనటానికి 2018లో వెళ్లారు. అపార్టుమెంట్ నచ్చడంతో రూ.50 వేల టోకెన్ అడ్వాన్స్ ఇచ్చారు. ఆ తరువాత అగ్రిమెంట్ రాసి రూ.7.50 లక్షలు వెంకట్రావు అడ్వాన్స్‌గా వసంతరావుకు చెల్లించాడు. అపార్టుమెంట్ కాగితాలు తీసుకోని వెంకట్రావు బ్యాంకు లోన్‌కు వెళ్లగా లింక్ డాక్యు మెంట్లు సరిగా లేవని బ్యాంకు నిరాకరించింది. అనంతరం కరోనా రావటంతో వ్యవహారం నిలిచిపోయింది. 2024 జూన్‌లో తన సొమ్ము తనకు తిరిగి చెల్లించమని వెంకట్రావు వసంతరావును కోరగా కాగితాలు సరిచేస్తానని మళ్లీ రూ.లక్ష తీసుకున్నాడు. అయినా అతను కాగితాలు సరి చేయలేదు. తీసుకున్న నగదు చెల్లించాలని వెంకట్రావు కోరితే వసంతరావు, అతని మనుషులు చంపుతా నని బెదిరిస్తున్నారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆధునిక సాఫ్ట్‌వేర్‌తో సివిల్ రంగంలో పెను మార్పులు



పెనమలూరు: సివిల్ రంగంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి ఆధునిక సాఫ్ట్‌వేర్ ఎంతగానో దోహదపడుతుందని పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు అన్నారు. కానూరులోని కాలేజీలో మూడు రోజుల రివిట్ సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్ శిక్షణ తరగతులను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించుకోని నేడు అత్యాధునిక భవనాలు, రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. సివిల్ విభాగాధిపతి డాక్టర్ వి. జగదీష్ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికత దేశ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సివిల్ రంగంలో వస్తున్న మార్పులను విద్యార్థులు అవగాహన చేసుకోని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మెనెంట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని నూతన ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మెనెంట్ చేసి పీఆర్సీ వర్తింపచేయాలని, స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపేసి ఉద్యోగభద్రత కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని ఐకేపీ యానిమేటర్లు, ఆర్పీలు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజనం కార్మికులపై రాజకీయ వేధింపులు సాగిస్తుండడంతో కొంత మంది స్కీం వర్కర్లు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు నిలుపుదల చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల ఐదో తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలలో మున్సిపల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు పారిశుద్ధ్య కార్మికులతో సమానంగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సూకరాజు, ఉరుకూటి రాజు, బి.సోమయ్య, కె.పెంచల నరసయ్య, జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘనటపై అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. పోలీసుల కథనం మేరకు.. రామవరప్పాడుకు చెందిన ఉల్లి అనిల్‌కుమార్ అలియాస్ రాజు, రమాదేవి దంపతులు హోటల్ వ్యాపారం చేస్తుంటారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. వ్యాపారం కోసమని అనిల్ పలు బ్యాంకుల్లో, చుట్టుపక్కల వారి వద్ద అప్పులు చేశాడు. అయితే వ్యాపారంలో నష్టం రావడంతో అతనిపై వత్తిళ్లు పెరిగిపోయాయి. ఈ క్రమంలో భార్య, బిడ్డలను గత నెల 31వ తేదీన వారి పుట్టింటిలో వదిలి మా అమ్మానాన్నల దగ్గరకు వెళ్లి డబ్బులు తీసుకువస్తానని చెప్పి బైకుపై వెళ్లాడు. ఆ తర్వాత భార్యకు ఫోన్ చేసి బైకు సింగ్‌నగర్ శ్మశాన వాటిక వద్ద పెడుతున్నానని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో రమాదేవి తన కుటుంబ సభ్యులను తీసుకొని సింగ్‌నగర్ శ్మశాన వాటిక వచ్చి చూడగా అక్కడ అతని బైకు, ఫోన్ గుర్తించారు. చుట్టుపక్కల ఎక్కడా అతని ఆచూకీ లభించలేదు. దీంతో రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఎస్‌ఎంసీలకు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

విజయవాడరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో పోటీ చేసే విద్యార్థుల తల్లిదండ్రులు ఓటర్లుగా నమోదు చేయడానికి తమ వివరాలను ఆయా స్కూల్స్‌లోని ప్రధానోపాధ్యాయులకు అందజేయాలని విజయవాడ రూరల్ మండల విద్యాశాఖాధికారి-2, ఏ.సూరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో తరగతికి ముగ్గురు చొప్పున సభ్యులు ఎన్నికవుతారని వారిలో ఎస్సీ, బీసీ, ఓసీ సభ్యులు ఉంటారన్నారు. వారి నుంచి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నుకుంటారు. ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. వీరి పదవీ కాలం రెండేళ్లు ఉంటుంది. ఒక్కో స్కూల్‌లో ఈ కమిటీలో 15 మంది సభ్యులుంటారు. వారిలో 66 శాతం మహిళలు సభ్యులుగా ఉండాలి. 5వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను పరిశీలిస్తారు. 8వ తేదీన ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికలు నిర్వహిస్తామని ఎంఈఓ సూరిబాబు తెలిపారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు పి.నిర్మల తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా జట్టు సెలక్షన్స్‌లో సబ్ జూనియర్ బాలికల జట్టుకు ఎ.చంద్రిక, బాలుర జట్టుకు షేక్ గౌస్, సీహెచ్ సాయిప్రకాష్ ఎంపికయ్యారన్నారు. ఈ నెల 10, 11వ తేదీల్లో కుప్పంలో జరగబోయే రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో వీరంతా కృష్ణా జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం నిర్మల, వ్యాయామోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రముఖులు అభినందించారు.

క్లుప్తంగా...

వైఎస్ జగన్‌ను కలిసిన గ్రేటర్ విశాఖ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

సాక్షి,అమరావతి: గ్రేటర్ విశాఖ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్‌లు మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిశారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్ జగన్ క్యాంప్ కార్యాలయంలో వీరు జగన్‌తో భేటీ అయ్యారు. ఈ భేటీలో పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, విశాఖ మేయర్ గొలగాని వెంకట హరికుమారి, పార్టీ నేతలు తిప్పల నాగిరెడ్డి, అదీప్ రాజ్, కోలా గురువులు, కేకే రాజు తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం



కర్నూలు (టౌన్): కర్నూలు కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్‌లు విజయం సాధించారు. మూడేళ్లుగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికవుతున్నారు. ఈ ఏడాది అధికార టీడీపీ ఐదుగురు అభ్యర్థులను బరిలో దింపింది. స్వయానా మంత్రి టీజీ భరత్ రంగంలో దిగి ప్రలోభాలతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను పార్టీలో చేర్పించుకుని గెలవాలని కుయుక్తులకు పాల్పడినా ఆయనకు భంగపాటు తప్పలేదు. టీడీపీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లూ ఓడిపోగా స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీ చేసిన వైఎస్సార్‌సీపీకి చెందిన ఎం.విక్రమసింహా రెడ్డి, అన్నెపోగు క్రాంతి కుమార్, జుబేర్ అహమ్మద్, మిద్దె చిట్టెమ్మ, యూనుస్ బాషాలు విజయం సాధించినట్లు కర్నూలు కార్పొరేషన్ కమిషనర్ రామలింగేశ్వర్ డిక్లరేషన్ అందజేశారు.

వైఎస్సార్‌సీపీకి ఓటేసిన నిన్ను లారీతో తొక్కిస్తాం

- ఓ వ్యక్తి ప్రాణాలు తీసిన టీడీపీ మూకల దుర్మార్గం
- బాపట్ల జిల్లాలో విషాద ఘటన


చనిపోయిన అంజయ్య

బల్లికురవ: అధికారం చేపట్టిన నాటి నుంచి టీడీపీ మూకలు దుర్మార్గాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. ఓ వ్యక్తిని టీడీపీ నేతలు బెదిరించి అతని ప్రాణాలు తీసేలా వ్యవహరించిన ఘటన గురువారం బాపట్ల జిల్లాలో జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బల్లికురవ మండలం ఉప్పుమాగులూరు పంచాయతీలోని సోమవరప్పాడు గ్రామానికి చెందిన కొండవర్థి అంజయ్య (55) తనకున్న కొద్దిపాటి పొలానికి తోడు కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం సాయంత్రం పొలానికి వెళ్లి వచ్చాక గ్రామంలోకి వచ్చే పసుమర్రు మేజర్ కాలువ చప్టా గోడపై కూర్చున్నాడు. అదే సమయంలో అక్కడకి వచ్చిన గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అనపర్తి పోతురాజు, చిన్నా.. అంజయ్యతో గొడవకు దిగారు. 'టీడీపీ కూటమికి ఓట్లు వేయకుండా వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేస్తావా నిన్ను గ్రానైట్ లారీతో తొక్కిస్తాం, నీ అంతు చూస్తాం' అంటూ బెదిరించడంతో పాటు గోడపై కూర్చున్న అంజయ్యను కిందకు నెట్టారు. దీంతో అంజయ్య అపస్మారక స్థితికి చేరగా కుటుంబసభ్యులు, బంధువులు చికిత్స నిమిత్తం చిలకలూరిపేట వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే అతను కన్నుమూశాడు. అంజయ్యకు భార్య, ఇద్దరుకుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

వాసుదేవరెడ్డికి 41ఏ నోటీసులు ఇవ్వండి


పోలీసులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్) మాజీ ఎండీ డి.వాసుదేవరెడ్డికి సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు ఇవ్వాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ గురువారం ఉత్తర్వులిచ్చారు. కృష్ణా జిల్లా గుడివాడ పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వాసుదేవరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా ఆ వ్యాజ్యంపై జస్టిస్ కృపాసాగర్ గురువారం విచారణ జరిపారు.

నాకు సెక్యూరిటీ ఉండేలా ఆదేశించండి

హైకోర్టులో ద్వారంపూడి పిటిషన్



సాక్షి, అమరావతి: తనకు ప్రాణహాని ఉన్నందున గతంలో ఉన్న విధంగా తనకు 1+1 భద్రతను పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.దీనిపై గురువారం న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ విచారణ జరిపారు. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ, కాకినాడ ఎస్పీలకు నోటీసులు జారీ చేస్తూ పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని పేర్కొంటూ విచారణను 3 వారాలకు వాయిదా వేశారు.

ప్రతీ కార్యకర్తకు తోడుగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ భరోసా


వైఎస్ జగన్‌కు జ్ఞాపిక అందిస్తున్న చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ప్రతినిధులు

ప్రతీ కార్యకర్తకు తనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులంతా తోడుగా ఉంటారని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు, నేతలు, అభిమానులు, ప్రజలతో ఆయన మమేకమయ్యారు. అందరినీ పలకరించి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో పలు అంశాలపై చర్చించారు.

– సాక్షి, అమరావతి


వైఎస్ జగన్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళ

పోలీసుల ముసుగులో దందా

కోనసీమ జిల్లాలో టీడీపీ–జనసేన నేతల బరితెగింపు

- యానాం నుంచి జనసేన ద్వితీయశ్రేణి నేతలు మద్యం అక్రమ రవాణా
- వారి నుంచి రూ.5 లక్షలు డిమాండ్ చేసిన టీడీపీ–జనసేన నేతలు
- సినీ ఫక్కీలో కిడ్నాప్.. రూ.25వేలు ఇచ్చాక విడుదల
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు


చంద్రబాబుతో టీడీపీ నేత భూషణం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కాకినాడ :అధికారం వచ్చిందో లేదో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి నేతల ఆగడాలు మామూలుగా లేవు. అధికారం తమ గుప్పెట్లో ఉందనే ధైర్యం, తమ ప్రజాప్రతినిధుల అండదండలున్నాయనే బరితెగింపుతో ఆయా పార్టీల నేతలు చెలరేగిపోతూ దోపిడీలు, దౌర్జన్యాల కోసం నకిలీ పోలీసుల అవతారమెత్తుతున్నారు. నిజానికి.. రాష్ట్రంలో ప్రజలకు చెందాల్సిన ప్రతీపైసా నాటి సీఎం వైఎస్ జగన్ డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా బ్యాంకు ఖాతాల్లో పారదర్శకంగా జమ చేసేవారు. అదే సందర్భంలో తాము అమలుచేస్తున్న డీబీటీని చంద్రబాబు అండ్ కో దోచుకో, పంచుకో, తినుకోగా మార్చేస్తుందని జగన్ పదేపదే హెచ్చరించేవారు. అప్పుడు ఆయనన్నట్లుగానే ఇప్పుడు కూటమి నేతలు ఆ మాటలను నిజంచేసి చూపిస్తున్నారు. ఈ విషయంలో టీడీపీ, జనసేన నేతలు ఒకరిని మించి మరొకరు దందాలు చేస్తున్న తీరు చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రాతినిధ్యం వహిస్తున్న రామచంద్రాపురం నియోజకవర్గం మసకపల్లి గ్రామంలో తాజాగా చోటుచేసుకున్న ఇలాంటి ఘటనే ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశమైంది. అక్కడ ఏం జరిగిందంటే..

చౌకగా కొని.. 'చీప్'గా కల్తీచేసి..

పాండిచ్చేరి కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో తక్కువ ధరకు లభించే వివిధ బ్రాండ్ల మద్యం బాటిళ్లను కొందరు కూటమి నేతలు కొనుగోలు చేసి వాటి లేబుళ్లు, బాటిళ్లు మార్చి రామచంద్రాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు దుకాణాలు, బెల్ట్ షాపుల్లో కల్తీచేసి విక్రయిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు నియంత్రణలో ఉన్న ఈ అక్రమ మద్యం దందా.. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత విచ్చలవిడిగా సాగుతోంది. ఈ క్రమంలో.. మంగళవారం రాత్రి పామర్రు పోలీసుస్టేషన్ పరిధిలో ఇద్దరు జనసేన ద్వితీయ శ్రేణి నేతలు అరిశెట్టి మణికంఠ (అయ్యప్ప) మరొకరు యానాం మద్యాన్ని పామర్రు తరలిస్తున్నారు. విషయం తెలుసుకుని మసకపల్లి, ద్రాక్షారామ ప్రాంతానికి చెందిన టీడీపీ, జనసేన నేతలు రవ్వా భూషణం, సలాది శ్రీనివాస్ పాణింగపల్లి వద్ద మాటేశారు. అక్కడకు దగ్గర్లోనే కారు పార్కు చేశారు. అందులో నకిలీ పోలీసులు ఇద్దరిని ఖాకీ డ్రెస్సుతో కూర్చోబెట్టారు. యానాం నుంచి లిక్కర్ బాటిళ్లతో వచ్చిన జనసేన ద్వితీయశ్రేణి నేతలను అడ్డగించి, కారులో స్పెషల్ పార్టీ పోలీసులున్నారు.. మీ వ్యవహారం బయటకు పొక్కకుండా ఉండాలంటే రూ.5 లక్షలు ఇవ్వాలని తెదేపా, జనసేన నేతలు డిమాండ్ చేశారు. అందుకు వారు నిరాకరించడంతో ఇద్దరినీ కిడ్నాప్‌చేసి కారులో ఆ రాత్రి ద్రాక్షారామ తరలించారు. కనీసం రూ.2 లక్షలు ఇవ్వాలని, లేకుంటే పోలీసులు మా వెంటే ఉన్నారని, కేసుల్లో ఇరికిస్తామని బెదిరించారు. దీంతో కేసులకు భయపడి జనసేన ద్వితీయ శ్రేణి నేతలు రూ.25 వేలు చేతిలో పెట్టి మిగిలింది తరువాత చూస్తామని చెప్పడంతో వారిని విడిచిపెట్టారు. మణికంఠ అక్కడి నుంచి బయటపడి పామర్రు వచ్చేశాక వారిపై పోలీసు ఉన్నతాధికారులు, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు గత రెండ్రోజులుగా పరారీలో ఉన్న ఇద్దరు కూటమి నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై పామర్రు ఎస్ఐ జానీబాషాను సంప్రదించగా ఫిర్యాదు వచ్చిన మాట వాస్తవమేనని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

చినబాబు చెప్పారు చేయాల్సిందే

- చంద్రబాబుకు చికిత్స అందించిన వైద్యురాలికి నజరానా
- ఆమె భర్తకు రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్ఈగా పోస్టింగ్
- అంతకు ముందు కాపు సామాజిక వర్గ అధికారికి ఆ పదవి
- సీఎంవో ఆదేశాలతో రాత్రికి రాత్రి ఆదేశాలను మార్చేసిన సీఎండీ


File No.EPCOR-08001(04)/20/2024-ESTABLISHMENT-1-COR

EASTERN POWER DISTRIBUTION COMPANY OF ANDHRA PRADESH LIMITED
CORPORATE OFFICE :: VISAKHAPATNAM

Memo. No.HRD / ESTT-1/ E-455235/ EPCOR-08001(04)/20/2024-ESTT-1-COR/ D.No.2/ 14604, Dt. 31.07.2024

Sub:- APEPDCL - HRD/Estt.-I- Certain Executive Engineers(El.) - Promotion and posting as Superintending Engineers/ General Managers - Modification orders - Issued.

Ref:- E.O.O.(HRD) Rt.No.87/2024, Dt.31.07.2024.

In the reference cited, Sri Gorle Prasad, (Emp.ID.1023379), Executive Engineer/ Operation/ Kakinada was promoted and posted as Superintending Engineer/ Operation/ Rajamahendravaram.

2. Now, in partial modification to the above orders, Sri Gorle Prasad (Emp.ID.1023379), Executive Engineer/ Operation/ Kakinada who stands promoted and posted as Superintending Engineer/ Operation/ Rajamahendravaram is now transferred and posted as General Manager/ Operation-II/ Corporate Office/ Visakhapatnam vice Sri K. Tilak Kumar, (Emp.ID. 1026983), General Manager/ Operation-I/ Corporate Office/ Visakhapatnam transferred. On transfer, Sri K. Tilak Kumar, General Manager/ Operation-I/ Corporate Office is posted as Superintending Engineer/ Operation/ Rajamahendravaram, on administrative grounds.

3. They are directed to assume charge at the place of postings. They are further informed that, no request either for sanction of leave or for alternative postings will be entertained.

PRUDHVI TEJ IMMADI, IAS
CHAIRMAN & MANAGING DIRECTOR

అర్ధరాత్రి మార్చి ఇచ్చిన ఉత్తర్వులు

సాక్షి, అమరావతి : చేతికొచ్చిన అధికారాన్ని అడ్డుపెట్టుకుని తాము చెప్పిన పని కచ్చితంగా చేసి తీరాల్సిందేనని కూటమి నేతలు ఉన్నతాధికారులకు హుకుం జారీ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) సీఎండీ.. 'చినబాబు' చెప్పారని రాత్రికి రాత్రే రాజమహేంద్రవరం ఎస్ఈ పోస్టుకు సంబంధించిన ఆదేశాలను మార్చేయడం విద్యుత్ శాఖలో తీవ్ర చర్చకు దారితీసింది. కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న గొర్లె ప్రసాద్‌ను రాజమహేంద్రవరం ఎస్ఈగా పదోన్నతిపై నియమిస్తూ డిస్కం సీఎండీ ఐ.పృథ్వీతేజ్ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయం సీఎంఓలోని ఓ ఉన్నతాధికారి ద్వారా మంత్రి లోకేశ్‌కు తెలియడంతో వెంటనే ఆ ఆదేశాలు రద్దు చేసి, తాను చెప్పిన అధికారిని ఆ పోస్టులో నియమించాలని చెప్పారు. ఈ మేరకు ఆ ఉన్నతాధికారి ఏపీఈపీడీసీఎల్ సీఎండీని ఫోన్‌లో దీనిపై హెచ్చరించారు. సీఎంఓ ఆగ్రహం వ్యక్తం చేయడంతో ప్రసాద్‌ను కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్(ఆపరేషన్స్)గా పంపి, ఆ స్థానంలో ఉన్న కె.తిలక్ కుమార్‌ను రాజమహేంద్రవరం ఎస్ఈగా నియమిస్తూ అర్ధరాత్రి 11.30 గంటల తర్వాత ఆదేశాలు ఇచ్చారు. ఈ సంఘటన విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఇందుకు కారణం ఏమంటే.. ఎన్నికల ముందు అవినీతి కేసులో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో చంద్రబాబు రిమాండ్ ఖైదీగా ఉన్నప్పుడు ప్రభుత్వ వైద్యురాలిగా తిలక్ భార్య ఆయనకు చికిత్స అందించారని తెలిసింది. బాబు సూచనల మేరకు వైద్యం అందించినందుకే ఆమెకు నజరానాగా ఆమె భర్తకు ఎస్ఈ పోస్టును కట్టబెట్టారని సమాచారం. కాగా, ఇంధన శాఖలో ఇప్పటికే జేఎండీలు, ఎండీలు, డైరెక్టర్లు అంటూ పది మందికి పైగా ఉన్నతాధికారుల చేత బలవంతంగా రాజీనామాలు చేయించారు. వారి స్థానంలో తమ వారిని నియమించేందుకు రూ.కోట్లల్లో బేరసారాలు సాగిస్తున్నట్లు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఈ పోస్టుకు రూ.50 లక్షల వరకు, ఎలక్ట్రికల్ ఇంజనీర్ పోస్టుకు రూ.10 లక్షలు వసూలు చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది.


టీడీపీ వేధింపులతో ఆర్‌పీ ఆత్మహత్యాయత్నం


ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆర్‌పీ విజయలక్ష్మి

ఏలూరు టౌన్: టీడీపీ నేతల వేధింపులు భరించలేక ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని డ్వాక్రా రిసోర్స్‌పర్సన్ (ఆర్‌పీ) పి.విజయలక్ష్మి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను కుటుంబ సభ్యులు ఏలూరు జీజీహెచ్‌లో చేర్పించగా.. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. బాధితురాలు మాట్లాడుతూ.. తాను 31 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి రిసోర్స్‌పర్సన్‌గా పనిచేస్తున్నానని, తనను ఆర్‌పీగా తొలగించి మరొకర్ని ఆర్‌పీగా నియమించుకోవాలనే లక్ష్యంతో టీడీపీ నేతలు తనపై కుట్రలు చేస్తున్నారని విజయలక్ష్మి ఆరోపించింది. తాను రూ.4 లక్షలు అవినీతికి పాల్పడినట్టు ప్రచారం చేశారని, విచారణ చేసుకున్న టీడీపీ నేతలు ఆ తర్వాత రూ.50 వేలు అంటూ ప్రచారం చేస్తున్నారని, తాను జీతంగా తీసుకున్న మొత్తాన్ని కూడా అవినీతిగా చూపించటం దారుణమని ఆవేదన వ్యక్తం చేసింది. నెల రోజులుగా టీడీపీ నాయకుడు బెల్లంకొండ కిషోర్, రమణ అనే మహిళ తనను వేధిస్తున్నారని తెలిపింది. కూటమి ప్రభుత్వం వచ్చిన అనంతరం డివిజన్ ఇన్‌చార్జ్‌లుగా ఉన్న నాయకులు తమకు అనుకూలంగా ఉన్న వారిని నియమించాలనే ఉద్దేశంతో అవినీతి ఆరోపణలు చేయటం, వేధింపులకు పాల్పడటం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదని, ఆర్‌పీగా తొలగించాలనే ఉద్దేశంతో టీడీపీ నేతలు వేధించటం తట్టుకోలేక ఆత్మహత్యకు యత్నించానని విజయలక్ష్మి తెలిపింది.

ఆన్.. ఆఫ్.. ఆన్!

- మొక్కుబడిగా హంద్రీ–నీవా నీటి విడుదల
- 12 పైపులకు మధ్యాహ్నం ఆన్ చేసింది 2.. గంటలోపే స్విచ్ ఆఫ్
- మళ్లీ రాత్రి ఒక్క పంపు ఆన్ చేసి 337.6 క్యూసెక్కుల విడుదల
- 'సీమకు అన్యాయంపై నోరు విప్పని మంత్రులు, ఎమ్మెల్యేలు


గురువారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత మల్యాల వద్ద రెండు పంపుల ద్వారా విడుదలవుతున్న నీరు (ఇన్‌సెట్) ఆగిపోయిన నీరు


గార్గేయపురం–బ్రాహ్మణకొట్కూరు మధ్య హంద్రీ–నీవా కాలువపై చిన్న పైపులతో నిర్మించిన అప్రోచ్ రోడ్డు

సాక్షి ప్రతినిధి కర్నూలు: హంద్రీ–నీవా నీటి విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం దొంగాట ఆడుతోంది. సకాలంలో నీళ్లివ్వకుండా రాయలసీమలో 6.02 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు అందకుండా చేస్తోంది. కూటమి సర్కారు నిర్లక్ష్య వైఖరిని 'సాక్షి' రెండు రోజులుగా ఎండగట్టడంతో గురువారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత హంద్రీ–నీవా ఎస్ఈ రామగోపాల్ మల్యాల పంప్‌హౌస్ వద్ద పూజలు చేసి రెండు పంపులు స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. మొత్తం 12 పైపులకుగానూ కేవలం రెండు పంప్‌లు మాత్రమే ఆన్ చేయడం గమనార్హం. అయితే గంటలోపే స్విచ్ ఆఫ్ చేసి నీటి విడుదలను నిలిపివేశారు. మల్యాల నుంచి నీళ్లు బ్రాహ్మణకొట్కూరు సమీపంలోకి రాగానే పంపులు స్విచ్ ఆఫ్ చేశారు. మళ్లీ రాత్రి ఏడున్నర గంటల సమయంలో హడావుడిగా ఒక్క పంపు ఆన్ చేసి 337.6 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కర్నూలు, శ్రీసత్యసాయి జిల్లాల్లో పర్యటిస్తుండటంతో కొత్త అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి కాకపోయినా నీటిని విడుదల చేశారు. పాత అప్రోచ్ రోడ్డును జేసీబీలతో తొలగించారు.

500 క్యూసెక్కులు కూడా కష్టమే!

కొత్తగా నిర్మించిన అప్రోచ్ రోడ్డులో 13 చిన్న సైజు సిమెంట్ పైపులను అమర్చారు. కాలువలో పూర్తిస్థాయి నీటి మట్టం ఉన్నప్పుడు 2,200–2,500 క్యూసెక్కులు ప్రవహించే సామర్థ్యం ఉంది. ఇప్పుడు అమర్చిన చిన్న పైపులతో 500 క్యూసెక్కులు కూడా ప్రవహించడం కష్టమేనని తెలుస్తోంది. పాత అప్రోచ్ రోడ్డు నిర్మాణ సమయంలో నీరు ప్రవహించేందుకు వీలుగా పుట్టా సంస్థ పైపులు వేయకపోవడమే ఈ దుస్థితికి కారణం. రాయలసీమలోని 52 అసెంబ్లీ స్థానాల్లో 45 చోట్ల టీడీపీ కూటమి ఎమ్మెల్యేలే గెలిచినా సీమ రైతన్నల ప్రయోజనాలను కాపాడేందుకు గొంతు విప్పకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

■ కోటంరెడ్డి అనుచరుల గూండాగిరి


సీఐ హుస్సేన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న శ్రీధర్‌రెడ్డి అనుచరులు

టీడీపీ నేతల అరాచకాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయి. సామాన్య ప్రజల మాన ప్రాణాలను తీస్తున్న టీడీపీ నేతలు.. ఇప్పుడు పోలీసులపై కూడా దాదాగిరి చేస్తున్నారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అనుచరులు గురువారం డ్యూటీలో ఉన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌పై దౌర్జన్యానికి పాల్పడ్డారు. నెల్లూరు నగరపాలకసంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించిన సమస్యలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మంత్రి పి.నారాయణ పాల్గొన్న ఈ కార్యక్రమానికి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన అనుచరులతో వచ్చారు. అక్కడ విధుల్లో ఉన్న సీఐ అల్తాఫ్ హుస్సేన్ కోటంరెడ్డితోపాటు మరో ఇద్దరు, ముగ్గురు అనుచరులను లోపలికి పంపారు. దీంతో మిగిలినవారు తమనే అడ్డుకుంటావా... అంటూ సీఐపై కోటంరెడ్డి అనుచరులు గొడవకు దిగారు. ఒక దశలో పోలీసులపై దాడికి ప్రయత్నించారు.

– సాక్షి ప్రతినిధి, నెల్లూరు

మదనపల్లె కేసు పక్కదారి పట్టిస్తున్న బాబు

- పెద్దిరెడ్డిని అప్రతిష్ట పాల్జేయడానికి పాట్లు
- పెద్దిరెడ్డి ఏడుసార్లు ఎమ్మెల్యే.. రాయలసీమలో ప్రజాబలం ఉన్న నేత
- వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి



సాక్షి, అమరావతి : మదనపల్లె అగ్నిప్రమాదం కేసును ప్రభుత్వ పెద్దలు పక్కదారి పట్టిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని టార్గెట్ చేసుకుని చంద్రబాబు, లోకేశ్ వారికి నచ్చినట్లుగా అధికారులతో విచారణ జరిపిస్తున్నారని ఆరోపించారు. తాడేపల్లిలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయం వద్ద శ్రీకాంత్ మీడియాతో మాట్లాడుతూ.. అగ్నిప్రమాదం జరిగిన ఆఫీసులో ఉండే రికార్డులు కలెక్టర్ ఆఫీసులో కూడా ఉంటాయని.. నిజానికి, ప్రమాద సమయంలో టీడీపీకి చెందిన వ్యక్తి అక్కడే ఉన్నాడని శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. అధికారం చేపట్టి రెండునెలలు గడిచినా చంద్రబాబు ఇంకా మేనిఫెస్టో అమలుచేయడంలేదు. తల్లికి వందనం అడ్రెస్సేలేదు. 18 ఏళ్లు నిండిన మహిళలకు 15 వందలు ఇచ్చేదెప్పుడు? ఏ పథకాన్నీ అమలుచేయకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేయటం సరికాదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకోవద్దు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని రాజకీయాలు చెయ్యొద్దు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ నిర్వచనం మారింది. ఏపీ అంటే అరాచకం, ఆటవికం, రెడ్‌బుక్ పాలన. హామీలు అమలుచేయకపోయినా ప్రశ్నించకూడదనే ఇవన్నీ చేస్తున్నారు. 45 రోజులకే ప్రజల్లో 'జగన్ కనుక ఉండి ఉంటే..' అన్న ఆలోచన, చర్చ మొదలైంది. నిజానికి.. జూన్‌లో 43 లక్షల మంది తల్లులకు అమ్మఒడి పథకం కింద నిధులు జమ అయి ఉండేవి. కొత్త ప్రభుత్వం వచ్చి 50 రోజులైంది. ఇంకా డేటా అంటూ సాగదీత ఏమిటి?

చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్..

ఇక రషీద్ దారుణ హత్య ఘటన జరిగితే దాన్నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు మదనపల్లె ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదాన్ని కుట్ర అంటూ దుష్ప్రచారం చేశారు. ఆ ఘటనపై రెండుసార్లు సమీక్షించి డీజీపీని హుటాహుటిన మదనపల్లెకు హెలికాప్టర్‌లో పంపారు. మాజీమంత్రి పెద్దిరెడ్డిపై నిందలు మోపుతూ నానా హంగామా చేశారు. దానిపై ఎల్లో మీడియాలో పెద్దిరెడ్డిని వ్యక్తిత్వహననం చేస్తూ విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. ఆర్డీఓ ఆఫీసులో ఒకవేళ డాక్యుమెంట్లు కాలిపోతే, అవే రికార్డులు ఎమ్మార్వో ఆఫీస్‌లో, కలెక్టర్ ఆఫీస్‌లో ఉంటాయి. చివరకు ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉంటాయి. ఇవి పూర్తిగా డైవర్షన్ పాలిటిక్స్. పెద్దిరెడ్డి కుటుంబాన్ని అప్రతిష్టపాల్జేసేందుకే నానాపాట్లు పడుతున్నారు. ఆయన ఏడుసార్లు ఎమ్మెల్యే, ఆయన తనయుడు మిథున్‌రెడ్డి మూడుసార్లు ఎంపీ. రాష్ట్రంలో పెద్ద ప్రజాబలం ఉన్న నేత పెద్దిరెడ్డి. రెండు, మూడు తరాలుగా గొప్ప పేరున్న కుటుంబానికి వారు ప్రతినిధులు. అలాంటి వారిపై దాడి, ఆస్తుల విధ్వంసం.. పైగా వారిపైనే కేసులు నమోదుచేయడం చాలా దారుణం.

చంద్రబాబు ద్వంద్వ వైఖరి..

వాస్తవానికి.. మదనపల్లెలో అగ్నిప్రమాదం జరిగితే డీజీపీని హుటాహుటిన హెలికాప్టర్‌లో పంపిన చంద్రబాబు, నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో మైనర్ బాలిక అదృశ్యమైతే, చివరకు ఆమె మృతదేహం చాలారోజులు దొరక్కపోయినా స్పందించలేదు. కేసు దర్యాప్తులో ఉండగానే, ఎస్పీని బదిలీ చేశారు.

కుప్పంలో టీడీపీ దౌర్జన్యం


వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమావేశమైన భవనాన్ని చుట్టుముట్టిన టీడీపీ మూకలు

- వైఎస్సార్‌సీపీ సమావేశాన్ని అడ్డుకున్న టీడీపీ
- బూతులు తిడుతూ సమావేశ భవనంలోకి చొరబడేందుకు యత్నం

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు జిల్లా కుప్పంలో టీడీపీ నేతల దౌర్జన్యం శ్రుతిమించిపోతోంది. రామకుప్పంలో గురువారం వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఎమ్మెల్సీ భరత్ ఏర్పాటు చేసిన సమావేశాన్ని టీడీపీ మూకలు అడ్డుకున్నారు. సమావేశం ఏర్పాటుచేసిన భవనాన్ని చుట్టుముట్టి లోనికి చొరబడేందుకు యత్నించారు. పుంగనూరు తరహా దాడులుకు యత్నించిన టీడీపీ మూకలను పోలీసులు అడ్డుకున్నారు. టీడీపీ మూకలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా అనవసరమైన గొడవలు వద్దనుకుని ఎమ్మెల్సీ భరత్ సమావేశాన్ని అర్ధంతరంగా ముగించుకుని వెళ్లిపోవడంతో అల్లర్లు సృష్టించాలన్న టీడీపీ యత్నాలకు అడ్డుకట్ట పడింది.

ఇద్దరు పోలీసుల సాయంతో..

కుప్పంలో వైఎస్సార్‌సీపీ జెండా కనిపించకుండా చేసేందుకు టీడీపీ నేతలు కుట్రలకు తెరలేపారు. ప్రత్యేకంగా ఇద్దరు పోలీసులకు ఈ బాధ్యత అప్పగించారు. వారిద్దరూ కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ తరఫున గెలుపొందిన జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్, కౌన్సిలర్లను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు దిగుతున్నారు. 'మర్యాదగా టీడీపీ కండువా కప్పుకుంటే మీకు మంచిది. కాదు.. కుదరదు అంటే.. ఏదో ఒక కేసుపెట్టి జైల్లో పెడతాం ' అని తీవ్రస్థాయిలో బెదిరింపులకు దిగుతున్నారు. వారి మాట విననందుకు ఓ వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడిచేసి అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారు. ఈ ఘటనను ఉదహరిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను లొంగదీసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఆ ఇద్దరు పోలీసు అధికారులు చేసిన బెదిరింపులకు భయపడి మంగళవారం అమరావతిలో చంద్రబాబు సమక్షంలో 15 మంది ఎంపీటీసీ సభ్యులు, ఐదుగురు మునిసిపల్ కౌన్సిలర్లు టీడీపీ కండువా కప్పుకున్నారు. మిగిలిన వారిపైనా ఇదే తరహాలో బెదిరింపులకు పాల్పడుతున్నారు.

దాడికి కుట్ర

టీడీపీ మూక దాడులు, దౌర్జన్యాలతో భయపడుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులకు భరోసా కల్పించేందుకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ గురువారం రామకుప్పం మండలం ఆకండగానిపల్లెలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ మూకలు అక్కడకు చేరుకుని భరత్‌కు, వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భరత్ గోబ్యాక్ అంటూ కేకలు వేస్తూ సమావేశం నిర్వహిస్తున్న భవనాన్ని చుట్టుముట్టే ప్రయత్నం చేశారు. భవనంలోకి చొరబడేందుకు యత్నించారు. పుంగనూరులో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు తెగబడిన తరహాలో కుప్పంలో చేయాలని పథకం వేసినట్టు సమాచారం. విషయం తెలుసుకున్న కుప్పం సీఐ మల్లేష్ యాదవ్ అక్కడికి చేరుకుని టీడీపీ శ్రేణులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినా భవనంలోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేశారు. ఎమ్మెల్సీ భరత్ కుప్పం నియోజకవర్గంలో పర్యటించటానికి వీల్లేదని హుకుం జారీ చేశారు. దీంతో పోలీసులు భరత్‌ను తమ వాహనంలో కుప్పానికి తరలించే ఏర్పాటు చేశారు.

1 ఒకే ఒలింపిక్స్ ఒకే క్రీడాంశంలో భారత్‌కు మూడు పతకాలు రావడం ఇదే తొలిసారి. గతంలో రెజ్లింగ్‌లో రెండుసార్లు రెండు పతకాల చొప్పున రాగా... షూటింగ్‌లో ఒకసారి, అథ్లెటిక్స్‌లో ఒకసారి రెండేసి పతకాలు లభించాయి. 1900 పారిస్ ఒలింపిక్స్‌లో బ్రిటిష్ ఇండియా అథ్లెట్ నార్మన్ ప్రిచర్డ్ 200 మీటర్లు, 200 మీటర్ల హర్డిల్స్‌లో రజత పతకాలు గెలిచాడు. 2012 లండన్ ఒలింపిక్స్ రెజ్లింగ్‌లో సుశీల్ కుమార్ రజతం, యోగేశ్వర్ దత్ కాంస్యం సాధించాడు. 2012 లండన్ ఒలింపిక్స్ షూటింగ్‌లో విజయ్ కుమార్ రజతం, గగన్ నారంగ్ కాంస్యం సొంతం చేసుకున్నారు. 2020 టోక్యో ఒలింపిక్స్ రెజ్లింగ్‌లో రవి కుమార్ దహియా రజతం, బజరంగ్ పూనియా కాంస్యం సాధించారు.

“ ఈవెంట్‌కు ముందు గుండెవేగం పెరిగింది. దేవుడిని ప్రార్థిస్తూ నన్ను నేను నియంత్రించుకోవడానికి ప్రయత్నించాను. కొత్తగా ఏమీ ప్రయత్నించకుండా నాకు తెలిసిన ఆటనే ప్రదర్శించాను. పోటీ జరుగుతున్న సమయంలో స్కోరుబోర్డు వైపు అస్సలు చూడలేదు. ఇన్నేళ్ల నా కష్టం మాత్రం గుర్తుకొచ్చింది. తల్లిలాంటి కోచ్ దీపాలీతో పాటు ఇతర సహాయక సిబ్బంది నన్ను మానసికంగా దృఢంగా ఉంచారు. ఒత్తిడిని తట్టుకుంటూ ప్రశాంతంగా ఉండటం నా ఆటలో కీలకం. ఈ విషయంలో నేను ఎమ్మెస్ ధోనిని అభిమానిస్తాను. కాంస్యం గెలవడం సంతృప్తినిచ్చింది. అయితే నాకు నేను ఒక మాట (స్వర్ణం గెలవడం కావచ్చు) ఇచ్చుకున్నాను. అది మాత్రం ఇంకా పూర్తి కాలేదని అనుకుంటున్నా. -స్వప్నిల్ కుసాలే

స్వప్నం సాకారం



50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో కాంస్య పతకం గెలిచిన స్వప్నిల్ కుసాలే

ఈ ఘనత సాధించిన తొలి భారత షూటర్‌గా గుర్తింపు ● ఫైనల్లో 451.4 పాయింట్లతో మూడో స్థానం


గత రియో, టోక్యో ఒలింపిక్స్ క్రీడల్లో మూగబోయిన భారత తుపాకీ ‘పారిస్’లో మాత్రం గర్జిస్తోంది. తమపై పెట్టుకున్న అంచనాలను వమ్ముచేయకుండా షూటర్లు భారత్‌కు మూడో పతకాన్ని అందించారు. గురువారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో స్వప్నిల్ కుసాలే కాంస్య పతకాన్ని సాధించాడు. క్వాలిఫయింగ్‌లో నిలకడగా లక్ష్యంపై గురి పెట్టి పాయింట్లు గెలిచిన స్వప్నిల్ పతకాన్ని ఖరారు చేసే ఫైనల్స్‌లోనూ దానిని కొనసాగించాడు. ఫలితంగా గతంలో ఏ క్రీడాంశంలోనూ నమోదుకాని అద్భుతాన్ని భారత షూటర్లు నిజం చేసి చూపించారు. ఒకే ఒలింపిక్స్‌లో ఒకే క్రీడాంశంలో భారత్‌కు మూడు పతకాలు రావడం ఇదే ప్రథమం. ‘పారిస్’లో ఇప్పటికే రెండు కాంస్యాలు సాధించిన మనూ భాకర్ మరో ఈవెంట్‌లో పోటీపడనుండటంతో భారత్ ఖాతాలో నాలుగో పతకం చేరే అవకాశాలున్నాయి.

పారిస్: గతంలో భారత్ నుంచి ఒలింపిక్స్‌లో ఎవరూ ఫైనల్‌కు చేరని ఈవెంట్‌లో స్వప్నిల్ కుసాలే తొలిసారి ఫైనల్‌కు అర్హత సాధించాడు. తీవ్రమైన పోటీఉండే విశ్వ క్రీడల్లో క్వాలిఫయింగ్‌తో పోలిస్తే అసలు సిసలు సత్తా ఫైనల్లో చూపిస్తేనే పతకాలు ఖరారవుతాయి. తొలిసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతుండటంతో స్వప్నిల్ పతకం సాధిస్తాడని పెద్దగా అంచనాలు పెట్టుకోలేదు. కానీ తన నైపుణ్యంపై అపార నమ్మకమున్న స్వప్నిల్ అందరినీ ఆశ్చర్యపరిచే ప్రదర్శన చేశాడు. షూటింగ్‌లో ఎంతో క్లిష్టమైన ఈవెంట్‌గా పేరున్న 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో (నీలింగ్, ప్రోన్, స్టాండింగ్) స్వప్నిల్ తొలి ప్రయత్నంలోనే ఒలింపిక్ పతకాన్ని గెలిచి తన స్వప్నాన్ని సాకారం చేసుకున్నాడు. గురువారం జరిగిన 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఫైనల్లో 28 ఏళ్ల స్వప్నిల్ కాంస్య పతకాన్ని సాధించాడు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో మహారాష్ట్రకు చెందిన స్వప్నిల్ 451.4 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. స్టేజ్–1లో త్రీ పొజిషన్స్‌లో భాగంగా నీలింగ్ స్టేజ్ ముగిశాక స్వప్నిల్ 153.3 పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత ప్రోన్ స్టేజ్ పూర్తయ్యాక స్వప్నిల్ 310.1 పాయింట్లతో ఐదో స్థానానికి చేరుకున్నాడు. ఎలిమినేషన్‌ను నిర్ణయించే చివరి స్టేజ్ స్టాండింగ్‌లో స్వప్నిల్ నిలకడగా పాయింట్లు సాధించి కాంస్య పతకాన్ని ఖరారు చేసుకున్నాడు. 2012 నుంచి అంతర్జాతీయస్థాయిలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న స్వప్నిల్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలిసారే పతకాన్ని గెలిచి తన కెరీర్‌ను చిరస్మరణీయం చేసుకున్నాడు. లియు యుకున్ (చైనా; 463.6 పాయింట్లు) స్వర్ణం, సెరీ కులిష్ (ఉక్రెయిన్; 461.3 పాయింట్లు) రజతం సాధించారు.

సిఫ్ట్ కౌర్, అంజుమ్ విఫలం

మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో భారత్‌కు నిరాశ ఎదురైంది. ఈ విభాగంలో ప్రపంచ రికార్డు తనే పేరిట లిఖించుకున్న భారత యువ షూటర్ సిఫ్ట్ కౌర్ సమ్రా, సీనియర్ షూటర్ అంజుమ్ మౌద్గిల్ ఫైనల్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యారు. 32 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో సిఫ్ట్ కౌర్ 575 పాయింట్లు స్కోరు చేసి 31వ స్థానంలో నిలువగా... అంజుమ్ 584 పాయింట్లు సాధించి 18వ స్థానాన్ని దక్కించుకుంది. కేవలం టాప్–8లో నిలిచిన షూటర్లే ఫైనల్‌కు అర్హత సాధిస్తారు.

‘ఒక్కడే’ గెలిచి చూపించాడు!



కాంస్య పతకంతో స్వప్నిల్ కుసాలే



వెన్నెముకపై మహా మృత్యుంజయ మంత్రంతో స్వప్నిల్

ఈతరం కుర్రాళ్లు, స్టార్ ఆటగాళ్లు ఒంటిపై టాటూస్ ముద్రించుకుంటే వాటిపై ఏం రాసి ఉంటుంది? తమకు ఆత్మీయులైన వారి పేర్లు గానీ ఆసక్తికర పంచింగ్ లైన్‌లు గానీ ఎక్కువగా కనిపిస్తాయి. ఎక్కడో ఒక చోట దేవుడి బొమ్మలు కూడా ఉంటాయి. **స్వప్నిల్ కుసాలే తన వెన్నెముక భాగం మొత్తం ‘మహా మృత్యుంజయ మంత్రం’ టాటూగా ముద్రించుకున్నాడు. మానసికంగా తనకు కావాల్సిన బలాన్ని, కష్టాల్లో ఉన్నప్పుడు కూడా చలించని దృఢత్వాన్ని ఆ రుగ్వేద మంత్రం తనకు ఇస్తుందని అతను బలంగా నమ్ముతాడు.** అందుకే కావచ్చు సుదీర్ఘకాలం పాటు షూటింగ్ సర్క్యూట్‌లో ఉంటూ గొప్ప ఫలితాలు రాకపోయినా అతను ఎప్పుడూ స్థైర్యాన్ని కోల్పోలేదు. నిజంగా కూడా కుసాలే కెరీర్‌ను చూస్తే చాలా ఆలస్యంగా గుర్తింపు వచ్చినట్లుగా కనిపిస్తుంది. 14 ఏళ్ల వయసులో షూటింగ్‌ను కెరీర్‌ను ఎంచుకున్న స్వప్నిల్ మూడేళ్ల తర్వాత తన తొలి అంతర్జాతీయ పోటీలో బరిలోకి దిగాడు. కానీ అతను తొలి ఒలింపిక్స్ ఆడేందుకు 12 సంవత్సరాలు పట్టింది. 2016 రియో ఒలింపిక్స్ సమయంలో అతని పేరు కనీసం పరిశీలనలో కూడా లేకపోగా... 2020 టోక్యో ఒలింపిక్స్‌కు కొన్నాళ్ల ముందు చెప్పుకోదగ్గ ప్రదర్శన లేకపోవడంతో టీమ్‌లోకి ఎంపిక చేయలేదు. అయితే స్వప్నిల్ సుదీర్ఘ కాలం పాటు తన ఆటనే నమ్ముకున్నాడు. అవకాశం వచ్చిన ప్రతీసారి విజయాన్ని అందుకుంటూ తనేంటో నిరూపించుకుంటూనే వచ్చాడు. ఎట్టకేలకు ఈసారి 28 ఏళ్ల వయసులో అతను మొదటిసారి ఒలింపిక్స్ బరిలోకి దిగడమే కాకుండా కాంస్యంతో చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు.

అవరోధాలను దాటి...

మహారాష్ట్రలోని కొల్హాపూర్ సమీపంలోని కంబల్‌వాడి స్వప్నిల్ స్వస్థలం. తండ్రి సురేశ్ కుసాలే పాఠశాలలో ఉపాధ్యాయుడు. తల్లి అనిత ప్రస్తుతం సర్పంచ్‌గా పని చేస్తోంది. షూటింగ్ సర్క్యూట్‌లో ఉన్న చాలా మందితో పోలిస్తే స్వప్నిల్ నేపథ్యం సామాన్యమైనదే. తండ్రికి ఆటలపై ఆసక్తి ఉండటంతో కొడుకు స్కూల్‌లో ఉండగానే మహారాష్ట్ర ప్రభుత్వ పథకం ‘క్రీడా ప్రబోధిని’లో చేర్పించాడు. నిబంధనల ప్రకారం వారంతా ఒకే తరహాలో ఫిట్‌నెస్ శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఏదైనా క్రీడాంశం ఎంచుకునే అవకాశం ఇస్తారు. అందులో స్వప్నిల్ షూటింగ్‌ను ఎంచుకున్నాడు. నాసిక్‌లోని భోన్సాలా మిలిటరీ స్కూల్‌లో ఉన్న షూటింగ్ రేంజ్‌లో ఓనమాలు నేర్చుకున్న స్వప్నిల్ ఆ తర్వాత మరింత రాటుదేలాడు. అయితే సహజంగానే ఖర్చుతో కూడుతున్న క్రీడ కావడంతో వేర్వేరు దశల్లో ఆర్థిక ఇబ్బందులు తప్పలేదు. తండ్రి బ్యాంకులో అప్పు చేసి మరీ సొంత రైఫిల్ కొనివ్వాల్సి వచ్చింది. దీంతో పాటు ప్రాక్టీస్‌లో వాడే బుల్లెట్‌లు కూడా చాలా ఖరీదైనవి కావడం వల్ల చాలా జాగ్రత్తగా వాడుకుంటూ సాధన చేయాల్సి వచ్చేది.

గగన్ నారంగ్‌ను ఓడించి...

18 ఏళ్ల వయసులో స్వప్నిల్ ప్రతిభను ‘లక్ష్య స్పోర్ట్స్’ సంస్థ గుర్తించింది. వారి ఆర్థిక సహాయంతో పరిస్థితి మెరుగైంది. ఈ క్రమంలో భారత జాతీయ క్యాంప్‌లో అవకాశం దక్కింది. ఆ తర్వాత జాతీయ స్థాయిలో చూపించిన ప్రదర్శనకుగాను భారత రైల్వేలో టికెట్ కలెక్టర్ ఉద్యోగం లభించడంతో పరిస్థితి మరింత మెరుగైంది. 2015లో ఆసియా జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ 3లో కేటగిరీలో స్వర్ణం గెలుచుకోవడంతో తొలిసారి అతనికి గుర్తింపు దక్కింది. రెండేళ్ల తర్వాత జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో స్వప్నిల్ తన ఆటతో అందరి దృష్టిలో పడ్డాడు. 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో తన ఆరాధ్య షూటర్, 2012 లండన్ ఒలింపిక్స్ కాంస్యపతక విజేత గగన్ నారంగ్, మరో సీనియర్ చయన్ సింగ్‌లను దాటి స్వర్ణం గెలుచుకున్న స్వప్నిల్ సంచలనం సృష్టించాడు. అతని ఎదుగుదలలో కోచ్‌గా భారత మాజీ షూటర్ దీపాలీ దేశ్‌పాండే కీలకపాత్ర పోషించింది.

సందేహాలను పటాపంచలు చేస్తూ...

చాలా కాలం క్రితమే 2022 అక్టోబరులోనే కైరోలో జరిగిన వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో నాలుగో స్థానంలో నిలవడంతో స్వప్నిల్ పారిస్ ఒలింపిక్స్‌లో 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ కేటగిరీలో భారత్‌కు కోటా ఖాయం చేశాడు. కొన్నాళ్ల క్రితం నిర్వహించిన ట్రయల్స్‌లో కూడా రాణించడంతో ఈ విభాగంలో భారత్ తరఫున పోటీ పడేందుకు అతనికే అవకాశం దక్కింది. అయినా సరే... స్వప్నిల్ పతకం సాధించడంపై పెద్దగా ఆశలు లేవు. దానికి కారణం ఉంది. ఈ ఒలింపిక్స్‌కు ముందు అతను వరల్డ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం, వరల్డ్ కప్‌లో స్వర్ణం, ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచాడు. ఇవన్నీ కూడా టీమ్ ఈవెంట్లలో గెలిచిన పతకాలే! వ్యక్తిగత విభాగంలో అంతర్జాతీయ స్థాయిలో అతను చెప్పుకోదగ్గ ప్రదర్శన ఏదీ నమోదు చేయలేదు. దాంతో గెలుపుపై సందేహాలు. కానీ స్వప్నిల్ తన పట్టుదలతో వాటన్నింటినీ పటాపంచలు చేశాడు. అంచనాలను తలకిందులు చేస్తూ అనూహ్య ఆటతో ఒలింపిక్స్ పతకాన్ని సాధించి సగర్వంగా నిలిచాడు. - సాక్షి క్రీడా విభాగం

“ కాంస్యం గెలిచిన స్వప్నిల్ కుసాలేకు హృదయపూర్వక అభినందనలు. షూటింగ్‌లో ఒకే ఒలింపిక్స్‌లో మూడు పతకాలు గెలిచి షూటర్లు భారత్ గర్వపడేలా చేశారు. స్వప్నిల్ మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలి.
-ద్రౌపది ముర్ము, రాష్ట్రపతి

స్వప్నిల్ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. అతనికి శుభాకాంక్షలు. పోటీలో చక్కటి ఆటతో పాటు ఎంతో పట్టుదల కనబర్చిన అతను ప్రతీ భారతీయుడిని సంతోషంలో ముంచెత్తాడు.
-నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

ఈ విభాగంలో భారత షూటర్లెవరూ ఎందుకు పతకం సాధించడం లేదని ఆశ్చర్యపోయేవాడిని. ఇప్పుడు స్వప్నిల్ దానిని చేసి చూపించాడు. అతడిపై అంచనాలు లేకపోయినా బాగా ఆడగలడని నేను నమ్మేవాడిని. ఈ కాంస్యం బంగారం కంటే విలువైంది. -గగన్ నారంగ్

ఒలింపిక్స్‌లో భారత్‌కు మరో పతకం అందించిన స్వప్నిల్ కుసాలేకు అభినందనలు. 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్‌లో పతకం గెలిచిన తొలి భారతీయుడిగా స్వప్నిల్ దేశవాసులందరూ గర్వపడేలాచేశాడు.
-వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం

స్వప్నిల్‌కు ప్రమోషన్

ముంబై: పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచిన భారత షూటర్ స్వప్నిల్ కుసాలేకు రైల్వే శాఖ పదోన్నతి కల్పించింది. సెంట్రల్ రైల్వేలోని పుణె డివిజన్‌లో 2015లో కమర్షియల్–కమ్–టికెట్ క్లర్క్‌గా చేరిన కుసాలే ప్రస్తుతం ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్ (టీటీఈ)గా పనిచేస్తున్నారు. ఒలింపిక్ పతక విజేతకు ప్రోత్సాహకంగా అతన్ని టీటీఈ నుంచి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా నియమిస్తూ ప్రమోషన్ ఆర్డర్‌ను జారీ చేసినట్లు సెంట్రల్ రైల్వే తెలిపింది. ఇకపై కుసాలే ముంబైలోని స్పోర్ట్స్ సెల్‌కు ఓఎస్‌డీగా వ్యవహరిస్తాడు. మరోవైపు మహారాష్ట్ర ప్రభుత్వం స్వప్నిల్‌కు రూ. 1 కోటి నజరానా ప్రకటించింది.

‘మగ’ బాక్సర్ చేతిలో మహిళ ఓటమి!

ఒలింపిక్స్‌లో కొత్త వివాదం మొదలు



ఇటలీకి చెందిన ఏంజెలా కెరినీ ఎన్నో ఆశలతో ఒలింపిక్స్ బాక్సింగ్ రింగ్‌లోకి అడుగు పెట్టింది. టోక్యో ఒలింపిక్స్‌లో విఫలమైన ఆమె ఈసారి తండ్రికిచ్చిన మాట కోసం మళ్లీ పతకం కోసం పోరాడేందుకు తీవ్ర సాధన చేసింది. 66 కేజీల విభాగంలో ఆమె బరిలోకి దిగగా... ప్రత్యర్థిగా అల్జీరియాకు చెందిన ఇమాన్ ఖలీఫ్ నిలబడింది. అయితే 46 సెకన్లలోనే ఏంజెలా ఆట నుంచి తప్పుకుంది. ప్రత్యర్థి కొట్టిన తీవ్రమైన పంచ్‌లను ఆమె తట్టుకోలేకపోయింది. ఇలాంటి బాక్సింగ్ తన జీవితంలో చూడలేదంటూ భోరున ఏడ్చేసింది. ఖలీఫ్ పంచ్‌లలో ఒక మగాడి తరహాలో తీవ్రత ఉండటమే అందుకు కారణం! ఖలీఫ్ పురుష లక్షణాలు ఉన్న ‘బయోలాజికల్ మ్యాన్’ కావడమే సమస్య. తాను మహిళగా చెప్పుకుంటున్నా... మగాళ్లలో ఉండే xy క్రోమోజోమ్‌లు ఆమెలో కనిపించాయి. గత ఏడాది ఢిల్లీలో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్‌లో పరీక్షల తర్వాత ఆమెపై నిషేధం కూడా విధించారు. ఆ తర్వాత ఏం జరిగిందో ఖలీల్‌కు మళ్లీ మహిళల విభాగంలో ఒలింపిక్స్‌లో పోటీ పడే అవకాశాన్ని కల్పించారు. తొలి పోరుకు ముందే ఇది అన్యాయమని, ఆడ బాక్సర్‌పై మగాడిని పోటీలో నిలపడం ప్రమాదకరం అంటూ అన్ని వైపుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. చివరకు అదే నిజమైంది. ఖలీల్ పంచ్‌ల దెబ్బకు ఏంజెలా కన్నీళ్ల పర్యంతమైన తీరు అందరినీ కదిలించింది. ఖలీల్ తరహాలో లక్షణాలే ఉన్న లిన్ యు టింగ్ (తైపీ) 57 కేజీల కేటగిరీలో బరిలోకి దిగుతోంది. అప్పుడు ఏం జరుగుతుందో చూడాలి.

కంటిచూపుతో...



టీ షర్ట్‌తో క్యాజువల్ లుక్... ఎడమ చేయి ప్యాంట్ జేబులో... లక్ష్యాన్ని స్పష్టంగా చూసేందుకు ఎలాంటి ప్రత్యేకమైన లెన్స్‌లు లేవు, ఐ కవర్ లేదు, పక్కనుంచి వచ్చే కాంతి నుంచి తప్పించుకునేందుకు వైజర్ పెట్టుకోలేదు, ఇయర్ ప్రొటెక్షన్ లేదు. లక్ష్యంపై గురి...ట్రిగ్గర్‌పై వేలు... నొక్కితే దేశానికి రజత పతకం వచ్చేసింది! టర్కీ షూటర్ యూసుఫ్ డికెక్ ఒక్కసారిగా పారిస్ ఒలింపిక్స్‌లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారాడు. సాధారణంగా షూటర్లు పోటీలో దిగినప్పుడు తమతో పాటు ధరించే సరంజామా ఏదీ అతను వాడలేదు. ఏదో అలా వ్యాహ్యాళికి వెళుతూ బొమ్మ తుపాకీతో సంతలో బెలూన్లను కొట్టినంత అలవోకగా అతను బుల్లెట్‌లను దించేయడం విశేషం. టర్కీ ఆర్మీలో సైనికుడైన 51 ఏళ్ల యూసుఫ్ హాలీవుడ్ సినిమాల స్టయిల్‌ను గుర్తుకు తెచ్చేలా షూటింగ్ చేశాడంటూ కామెంట్లు రావడం విశేషం. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్లో తర్హాన్‌తో కలిసి యూసుఫ్ రజతం సాధించాడు. షూటింగ్‌లో టర్కీకి ఇదే తొలి మెడల్.

భారత్‌కు ‘బ్యాడ్’మింటన్

- రెండు పతకావకాశాలకు తెర
- నిష్క్రమించిన సింధు, సాత్విక్ –చిరాగ్ జోడీ
- క్వార్టర్స్ చేరి ఆశలు నిలిపిన లక్ష్య సేన్

పారిస్ ఒలింపిక్స్ బ్యాడ్మింటన్‌లో గురువారం భారత్‌కు కలిసి రాలేదు. కచ్చితంగా పతకాలు సాధిస్తారనుకున్న పీవీ సింధు... సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ ఓటమి చవిచూసి రిక్తహస్తాలతో రానున్నారు. పురుషుల సింగిల్స్‌లో సహచరుడు ప్రణయ్‌ను ఓడించి లక్ష్య సేన్ క్వార్టర్ ఫైనల్‌కు చేరి భారత్ ఆశలను నిలబెట్టాడు.



సింధు

పారిస్: ‘రియో’లో రజత పతకం. ‘టోక్యో’లో కాంస్యం... ‘పారిస్’లో మాత్రం నిరాశ... గత రెండు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించి వరుసగా మూడో ఒలింపిక్ పతకం లక్ష్యంగా ‘పారిస్’కు వచ్చిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ప్రస్థానం ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ముగిసింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 13వ ర్యాంకర్ సింధు 19–21, 14–21తో ప్రపంచ 9వ ర్యాంకర్ హి బింగ్‌జియావో (చైనా) చేతిలో ఓడిపోయింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో హి బింగ్‌జియావోను ఓడించి కాంస్య పతకాన్ని గెల్చుకున్న సింధు ఈసారి అలాంటి ఫలితాన్ని పునరావృతం చేయలేకపోయింది.

పోరాడినా...

పురుషుల డబుల్స్‌లో ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్న సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ కూడా ముందంజ వేయలేకపోయింది. స్వర్ణ పతకంతో తిరిగి వస్తారనుకున్న సాత్విక్–చిరాగ్ ద్వయం క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. ప్రపంచ మూడో ర్యాంక్ జోడీ ఆరోన్ చియా–సో వుయ్ యిక్ (మలేసియా)తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ ఐదో ర్యాంక్ ద్వయం సాత్విక్–చిరాగ్ 21–13, 14–21, 16–21తో పరాజయం పాలైంది. ఆరోన్ చియా–సో వుయ్ యిక్‌లతో తలపడిన గత మూడు మ్యాచ్‌ల్లో నెగ్గిన సాత్విక్–చిరాగ్ ఈసారి పోరాడినా విజయాన్ని అందుకోలేకపోయింది. ఈ ఏడాది సాత్విక్–చిరాగ్ రెండు టైటిల్స్ గెలిచి, నాలుగు టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచారు. అంతేకాకుండా ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను కూడా అందుకున్నారు. కానీ వరుసగా రెండో ఒలింపిక్స్‌లోనూ పతకం గెలవలేకపోయారు.

ప్రణయ్ అవుట్

సింధు, సాత్విక్–చిరాగ్ నిష్క్రమించడంతో భారత పతక ఆశలన్నీ లక్ష్య సేన్‌పై ఉన్నాయి. భారత నంబర్‌వన్, సహచరుడు హెచ్‌ఎస్ ప్రణయ్‌తో జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్ 21–12, 21–6తో అలవోకగా గెలిచి క్వార్టర్ ఫైనల్ చేరాడు. పారుపల్లి కశ్యప్ (2012 లండన్), కిడాంబి శ్రీకాంత్ (2016 రియో) తర్వాత ఒలింపిక్స్ పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన మూడో భారత ప్లేయర్‌గా లక్ష్య సేన్ నిలిచాడు. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 11వ ర్యాంకర్ చో టిన్ చెన్ (చైనీస్ తైపీ)తో లక్ష్య సేన్ తలపడతాడు. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే లక్ష్య సేన్ సెమీఫైనల్ చేరి పతకం రేసులో ఉంటాడు.

నిఖత్ అవుట్

ప్రిక్వార్టర్స్‌లో చైనా బాక్సర్ చేతిలో ఓటమి



భారీ అంచనాల మధ్య పారిస్ ఒలింపిక్స్ బరిలోకి దిగిన భారత స్టార్, తెలంగాణ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు షాక్ తగిలింది. మహిళల 50 కేజీల ప్రిక్వార్టర్స్‌లో రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ 0–5తో ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత వూ యూ (చైనా) చేతిలో పరాజయం పాలైంది. అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా విజయాలు సాధిస్తున్న నిఖత్.. ఒలింపిక్స్‌లో అదే జోరు కనబర్చలేకపోయింది. పురుషుల 71 కేజీల విభాగంలో నిశాంత్ దేవ్ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో నిశాంత్ 3–2తో రోడ్రిగ్జ్ (ఈక్వెడార్)పై నెగ్గాడు.

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	చైనా	11	7	5	23
2	ఫ్రాన్స్	8	11	8	27
3	జపాన్	8	3	5	16
4	అమెరికా	7	14	13	34
5	ఆస్ట్రేలియా	7	6	4	17
6	బ్రిటన్	6	7	7	20
7	దక్షిణ కొరియా	6	3	3	12
44	భారత్	0	0	3	3

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

క్లుప్తంగా...

సెంట్రల్ వర్సిటీల్లో ఖాళీ సీట్ల భర్తీ



సాక్షి, అమరావతి: సెంట్రల్ వర్సిటీల్లో ఉమ్మడి ప్రవేశాల పరీక్ష (క్యూట్)కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన యూజీ, పీజీ సీట్లను ఆయా వర్సిటీలు భర్తీ చేసుకునేలా అవకాశం కల్పిస్తున్నట్టు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ జగదీష్ కుమార్‌గురువారం 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. కొన్ని సెంట్రల్ వర్సిటీల్లో మూడు, నాలుగు రౌండ్ల కౌన్సెలింగ్ తర్వాత కూడా చాలా వరకు సీట్లు ఖాళీగా ఉన్నట్టు గుర్తించామని పేర్కొన్నారు. ఖాళీ సీట్ల భర్తీకి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ)ను విడుదల చేశామని వివరించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను తప్పని సరిగా పాటించాలన్నారు.

నీట్ 'హార్డ్ డిస్క్'లో సాంకేతిక సమస్యలు

అర్హుల జాబితా కోసం నేడు ఢిల్లీకి వెళ్లనున్న వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ ప్రతినిధి



సాక్షి, అమరావతి: నీట్ యూజీ-2024లో ఏపీ నుంచి అర్హత సాధించిన విద్యార్థుల వివరాల కోసం మరోమారు శుక్రవారం వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రతినిధి ఢిల్లీకి వెళ్లనున్నారు. ఏటా నీట్ అర్హత సాధించిన విద్యార్థుల వివరాలను హార్డ్ డిస్క్ రూపంలో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అందిస్తుంది. ఈ క్రమంలో బుధవారం ఢిల్లీకి వెళ్లి హార్డ్ డిస్క్‌ను తీసుకుని వచ్చారు. గురువారం హార్డ్ డిస్క్‌ను ఓపెన్ చేసి ఏపీ విద్యార్థుల వివరాలను సేకరించే ప్రయత్నం చేయగా, అది ఓపెన్ కాకపోవడంతో పాటు, సాంకేతిక సమస్యలు తలెత్తినట్టు రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. ఈ క్రమంలో ఢిల్లీలోని ఎన్ఎంసీ ప్రతినిధులను సంప్రదించడానికి మరోమారు వర్సిటీ ప్రతినిధి శుక్రవారం ఢిల్లీకి వెళతారని వివరించారు.

వరద ప్రాంతాలకు సబ్సిడీ విత్తనాలు



సాక్షి, అమరావతి: వరదలు, భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటల స్థానంలో మళ్లీ విత్తుకునేందుకు వీలుగా 80 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. జూన్, జూలైలో సాధారణానికి మించి 48.6 శాతం అధికంగా వర్షపాతం నమోదైందన్నారు. ఫలితంగా 1,406 హెక్టార్లలో నారుమళ్లు, 33 వేల హెక్టార్లలో నాట్లు ముంపునకు గురయ్యాయన్నారు. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక రూపొందించామన్నారు. ఉభయ గోదావరి, ఏలూరు, కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో పంపిణీ కోసం ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా 6,356 క్వింటాళ్ల వరి విత్తనాలను సిద్ధం చేశామన్నారు.

3 లక్షల హెక్టార్లలో సూక్ష్మసేద్యం

ఉద్యాన శాఖ కార్యదర్శి అహ్మద్‌బాబు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 3 లక్షల హెక్టార్లలో సూక్ష్మసేద్యం విస్తరణకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఉద్యాన శాఖ కార్యదర్శి అహ్మద్‌బాబు ఆదేశించారు. గురువారం సూక్ష్మసేద్యం పథకంపై కంపెనీల ప్రతినిధులు, అధికారులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే రూ.175 కోట్ల బకాయిలు విడుదల చేశామని, మిగిలిన బకాయిలను కూడా విడతల వారీగా చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

కస్టమ్స్, జీఎస్టీ ఉన్నతాధికారుల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు కేంద్ర కస్టమ్స్, జీఎస్టీ కస్టమ్స్ అదనపు కమిషనర్లు, సంయుక్త కమిషనర్లను కేంద్రం బదిలీ చేసింది. ఈ మేరకు చీఫ్ కమిషనర్ సంజయ్ రౌత్ ఉత్తర్వులు జారీచేశారు.

సమాజాన్ని ప్రభావితం చేసేలా ఏబీకే రచనలు

పంజగుట్ట (హైదరాబాద్): సీనియర్ సంపాదకుడు ఏబీకే ప్రసాద్ మంచి జర్నలిస్టే కాకుండా మంచి రచయిత అని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మీడియా సలహాదారుడు డాక్టర్ సంజయ్ బారు అన్నారు. ప్రజలను ఆకట్టుకునేలా, సమాజాన్ని ప్రభావితం చేసేలా ఆయన రచనలు ఉంటాయని పేర్కొన్నారు. ఏబీకే ప్రసాద్ 90వ ఏట అడుగు పెడుతున్న సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జీవన సాఫల్య అభినందన సభ, 'అలుపెరుగని అక్షరాయుధుడు-ఏబీకే' పుస్తకావిష్కరణ నిర్వహించారు.

తెలంగాణలో నేడే జాబ్ కేలండర్


సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం శాసనసభ వేదికగా జాబ్ కేలండర్‌ను ప్రకటించనుంది. ఇకపై ఏటా యూపీఎస్సీ తరహాలో ప్రణాళికాబద్ధంగా తేదీలవారీగా ఉద్యోగ నియామకాల ప్రకటనలు జారీ చేయాలని నిర్ణయించింది.

విదేశీ విద్యపైనే మోజు!


విదేశాల్లో చదువుకునేందుకే మొగ్గు చూపుతున్న భారతీయ యువత

విదేశాల్లో చదువుకునేందుకు ఇష్టపడే భారతీయ విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతోంది. మధ్య తరగతి ప్రజల్లో ఆదాయం పెరగడం, విదేశాల్లో అధిక జీతాలందించే ఉపాధి అవకాశాలుండటంతో పదేళ్లలో వీరి సంఖ్య రెట్టింపైంది. అదే సమయంలో విదేశాల నుంచి మనదేశంలో చదువుకునేందుకు వచ్చే విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. అయితే భారతీయ విద్యార్థులు విదేశాలకు భారీగా తరలిపోవడం, వారి ఆదాయ, వ్యయాలు అన్నీ ఇతర దేశాల్లోనే జరుగుతుండటంతో దేశీయ కరెంట్ అకౌంట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది.

సాక్షి, అమరావతి: విదేశాల్లో ఉన్నత విద్య చదువుకునేందుకు భారతీయ విద్యార్థులు ఆసక్తి మరింత పెరుగుతోంది. అదే సమయంలో భారతీయ విశ్వవిద్యాలయాల్లో అంతర్జాతీయ విద్యార్థుల నమోదు తగ్గుతోంది. దీని కారణంగా భారతదేశ కరెంట్ అకౌంట్ బ్యాలెన్స్‌పై తీవ్ర ప్రభావం పడుతోంది. విదేశాల్లో చదువుకుంటూ.. అక్కడే పని చేసుకుంటున్న వారు డబ్బును తిరిగి భారతదేశానికి పంపడం లేదు. ఫలితంగా సుమారు రూ.50 వేల కోట్ల కరెంట్ అకౌంట్ లోటును తెచ్చిపెట్టినట్టు ఆర్బీఐ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు రిజర్వ్ బ్యాంకు చెబుతున్నదాని ప్రకారం గత పదేళ్లలో భారతీయుల విద్యా ప్రయాణానికి సంబంధించిన వ్యయం రెట్టింపు కంటే ఎక్కువ పెరిగింది. 2014-15లో రూ.20,597 కోట్ల నుంచి 2023-24లో రూ.52 వేల కోట్లకు పెరిగింది. ఈ మొత్తం 2025 నాటికి దేశం నుంచి విదేశాలకు వేళ్లే విద్యార్థుల మొత్తం ఖర్చు రూ.5 లక్షల కోట్లకు పెరుగుతుందని అంచనా.







విదేశీ విద్యకు రుణాలు పెరిగాయి..



దేశంలో ఉన్నత విద్య కోసం విద్యార్థులు విదేశాలకు వెళ్లిపోతుండటంతో డెమోగ్రాఫిక్ సమతౌల్యం దెబ్బతింటోంది. మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతిలో ఆదాయం పెరుగుతోంది. స్టాక్ మార్కెట్లు వంటివి లాభాలను సృష్టిస్తున్నాయి. నాన్ బ్యాంక్ ఫైనాన్సియల్ కంపెనీలు సైతం విద్యా రుణాలను గణనీయంగా పెంచాయి. ఫలితంగా విదేశాల్లో ఫీజులు చెల్లించే సామర్థ్యం పెద్ద సమస్య కాకుండాపోయింది.

– మహేశ్వర్ పెరి, చైర్మన్, కెరీర్స్ 360 సీఈవో

దేశంలో అంతర్జాతీయ విద్యార్థుల క్షీణత..

భారతీయ విశ్వవిద్యాలయాలు అంతర్జాతీయ విద్యార్థుల నమోదులో గణనీయమైన క్షీణతను నమోదు చేస్తున్నాయి. ఆర్బీఐ నివేదిక ప్రకారం భారత్‌లో విద్యా సంబంధిత అంశాల ద్వారా వచ్చే ఆదాయం సగానికి సగం తగ్గింది. 2014-15లో రూ.4,345 కోట్ల నుంచి 2023-24కు రూ.2,068 కోట్లకు పడిపోయింది. అయితే 2022-23తో పోలిస్తే కేవలం విదేశీ మారకపు ఆదాయం స్వల్పంగా పెరిగింది. కోవిడ్ తర్వాత 2021-22లో రూ.912 కోట్ల కనిష్ట స్థాయి నుంచి పుంజుకుంది. అయినప్పటికీ 2014-15తో పోలిస్తే చాలా తక్కువగానే నమోదైంది.

మన విద్యార్థులు ఇష్టపడుతున్న దేశాలు

యునైటెడ్ స్టేట్స్(అమెరికా), కెనడా, యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), ఆస్ట్రేలియా వంటి దేశాల్లో అధిక ఫీజులు, అత్యధిక జీవన వ్యయాలున్నా భారతీయ విద్యార్థుల విదేశీ విద్యకు ప్రసిద్ధ గమ్యస్థానాలుగా ఉన్నాయి. ఆ తర్వాత జర్మనీ, ఐర్లాండ్, సింగపూర్, రష్యా, ఫిలిప్పీన్స్, ఫ్రాన్స్, న్యూజిలాండ్‌లను ఎంపిక చేసుకుంటున్నారు. అలాగే, దేశానికి వచ్చే విదేశీ విద్యార్థుల్లో ఎక్కువ మంది దక్షిణాసియా, ఆఫ్రికన్ దేశాలకు చెందినవారే. నేపాల్ అత్యధిక సంఖ్యలో విద్యార్థులను భారతదేశానికి పంపుతోంది. 2014-15లో 21 శాతం నుంచి 2021-22లో 28శాతానికి పెరిగింది. 2014-15తో పోలిస్తే ఆఫ్ఘనిస్తాన్, భూటాన్, మలేషియా, సూడాన్, నైజీరియా విద్యార్థుల శాతం తగ్గింది. భారత్‌కు ఎక్కువ మంది విద్యార్థులను పంపుతున్న దేశాల వరుసలో ఆఫ్ఘనిస్తాన్ 6.72 శాతంతో రెండో, భూటాన్ 3.33 శాతంతో ఆరో దేశంగా నిలుస్తోంది. 2021-22లో అమెరికా విద్యార్థులు 6.71 శాతంతో మూడో స్థానాన్ని, బంగ్లాదేశ్ 5.55 శాతం, యూఏఈ 4.87 శాతంతో ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

ఎన్ని చేసినా ప్రయోజనం స్వల్పమే..

అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య క్షీణిస్తున్న క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ) 2020ను తెచ్చింది. ఎక్కువ మంది అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించే లక్ష్యంతో ప్రపంచ అధ్యయన గమ్యస్థానంగా భారత్‌ను తీర్చిదిద్దేందుకు అనేక ప్రతిపాదనలను రూపొందించింది. ఈ క్రమంలోనే యూజీసీ సైతం ద్వంద్వ, ఉమ్మడి డిగ్రీ ప్రోగ్రామ్‌లను అనుమతించేలా మార్గదర్శకాలను ప్రవేశపెట్టింది. 2018లో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టుగా స్టడీ ఇన్ ఇండియా ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. దీని ద్వారా అత్యుత్తమ స్కాలర్‌షిప్‌లు, ఫీజు మినహాయింపులను అందించేలా రూపొందించింది. అయితే భాగస్వామ్య దేశాలతో ఒప్పందాల ద్వారా విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు ప్రారంభించారు. కానీ, తగినన్ని నిధులు కేటాయించకపోవడంతో విదేశీ విద్యార్థులను దేశానికి ఆకర్షించడంలో ఈ కార్యక్రమం నత్తనడకన సాగడంతో విఫలమైంది. ప్రభుత్వం తీసుకున్న చొరవతో 2014-15 నుంచి 2019-20 ఆర్థిక సంవత్సరాల వరకు విదేశీ విద్యార్థుల నమోదు కేవలం 16.68శాతం మాత్రమే పెరిగిందని ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ డేటా చెబుతోంది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో కరోనా ఎఫెక్ట్‌తో విదేశీ విద్యార్థుల సంఖ్య 48,035కు, 2021-22లో 46,878కి తగ్గింది.

డీఎస్పీల బదిలీల్లోనూ వివక్ష

- రెడ్డి వర్గంలో ఒకరికీ దక్కని పోస్టింగ్
- టీడీపీ కూటమి తీరుపై సర్వత్రా విమర్శలు





సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి ప్రభుత్వం పోలీసు అధికారులపై కక్షసాధింపు చర్యల్లోనూ వికృత పోకడలకు బరితెగిస్తోంది. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట కక్షసాధింపు చర్యల్లో భాగంగా కొన్ని సామాజిక వర్గాలను లక్ష్యంగా చేసుకుంది. రాష్ట్రంలో డీఎస్పీల బదిలీ ప్రక్రియ ఇందుకు తాజా ఉదాహరణ. టీడీపీ కూటమి ప్రభుత్వం భారీస్థాయిలో 96 మంది డీఎస్పీలను గురువారం బదిలీ చేసింది. వారిలో బదిలీ చేసిన 96 మంది జాబితాలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన డీఎస్పీలు 15 మంది ఉన్నారు. ఆ 15 మందిలో కనీసం ఒక్కరంటే ఒక్కరికి కూడా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడం విభ్రాంతి కలిగిస్తోంది. జి.నాగేశ్వర్‌రెడ్డి (కాశీబుగ్గ), కె.శ్రీనివాసరెడ్డి (తూర్పు గోదావరి క్రైం), వి.నారాయణస్వామి రెడ్డి (భీమవరం), పి.మురళీకృష్ణారెడ్డి(విజయవాడ వెస్ట్ ఏసీపీ), పి.వీరాంజనేయరెడ్డి (నెల్లూరు రూరల్), ఎం.సూర్యనారాయణరెడ్డి (గూడూరు), వి.శ్రీనివాసరెడ్డి (నాయుడుపేట), బి.ఉమామహేశ్వరరెడ్డి (శ్రీకాళహస్తి), వై.శ్రీనివాసరెడ్డి (డోన్), జి.ప్రభాకర్‌రెడ్డి (మదనపల్లి), జి.శివభాస్కర్‌రెడ్డి (గుంతకల్లు), ఎన్.రవీంద్రనాథ్ రెడ్డి (నంద్యాల), పి.రవీంద్రనాథ్‌రెడ్డి (ఇంటెలిజెన్స్), వి.వేణుగోపాల్‌రెడ్డి, (ఇంటెలిజెన్స్), జి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి (ఇంటెలిజెన్స్)లను బదిలీ చేస్తూ వారికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. అంటే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పోలీసు అధికారులను ఉద్దేశపూర్వకంగా వేధించాలన్నది టీడీపీ విధానంగా చేసుకుందన్నది స్పష్టమవుతోంది. ఇంకా అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి, నెల్లూరు టౌన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, ఆత్మకూరు డీఎస్పీ కోటా రెడ్డి ఉన్నారు. వారిని కూడా బదిలీ చేస్తున్నట్టు ఇప్పటికే మౌఖికంగా చెప్పేశారని సమాచారం. అన్ని విభాగాల్లో కలిపి మొత్తం 300 మందికి పైగా డీఎస్పీలను బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వారిలో మొదటి విడతలో 96 మందిని బదిలీ చేసింది. మరో రెండు విడతల్లో మిగిలిన వారిని బదిలీ చేయనుంది.

బీబీఏ, బీసీఏ కోర్సు కనీస ఫీజు రూ.18 వేలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో తొలిసారి ప్రవేశపెట్టిన బీసీఏ, బీబీఏ కోర్సులకు ఏడాదికి కనీస ఫీజును రూ.18 వేలుగా నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకు ఈ ఫీజులు వర్తిస్తాయని ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సుమారు 35 ఇంజనీరింగ్ కళాశాలల్లో ఈ డిగ్రీ కోర్సులు తొలిసారిగా అందుబాటులోకి వచ్చాయి. ఇందులో గరిష్ట ఫీజు రూ.30 వేలుగా నిర్ణయించారు. వాస్తవానికి బీబీఏ, బీసీఏ కోర్సులకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) నుంచి అనుమతులు తీసుకోవాల్సి రావడంతో డిగ్రీ ప్రవేశాల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. కాగా, రాష్ట్రంలో డిగ్రీ ప్రవేశాల షెడ్యూల్ రెండు సార్లు వాయిదా పడింది. అయితే ఏఐసీటీఈ బీబీఏ, బీసీఏ కోర్సులు కోసం దరఖాస్తు చేసుకున్న ఇంజనీరింగ్ కళాశాలలు అనుమతివ్వడం, రాష్ట్ర ప్రభుత్వం వాటిని పరిశీలించి తొలిసారిగా ఫీజులు నిర్ణయించడంలో డిగ్రీ అడ్మిషన్లు అనుకున్న సమయంలో పూర్తి కాలేదు. గురువారం నుంచి డిగ్రీ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకున్న అభ్యర్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకుంటున్నారు. 5వ తేదీ వరకు ఆప్షన్ల ఎంపికకు ఉన్నత విద్యామండలి అవకాశం కల్పించగా.. 6వ తేదీ ఆప్షన్లలో మార్పులు చేసుకోవచ్చని సూచించింది. 10వ తేదీన డిగ్రీ సీట్లు కేటాయింపు చేపట్టి 12వ తేదీ తరగతులు ప్రారంభించనుంది. సీట్లు పొందిన అభ్యర్థులు 16వ తేదీలోగా ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

1.63 లక్షల దరఖాస్తులు

ఏపీలోని డిగ్రీ కోర్సుల్లో మొత్తం 3.50 లక్షల సీట్లుండగా.. ఏటా 50 శాతం లోపు సీట్లు భర్తీ అవుతున్నాయి. ఈ ఏడాది 1.63 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఇటీవల బీబీఏ, బీసీఏ కోర్సులకు డిమాండ్ పెరగడంతోనే ఇంజనీరింగ్ కాలేజీలు సైతం ఈ కోర్సులను ప్రవేశపెట్టడం గమనార్హం. వీటితో పాటు మొత్తం డిగ్రీ కాలేజీల్లో దాదాపు 800 కళాశాలల్లో బీబీఏ, బీసీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

సాగర్‌లో 182.95 టీఎంసీలు

సాక్షి, అమరావతి/శ్రీశైలం ప్రాజెక్టు/ధవళేశ్వరం/పోలవరం రూరల్/సాక్షి, అమలాపురం: నాగార్జునసాగర్‌లోకి కృష్ణా వరద ఉధృతి మరింత పెరిగింది. ప్రాజెక్టులో గురువారం .6 గంటలకు 3,69,866 క్యూసెక్కుల వరద చేరుతుండడంతో నీటినిల్వ 537.4 అడుగుల్లో 182.95 టీఎంసీలకు చేరుకుంది. నాగార్జునసాగర్ గరిష్ట నీటిమట్టం 590 అడుగులు కాగా.. పూర్తి నీటినిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు. సాగర్ నిండాలంటే ఇంకా 129.1 టీఎంసీలు అవసరం. ఎగువ నుంచి వరద ఉధృతి ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో మరో మూడు, నాలుగు రోజుల్లో సాగర్ నిండుతుందని అధికార వర్గాలు వెల్లడించాయి. అటు జూరాల.. ఇటు సుంకేశుల బ్యారేజ్ నుంచి శ్రీశైలం ప్రాజెక్టులోకి 4,64,019 క్యూసెక్కులు చేరుతుండంతో పదిగేట్లు 18 అడుగుల మేర ఎత్తి 4,31,370 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ కుడి కేంద్రం నుంచి 24,917, ఎడమ కేంద్రం నుంచి 35,315 వెరసి 4,91,602 క్యూసెక్కులు దిగువకు వదిలేస్తున్నారు. దీంతో నాగార్జునసాగర్‌లోకి చేరుతున్న వరద ప్రవాహం గంట గంటకూ పెరుగుతోంది. మరోవైపు.. మహారాష్ట్ర, కర్ణాటకలోని పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో కృష్ణా ప్రధాన పాయ నుంచి ఆల్మట్టిలోకి వరద ఉధృతి మరింత పెరిగింది.

- ఆల్మట్టిలోకి 3.41 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా 3.50 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు.
- నారాయణపూర్ డ్యాంలోకి 3.35 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా 3.25 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.
- అలాగే, జూరాల ప్రాజెక్టులోకి 3.15 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా 3.03 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు.
- తుంగభద్రలో వరద ఉధృతి మరింత పెరిగింది. ఈ డ్యామ్‌లోకి 1,98,109 క్యూసెక్కులు చేరుతుండగా 1,79,973 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు.
- మంత్రాలయం వద్ద తుంగభద్ర నీటి మట్టం 311 మీటర్ల(సముద్ర మట్టానికి)కు చేరుకుంది. దీంతో మంత్రాలయం వద్ద అధికారులు ప్రమాద హెచ్చరికను జారీచేసి నదీ తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు.
- ఈ నేపథ్యంలో.. శుక్రవారం శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ఉధృతి మరింత పెరగనుంది.



పోలవరం ప్రాజెక్టు దిగువన ప్రవహిస్తున్న గోదావరి వరద

గోదావరిలో తగ్గుతున్న వరద..

ఇక ఎగువన వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గోదావరిలో వరద ప్రవాహం క్రమేణ తగ్గుతోంది. ధవళేశ్వరం బ్యారేజ్‌లోకి గురువారం రాత్రి 7 గంటలకు 10,39,697 క్యూసెక్కులు చేరుతుండగా గోదావరి డెల్టాకు అధికారులు 8,800 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 10,30,897 క్యూసెక్కులను 175 గేట్లను ఎత్తేసి సముద్రంలోకి వదిలేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజ్ వద్ద గోదావరి నీటిమట్టం 12.10 అడుగులుగా ఉంది. ఎగువ నుంచి భద్రాచలం వద్దకు చేరుతున్న వరద 8.41 లక్షల క్యూసెక్కులకు తగ్గడంతో అక్కడ నీటి మట్టం 40.30 అడుగులకు తగ్గింది. పోలవరం ప్రాజెక్టులోకి వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు వదిలేస్తున్నారు. ఇక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గడిచిన 24 గంటలుగా వరద నిలకడగా ఉంది. గ్రామాల్లో ముంపు కొనసాగుతోంది. దీంతో అన్ని వర్గాల వారు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

హామీలిచ్చాం కానీ.. ఖజానా ఖాళీ

▶ మొదటి పేజీ తరువాయి

మాట్లాడారు. సున్నిపెంటలోని యువత న్యూయార్క్‌లో ఉద్యోగం సంపాదించేలా స్కిల్స్ డెవలప్ చేస్తామన్నారు. సముద్రంలోకి వెళ్లే నీటిని రాయలసీమకు తరలించి సీమలోని జలాశయాలన్నింటినీ నింపుతామన్నారు. రానున్న ఐదేళ్లలో కరువు అనే మాట వినపడకుండా ప్రణాళికలు తయారు చేసే బాధ్యత తాను తీసుకుంటానని మల్లన్న సాక్షిగా చెబుతున్నట్లు పేర్కొన్నారు.

సీమకు పరిశ్రమలు తెస్తాం

రాయలసీమలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటామని చంద్రబాబు తెలిపారు. ఆర్థికంగా స్థితిమంతులైన ప్రతి ఒక్కరూ 25 మందిని వృద్ధిలోకి తెచ్చేందుకు సహకరిస్తే సమాజంలో పేదరికం అనేది లేకుండా పోతుందన్నారు. నాకు సంపద సృష్టించడం తెలుసు.. దాన్ని పేదలకు పంచడమూ తెలుసని చంద్రబాబు వ్యాఖ్యానించారు. శ్రీశైలం దివ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందేలా సహకారం అందిస్తామన్నారు. కేంద్రంతో చర్చించి సిద్ధేశ్వరం వద్ద ఐకానిక్ హైవే బ్రిడ్జితో పాటు బ్యారేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



పెద్దదోర్నాల వద్ద బస్సును ఆపేసిన పోలీసులు

రాళ్లపల్లి, రత్నగిరిలో రిజర్వాయర్లు..

శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం గుండుమలలో రామన్న అనే పింఛన్‌దారుడి ఇంటికి వెళ్లిన సీఎం చంద్రబాబు రూ.4 వేలు పింఛన్ అందించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. గ్రామంలోని కరియమ్మదేవి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. హంద్రీనీవాలో భాగంగా మడకశిర నియోజకవర్గంలో రాళ్లపల్లి, రత్నగిరి వద్ద రిజర్వాయర్లు నిర్మించి సాగు, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

ప్రయాణికులకు అవస్థలు

శ్రీశైలంలో సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా అక్కడకు 50 కి.మీ. దూరంలో ఉన్న ప్రకాశం జిల్లా పెద్దదోర్నాలలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆర్టీసీ బస్సులు నిలిపివేయడంతో భక్తులు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

వర్గీకరణపై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం..

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని సుప్రీం ధర్మాసనం తీర్పు వెలువరించడాన్ని స్వాగతిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. సామాజిక న్యాయం కోసం ఏబీసీడీ వర్గీకరణ విధానం తెచ్చామన్నారు. తమ ప్రభుత్వం సామాజిక సమతుల్యాన్ని పాటిస్తుందన్నారు.

లోక్‌సభ — ఏపీ ఇన్ పార్లమెంట్ — రాజ్యసభ

విద్యా రంగానికి వైఎస్సార్‌సీపీ పెద్దపీట



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో విద్యా రంగానికి వైఎస్సార్‌సీపీ పెద్దపీట వేసిందని.. ఆ రంగంలో అనూహ్య మార్పులు తీసుకొచ్చిందని ఎంపీ తనూజరాణి తెలిపారు. అమ్మ ఒడి పథకం ద్వారా 84 లక్షల మంది విద్యార్థులకు సుమారు రూ.19వేల కోట్లు కేటాయించి వారి విద్య కొనసాగేలా మాజీ సీఎం జగన్ చర్యలు తీసుకున్నారని తెలిపారు. గురువారం లోక్‌సభలో బడ్జెట్‌లో విద్యా శాఖ పద్దులపై ఆమె మాట్లాడారు. విభజన తర్వాత నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అమలు చేయకపోవడం వల్ల పలు రంగాలపై ప్రభావం పడిందన్నారు. జూన్ 2023లోనే 10వేల డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ప్రారంభించి దేశంలోనే తొలి రాష్ట్రంగా ఏపీ నిలిచిందని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయికి ఎదగాలని వైఎస్ జగన్ లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు.

2026 మార్చికి పోలవరం తొలి దశ పూర్తి

పోలవరం జాతీయ ప్రాజెక్టు తొలి దశ 2026 మార్చికల్లా పూర్తవుతుందని కేంద్ర జల్‌శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి వెల్లడించారు. అదే ఏడాది పోలవరం ప్రాజెక్టులో 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలో నీటిని నిల్వ చేస్తామని చెప్పారు. లోక్‌సభలో టీడీపీ సభ్యులు పుట్టా మహేశ్‌కుమార్, తెన్నేటి కృష్ణప్రసాద్ అడిగిన ప్రశ్నలకు మంత్రి జవాబిచ్చారు.

పట్టణ జనగణన అత్యవసరంగా చేపట్టండి



సాక్షి, న్యూఢిల్లీ: రోజురోజుకీ పెరుగుతున్న పట్టణ జనాభా లెక్కలు సేకరించడం అత్యవసరమని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. గురువారం రాజ్యసభలో గృహ, పట్టణ వ్యవహారాల శాఖ పద్దులపై చర్చలో ఆయన మాట్లాడారు. 2011 లెక్కల ప్రకారం 31శాతం జనాభా (37.7 కోట్లు) పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారని.. ప్రస్తుతం అది 50 కోట్లకు చేరుకుందని అన్నారు. జనాభా ఆకస్మిక అవసరాలను ఉత్తమంగా పరిష్కరించే పట్టణ ప్రణాళికలు రూపొందించాలంటే పట్టణ జనగణన చాలా ముఖ్యమన్నారు. 23 లక్షల జనాభా కలిగిన విశాఖపట్నంలో మెట్రో రైలు ఏర్పాటు విభజన చట్టంలో ఉందన్నారు. చట్టం ప్రకారం 76.90 కి.మీ. లైట్ మెట్రో సొకర్యాన్ని అత్యాధునికంగా నిర్మించాలని ప్రభుత్వం ప్రణాళిక ప్రకటించిందన్నారు. ఈ హామీ ఇప్పటికీ అమలు కాలేదని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన ప్రభుత్వం వల్ల ప్రజా రవాణా హక్కు నిరాకరణకు ప్రజలు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు త్వరగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.